# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 30 మార్చి 2026 | సంపుటి: 22 | సంచిక: 183 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## మాంసం ప్రియులకు షాక్

### ఏప్రిల్ 1 నుంచి చికెన్ దుకాణాలు బంద్..!

తెలంగాణలో మాంసం ప్రియులకు ఇది షాకింగ్ న్యూస్ అని చెప్పవచ్చు. రాష్ట్రంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి చికెన్ దుకాణాలు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్ తగ్గించి తమను నష్టాలకు గురిచేస్తున్నాయంటూ రాష్ట్రవ్యాప్తంగా బంద్ పాటించాలని తెలంగాణ రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది.

- హైదరాబాద్, మార్చి 29 (నినాదం)

2







## కేరళలో మార్పు తప్పదు

### కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కలిసి ప్రభుత్వ నిధులను దోచేశాయి: మోదీ

- పాలక్కాడ్‌లో ప్రధాని ఎన్నికల ప్రచారం
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తక్కువ ఉండేలా
- కేంద్ర ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని వ్యాఖ్య

కేరళలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కలిసి ప్రభుత్వ నిధులను దోచేశాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవినీతిపరులు దోచుకున్న డబ్బును తిరిగి వసూల్ చేసి కేరళ అభివృద్ధికి ఖర్చుచేస్తుందని తెలిపారు. ఈసారి రాష్ట్రంలో ఎన్‌డీఏ అధికారం చేపట్టబోతోందని జోస్యం చెప్పారు.

- పాలక్కాడ్, (నినాదం)

2

కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని తగ్గించింది...

## మీరు వ్యాట్ తగ్గించండి



### రాష్ట్ర ప్రభుత్వానికి కిషన్‌రెడ్డి సూచన

- పెట్రోలు, డీజిల్‌పై దేశంలోనే అత్యధికంగా వ్యాట్ విధిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ
- పెట్రోల్ సమస్యలను ఉద్దేశించి కేంద్రం చేపట్టిన చర్యలను వివరించిన కిషన్‌రెడ్డి

2

## తల్లిదండ్రుల సంరక్షణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

### కన్నవారికి అండగా ఉండేందుకు కొత్త చట్టం

ఉద్యోగుల జవాబుదారీతనం, పర్యవేక్షణ బిల్లు-2026 ప్రవేశపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి

తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఇలాంటి చట్టం తీసుకొచ్చామని వెల్లడి

సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరిస్తున్నారని ఆవేదన

**పిల్లలు రెక్కలు వచ్చాక తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదు వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలవాలనే చట్టం తీసుకొచ్చాం. మన దేశంలో బాలలు, వృద్ధులు, వికలాంగుల కోసం అనేక చట్టాలు ఉన్నాయి. జువైనల్ చట్టం, విద్యాహక్కు చట్టం, పోక్సో చట్టం ఇలా ఎన్నో చట్టాలు తెచ్చాం. వృద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చింది. కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు రూ.10 వేలకు మించకుండా ఇవ్వాలని ఉంది. కేంద్ర చట్టం ప్రకారం రూ.10 వేలకు మించి ఇచ్చే అవకాశం లేదు. మేం తెచ్చిన చట్టం ప్రభుత్వ ఉద్యోగులకే కాదు. ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తుంది. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తిని సామాజికంగా బహిష్కరించాలి. తల్లిదండ్రులను చూసుకోలేనోడు సమాజంలో బతకడానికి వీల్లేదు. సామాజిక బాధ్యతగా ఈ చట్టాన్ని తీసుకువచ్చాం, అందరూ మద్దతు ఇవ్వాలి**

- రేవంత్ రెడ్డి, సీఎం



**హైదరాబాద్, మార్చి 29 (నినాదం):** రాష్ట్రంలోని వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కుటుంబ వ్యవస్థల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో పెద్దలను నిర్లక్ష్యం చేసే ఘటనలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం "తల్లిదండ్రుల సంరక్షణ – ఉద్యోగుల బాధ్యత బిల్లు"ను రూపొందించింది. ఈ బిల్లును శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు. తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ద్వారా ఉద్యోగులు తమ తల్లిదండ్రులను సంరక్షించకపోతే వారి వేతనం నుంచి ఒక భాగాన్ని నేరుగా తల్లిదండ్రులకు అందించే విధానం అమల్లోకి రానుంది. పిల్లల కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తారన్న రేవంత్ రెడ్డి, పిల్లలు మాత్రం ...మిగతా 2లో



రష్యా కీలక పోర్టుపై

## ఉక్రెయిన్ పంజా

### నిలిచిన ఇంధన ఎగుమతులు

ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దేశ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయలాంటి ఉస్ట్–లుగా ఓడరేవుపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. బాల్టిక్ సముద్ర తీరంలో ఉన్న ఈ పోర్టులోని గ్యాస్ టెర్మినల్‌పై జరిగిన దాడితో భారీగా మంటలు చెలరేగాయి. ఫలితంగా, అక్కడి కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి.

- న్యూఢిల్లీ, (నినాదం)

2



టీవీకే అభ్యర్థుల జాబితా

## విడుదల

### రెండుచోట్ల నుంచి విజయ్ పోటీ

తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. టీవీకే అభ్యర్థుల జాబితాను పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. విజయ్ రెండు చోట్ల నుంచి పోటీ చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి ఆయన బరిలోకి దిగుతున్నారు. చెన్నైలో జరిగిన సభలో విజయ్ ఈ జాబితాను విడుదల చేశారు. తన అభ్యర్థులను ప్రజల రక్షకులుగా అభివర్ణించారు. వారు రాజకీయ దిగ్గజాలు కాదని, ప్రజలకు జవాబుదారీగా ఉంటారని పేర్కొన్నారు.

- చెన్నై, (నినాదం)

2

## పొంగులేటిని బర్తరఫ్ చెయ్యాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల లేఖ

**కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, కుంభకోణాలపై విచారణ జరపాలని డిమాండ్**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం లేఖ రాసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి కుంభకోణాలపై విచారణ జరపాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆ లేఖలో డిమాండ్ చేశారు. అవినీతి, కుంభకోణాలపై సభా సంఘం లేదా సిట్టింగ్ జడ్జితో పాటు మరో 19 అంశాలపై విచారణ చేయించాలని పేర్కొన్నారు.

-హైదరాబాద్, మార్చి 29 (నినాదం)


2

రాష్ట్రవ్యాప్తంగా

## పసుపు పండుగ

### ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు

2



బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల

## సస్పెన్షన్

### తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు



ఆమోదించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు రెండు రోజులపాటు ..

2

## బలపడ్డ పచ్చ బంధం!

### బీఆర్‌ఎస్‌కు రమణ...రామ్.. రామ్!

**కీలక సమావేశానికి దుమ్మా! శల్య సారథ్యం తేటతెల్లం!**



**వెనుకా ముందు ఆలోచించకుండా తొందరపాటు నిర్ణయం తీసుకున్నామని 60 కోట్లు ఖర్చు చేసి బీసీ నాయకుడు అని ఎల్ రమణను ఎమ్మెల్సీ చేస్తే పార్టీకి ఆయన చేసింది ఏమీ లేదని కేటీఆర్ తన అనుంగులతో విచారం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.!**

12

- జగిత్యాల ప్రతినిధి మార్చి 29 నినాదం



భారత్‌కు మరో రెండు

## ఎల్‌పీజీ నౌకలు

### దేశం మొత్తానికి ఒక రోజుకు సరిపడా వంటగ్యాస్

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, వంటగ్యాస్ కొరతతో ఇబ్బంది పడుతున్న భారత్‌కు పెద్ద ఊరట లభించింది. భీకర దాడులతో అట్టుడుకుతున్న హార్ముజ్ జలసంధి గుండా భారత జెండాతో ఉన్న మరో రెండు ఎల్‌పీజీ కార్గో నౌకలు సురక్షితంగా బయటపడ్డాయి.


- న్యూఢిల్లీ, (నినాదం)

2

## వివాదాలకు కేరాఫ్‌గా ఎస్సీ హాస్టల్స్

### సంక్షేమ అధికారి ఉన్నట్టా..!? లేనట్టా..!?

- పరిపాలనా లోపాలకు నిదర్శనాలు ఎన్నో ఘటనలు
- హెచ్‌డబ్ల్యూవోల ఇష్టారాజ్యం.. ప్రభుత్వ ఆస్తుల రక్షణపై అనుమానాలు
- రికార్డుల భద్రత.. విద్యార్థుల భవితవ్యంపై నీలినీడలు
- జిల్లాలో ఎస్సీ హాస్టళ్లలో అస్తవ్యస్థ పరిస్థితులు
- కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజా సంఘాల డిమాండ్




2

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి28(నినాదం)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని ఎస్సీ డిపార్ట్మెంట్‌కు చెందిన వసతి గృహాల వ్యవస్థ పూర్తిగా క్రమశిక్షణ కోల్పోయి, పరిపాలన అస్తవ్యస్థ పరిస్థితుల్లో కొనసాగుతోందన్న ఆందోళన తాజా పరిస్థితులను చూస్తే వ్యక్తమవుతోంది.

కామారెడ్డి జిల్లాలో

## రోడ్డు ప్రమాదం

### ముగ్గురి మృతి




కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. గాంధారి మండలంలోని రాంపూర్ గడ్డ సమీపంలో కల్వర్టు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో ముగ్గురు కూలీలు మృతిచెందారు. అధిక వేగంతో గాంధారి వైపు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుల తల, ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో వారు అక్కడిక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతులను ముఖియా (21), రాహుల్ (21), జావీద్ (22)గా గుర్తించారు.

-కామారెడ్డి, (నినాదం)



2

## అమెరికాకు భారీ ఎదురుదెబ్బ

### ఇరాన్‌పై యుద్ధంలో అవాక్స్ విమానం ధ్వంసం

- సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై ఇరాన్ భీకర దాడి
- రష్యా ప్రమేయం ఉందన్న అనుమానాలు

ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో అమెరికాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. కదన రంగంలో దళాలకు కళ్లు, చెవుల మాదిరిగా ఉపయోగపడే నిఘా విమానం ఈ3–సెంట్రీపై ఇరాన్ దాడి చేసి ధ్వంసం చేసింది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌లో ఈ ఘటన చోటుచేసుకొంది.

-న్యూఢిల్లీ (నినాదం)



## వివక్ష చూపొద్దు

### నిధుల కోసం మంత్రులు, సీఎం చుట్టూ తిరగాలా?: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

2

మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులు ఇవ్వడం లేదని ఆక్షేపించారు. మంత్రుల నియోజకవర్గంలో మాత్రమే బిల్లులు వస్తున్నాయని, ప్రభుత్వం అంటే మంత్రులు మాత్రమే కాదని వ్యాఖ్యానించారు.

- హైదరాబాద్, (నినాదం)



## రాష్ట్రవ్యాప్తంగా పసుపు పండుగ

**అమరావతి, మార్చి 29 (నినాదం)**

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా శ్రేణులు పండుగలా జరుపుకుంటున్నాయి. ఈ సందర్భంగా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాల్గొన్నారు. పార్టీ భారీ జెండాను ఆవిష్కరించి, వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఎన్టీ రామారావు విగ్రహానికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఇతర ముఖ్య నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలను చంద్రబాబు పేరుపేరునా పలకరించి, వారిలో ఉత్సాహం నింపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు పాల్గొన్నారు. వేదికపై ఉన్న ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన తర్వాత, పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలను వేదికపైకి ఆహ్వానించి, వారితో కలిసి ఆశీనులవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేవలం పార్టీ కార్యాలయంలోనే కాకుండా, రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలోనూ టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నాయి. పార్టీ జెండాలు ఎగురవేసి, మిఠాయిలు పంచుతూ ఆనందాన్ని పంచుకుంటున్నారు. 1982లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ, నేడు 44 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో ఏపీ పసుపుమయంగా మారింది.

### రికార్డులు సృష్టించాలన్నా.. తిరగరాయాలన్నా
## టీడీపీతోనే సాధ్యం
### మంత్రి నారా లోకేశ్

**అమరావతి, మార్చి 29 (నినాదం)**



దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం అని, రికార్డులు సృష్టించాలన్నా, వాటిని తిరగరాయాలన్నా అది ఒక్క టీడీపీతోనే సాధ్యమని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సభలో ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు. జెండా మోసే కార్యకర్తలే పార్టీకి నిజమైన అధినేతలని, వారిని కాపాడుకోవడమే తన ప్రథమ కర్తవ్యమని ప్రకటించారు.

పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, అధినేత చంద్రబాబు దేశానికి చేసిన సేవలను లోకేశ్ గుర్తుచేశారు. ''ఎన్టీఆర్ తెచ్చిన సంక్షేమ పథకాలు, పాలనా సంస్కరణల గురించి చెప్పాలంటే రోజంతా పడుతుంది. చంద్రబాబు గారికి 75 ఏళ్లు వచ్చినా, ఆయన పనితీరు 25 ఏళ్ల యువకుడి వేగంతో (స్పీడ్ 25) ఉంటుంది'' అని కొనియాడారు. అబ్దుల్ కలాంను రాష్ట్రపతిని చేయడంలో, దళితుడిని లోక్‌సభ స్పీకర్‌గా నిలబెట్టడంలో చంద్రబాబు దార్శనికత గొప్పదని పేర్కొన్నారు.

గత ప్రభుత్వంపై లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ''క్లేమోర్ మైన్లకే భయపడని రక్తం మాది. అలాంటిది అక్రమ కేసులకు భయపడతామా? టీడీపీ అడ్రస్ లేకుండా చేస్తామన్న వాళ్లే ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారు'' అని అన్నారు. కార్యకర్తల సంక్షేమానికి రూ.150 కోట్లు ఖర్చు చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని తెలిపారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను గ్రామ స్థాయి నుంచి పొలిట్‌బ్యూరో స్థాయికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు అహంకారం వీడి ప్రజలతో మమేకం కావాలని, లేదంటే గత పాలకుల గతే పడుతుందని హితవు పలికారు. మాజీ సీఎం జగన్‌పై లోకేశ్ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. ''జగన్‌కు 'క్రెడిట్ చోరీ డిజార్డర్' అనే వింత వ్యాధి వచ్చింది. అందుకే ఇతరుల కష్టాన్ని తన ఖాతాలో వేసుకుంటున్నారు. ఆయన ఈ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవాలి'' అని ఎద్దేవా చేశారు. 2024లో ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని, ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతోందని లోకేశ్ తెలిపారు.

**పార్టీ జెండా ఆవిష్కరించి వేడుకలు ప్రారంభించిన చంద్రబాబు**

మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాంసం ప్రియులకు షాక్

ఈ పిలుపునకు ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని చికెన్ సెంటర్ల నిర్వాహకులు ఇప్పటికే బంద్‌కు మద్దతు ప్రకటించారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల్ కళాశాల మైదానంలో శనివారం చికెన్ సెంటర్ల నిర్వాహకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌల్ట్రీ కంపెనీలు తమకు రావాల్సిన మార్జిన్‌ను ఏకపక్షంగా తగ్గించి తమను నష్టాలపాలు చేస్తున్నాయని ఆరోపించారు. దీనివల్ల వ్యాపారం చేయడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. తగ్గించిన మార్జిన్‌ను తిరిగి సవరించి, తమకు న్యాయం చేసేవరకు పోరాటం ఆపేది లేదని స్పష్టంచేశారు. ఈ బంద్‌లో రాష్ట్రంలోని అన్ని చికెన్ సెంటర్ల యజమానులు పాల్గొంటారని తెలిపారు.

### రష్యా కీలక పోర్టుపై
## ఉక్రెయిన్ పంజా

ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దేశ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయలాంటి ఉస్ట్-లుగా ఓడరేవుపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. బాల్టిక్ సముద్ర తీరంలో ఉన్న ఈ పోర్టులోని గ్యాస్ టెర్మినల్‌పై జరిగిన దాడితో భారీగా మంటలు చెలరేగాయి. ఫలితంగా, అక్కడి కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు సమీపంలో ఉన్న ఉస్ట్-లుగా పోర్టు రష్యా ఇంధన ఎగుమతులకు అత్యంత కీలకమైన కేంద్రం. ఐరోపా, ఆసియా దేశాలకు ఇక్కడి నుంచే అధిక మొత్తంలో చమురు, గ్యాస్ సరఫరా అవుతాయి. ఉక్రెయిన్ ప్రయోగించిన సుదూర శ్రేణి డ్రోన్లు రష్యా గగనతల రక్షణ వ్యవస్థలను దాటుకుని, నేరుగా గ్యాస్ నిల్వ ట్యాంకర్లను ఢీకొట్టాయి. దీంతో అక్కడ పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం సంభవించి, కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రష్యా యుద్ధ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఉక్రెయిన్ గత కొంతకాలంగా ఇలాంటి దాడులకు పాల్పడుతోంది. రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన నిల్వ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటోంది. తాజా దాడిలో చమురు శుద్ధి యంత్రాలు (ఫ్రాక్షనేషన్ టవర్లు) దెబ్బతినడంతో రష్యా ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ దాడిని రష్యా రక్షణ శాఖ ధృవీకరించింది. కొన్ని డ్రోన్లను కూల్చివేశామని, అయితే మరికొన్ని లక్ష్యాన్ని ఛేదించాయని తెలిపింది. దీనిని ఒక 'ఉగ్రవాద చర్య'గా అభివర్ణించిన రష్యా, తగిన ప్రతీకారం తీర్చుకుంటామని ఉక్రెయిన్‌ను హెచ్చరించింది.

# తల్లిదండ్రుల సంరక్షణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

మొదటి పేజీ తరువాయి



రెక్కలు వచ్చాక తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఈ చట్టం తీసుకొచ్చామని అన్నారు. మన దేశంలో బాలలు, వృద్ధులు, వికలాంగుల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, జువైనల్ చట్టం, విద్యాహక్కు చట్టం, పోక్సో చట్టం ఇలా ఎన్నో చట్టాలు తెచ్చామని, వృద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు రూ.10 వేలకు మించకుండా ఇవ్వాలని ఉందని, కేంద్ర చట్టం ప్రకారం రూ.10 వేలకు మించి ఇచ్చే అవకాశం లేదని తెలిపారు. ఈ బిల్లుకు అందరూ మద్దతు ఇవ్వాలి : సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరిస్తున్నారని, ఆత్మీయతకు సంబంధించిన అంశంపై చట్టం తీసుకురావటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అత్తింటికి వెళ్లిన ఆడపిల్లలు తల్లిదండ్రుల బాగోగులు చూడలేని పరిస్థితులు ఉన్నాయని, తాము తెచ్చిన చట్టం ప్రభుత్వ ఉద్యోగులకే కాదని, ప్రజాప్రతినిధులకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తిని సామాజికంగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను చూసుకోలేనోడు – సమాజంలో బతకడానికి వీల్లేదని అన్నారు. సామాజిక బాధ్యతగా ఈ చట్టాన్ని తీసుకువచ్చామని, అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. సీఎం ప్రసంగం అనంతరం తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

## పొంగులేటిని బర్తరఫ్ చెయ్యాలి

విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులతో సహా ఇతర ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామా చేయాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం సభ్యులు డిమాండ్ చేశారు. అవినీతి, కుంభకోణాలపై లేఖ రాస్తే విచారణ జరుపుతామని శాసనసభలో స్వయంగా సీఎం ప్రకటించారని, కాంగ్రెస్ పాలనలో జరిగిన కుంభకోణాల వివరాలు అందిస్తున్నామని ఆ లేఖతో పేర్కొన్నారు. మాటపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ కుంభకోణాలపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, ఇందులో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.



**సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి :**

అంతకుముందు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అక్రమ మైనింగ్ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చెయ్యాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. ఆ పార్టీ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. శాసనసభ సమావేశాలకు వెళ్తూ ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళనకు దిగారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై ఆధారాలతో సహా బయట పెట్టామని, అవినీతి మంత్రిపై హౌస్ కమిటీ వెయ్యాలని, అవసరమైతే సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ఇతర సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ఎందుకు అలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తప్పుచేయకపోతే భయమెందుకని నిలదీశారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూసి, దిగి రాకపోతే గవర్నర్‌ను కలిసి చర్యలు తీసుకోవాలని అడుగుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి కుటుంబాన్ని ఎందుకు కాపాడాలని ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. మెట్రో భూముల అంశంపై ప్రభుత్వ చర్యలను కేటీఆర్ తప్పుబట్టారు. కాంగ్రెస్ అడ్డగోలు పాలనపై బీజేపీ మద్దతు ఇస్తున్నట్లు ఉందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై పోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

తెలంగాణలో మైనింగ్ అక్రమాలపై హౌసింగ్ కమిటీ వేయాలంటూ శాసనసభలో ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించగా సభ్యుల అంగీకారంతో తీర్మానాన్ని ఆమోదించారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు రెండు రోజులపాటు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను సస్పెండ్ చేశారు.

సస్పెండ్ అయిన ఎమ్మెల్యేలు : దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని, జగదీశ్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, పద్మారావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మర్రి రాజశేఖరరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, కె.పి.వివేకానంద్, అనిల్‌జాదవ్, కోవ లక్ష్మి లపై సస్పెన్షన్ వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

బెదిరించే ధోరణిలో కౌశిక్‌రెడ్డి ప్రవర్తన : అదే విధంగా సీనియర్ శాసనసభ్యుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని బెదిరించే ధోరణిలో అసభ్యంగా సైగలు చేశారంటూ హుజూరాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశికర ్డిపైనా చర్యలకు తీర్మానించారు. కౌశిక్‌రెడ్డి వ్యవహారాన్ని విచారణ చేయాలని నైతిక కమిటీకి సిఫారసు చేశారు.

ఆయన ప్రవర్తనను కేటీఆర్, హరీశ్ సమర్థిస్తారా? : ప్రజాజీవితంలో నుంచి వచ్చిన కడియం శ్రీహరి కేసీఆర్‌కు సరిసమానమైన ప్రజాప్రతినిధి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కడియం శ్రీహరి నిజాయితీ, నిబద్ధతను ఈ దేశంలోనే ఎవరూ ప్రశ్నించలేరని తెలిపారు. ఆయన పట్ల కౌశిక్‌రెడ్డి ప్రవర్తనను కేటీఆర్, హరీశ్‌రావు సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. ఈ విధానాన్ని ఇక్కడే నిలువరించాలని అభిప్రాయపడ్డారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనను ఇప్పుడు సభ క్షమిస్తే భవిష్యత్‌లో సభలో కత్తిపోట్లు, కుస్తీల పోటి జరగాల్సిన పరిస్థితి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు చర్చలో పాల్గొని సహకరిస్తే వారిని సభలో కొనసాగించండి లేదంటే, సభ వ్యవహారాలు నిర్వహించుకునేందుకు వీలుగా వారిని సభ నుంచి రెండురోజులు సస్పెండ్ చేయండి అని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పాలనలో దొరలకే పాలన పగ్గాలు కట్టబెట్టారన్న సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు దళిత వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని మండిపడ్డారు. దళితుడు ఆర్థిక మంత్రి, ఉపముఖ్యమంత్రిగా ఉండవద్దని వారి ఆలోచన ఉందన్న ఆయన రాజ్యాలు ఏలడం వారి హక్కు అంట చేపలు, గొర్రెలు పెంచడం మా హక్కు అనే విధంగా వారు ప్రవర్తిస్తున్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపులపై నినాదాలు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.ఆధారాలుంటే సీబీసీఐడీకి ఇవ్వండి : వివక్షతో కులాన్ని అవమానిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీలో గెలిచిన వారిని బీఆర్ఎస్ మంత్రులను చేసిందని గుర్తుచేశారు. పార్టీ ఫిరాయించిన వారు, ఇవాళ నినాదాలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకుని మంత్రులను చేశారన్నారు. పార్టీ ఫిరాయించిన వారే మంత్రి సీతక్కను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. దుష్టసంప్రదాయానికి పునాది వేసిందే బీఆర్ఎస్ పార్టీ అని జాతిపితలమని వారికి వారే సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డైనా, తన కుటుంబసభ్యులైన అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలు ఉంటే సీబీసీఐడీ ముందుపెట్టండని సవాల్ విసిరారు.

ఏ పార్టీ వారో చెప్పాలని అడిగారు : కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పొంగులేటి అంశంపై సభాసంఘం వేయాలని తాము డిమాండ్ చేస్తే ఆ అంశాన్ని వదిలేసి సీఎం కులాల ప్రస్తావన తీసుకువచ్చారని తెలిపారు. కడియం, దానం ఏ పార్టీ సభ్యులని వారికి మాట్లాడే అవకాశం ఇచ్చారని ప్రశ్నించారు. వారు ఏ పార్టీ వాళ్లో చెప్పాలని మాత్రమే కౌశిక్‌రెడ్డి అడిగారని అన్నారు. ఈ ప్రభుత్వంలో అసెంబ్లీలో ఏ కమిటీలు లేవని పేర్కొన్నారు.

## కేరళలో మార్పు తప్పదు

కేరళ పాలక్కాడ్ జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన మోదీ, కేరళ దశాబ్దాలుగా స్వార్థ రాజకీయాల మధ్య నలిగిపోతోందనీ వివరించారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు 'బీ– టీమ్' ఆరోపణలు చేసుకుంటూ, కేరళలో బీజేపీయే అసలైన పోటీదారు అని అంగీకరిస్తున్నాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దశాబ్దాలుగా కుంభకోణాల మధ్య ఎల్‌డీఎఫ్, యుడీఎఫ్ అధికారాన్ని మార్చుకుంటూ వచ్చాయని, అయినా ఒకరిపై ఒకరు ఎన్నడూ చర్యలు తీసుకోలేదని మోదీ ఆరోపించారు. ప్రతీ రంగంలో ప్రజల కోసం ఖర్చు చేయాల్సిన డబ్బును కమ్యూనిస్టు ప్రభుత్వం దోపిడి చేసిందన్నారు. కేరళ ప్రజలు అధికార మార్పు కోరుకుంటున్నారని, రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం ఉందని, మార్పు సందేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బీజేపీ కార్యకర్తల అవిశ్రాంత కృషితో ఎన్‌డీయే ప్రభుత్వం కొలువుతీరుతుందని జోస్యం చెప్పారు. కేరళను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా బీజేపీ తీర్చిదిద్దుతుందని, మోదీ హామీల గ్యారెంటీలతో రాష్ట్రం ముందుకు సాగుతుందని ప్రధాని పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం ఇప్పుడు రూ. 5 లక్షల కోట్లకు పైగా రుణభారంతో సతమతమవుతోంది. ఈ అప్పు రెండేళ్లలో మూడింతలు పెరిగింది. రాష్ట్ర ఉద్యోగులకు సమయానికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్డీఏ అధికారంలోకి వస్తే అవినీతిపరుల నుంచి డబ్బును రికవరీ చేసి రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేస్తాం. రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులు, ప్రజల కఠోర శ్రమ ఎక్కడికి పోతోందని కేరళ ప్రజలు అడుగుతున్నారు. సమాధానం ఒక్కటే. అది ఎల్‌డీఎఫ్ (సీఎం పినరయి విజయన్ ప్రభుత్వం) జేబుల్లోకి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, ఈ డబ్బు తిరిగి ప్రజల జేబుల్లోకి వెళ్లి కేరళ ప్రజల అభివృద్ధికి ఉపయోగపడుతుంది. గత 10 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ఒక్క కొత్త పారిశ్రామిక ప్రాజెక్ట్ కూడా కేరళలో ప్రారంభం కాలేదు అన్నారు మోదీ.

"కాంగ్రెస్, వామపక్షాలు ఎక్కడ అధికారంలోకి వచ్చినా అంతా నాశనం చేస్తాయనే ట్రాక్ రికార్డ్ ఉంది. బంగాల్, త్రిపురను కమ్యూనిస్టులు ఎలా నాశనం చేశారో దేశం మొత్తానికి తెలుసు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఏం చేసిందో అందరూ చూశారు. అవే దుర్మార్గపు పథకాలతో కేరళను కూడా నాశనం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ల బకాయిల విషయంలో కేరళలో పెద్ద వివాదం చెలరేగింది. వీటన్నిటింపైనా వామపక్షాలపై దాడి చేస్తుంది కాంగ్రెస్. కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట కూడా పరిస్తితి దారుణంగానే ఉంది. పొరుగున ఉన్న కర్ణాటకనే చూడండి. అక్కడ కూడా చాలా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. హిమాచల్ ప్రదేశ్ కూడా ఆర్థిక సంక్షోభంలో ఉంది. ఇదే కాంగ్రెస్ పాలన మోడల్." అని ప్రధాని మోదీ ఆరోపించారు.

"కేరళ దశాబ్దాలుగా స్వార్థ రాజకీయాల మధ్య చిక్కుకుపోయింది. మేం అధికారంలోకి వస్తే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. అనేక కుంభకోణాలకు పాల్పడుతూ రెండు కూటములు అధికారాన్ని మార్చుకుంటున్నాయి. కానీ, ఒకరిపై ఒకరు ఏనాడూ చర్యలు తీసుకోలేదు. నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ రాష్ట్రాన్ని దోచుకున్నాయి. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ఈ రెండు కూటములు, పార్టీలు కలిసి పనిచేస్తాయి. రాష్ట్రంలో మాత్రం ప్రత్యర్థులుగా నటిస్తాయి." అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

### టీవీకే అభ్యర్థుల
## జాబితా విడుదల

ఈ ఎన్నికల్లో తమకు, సీఎం నేతృత్వంలోని డీంకే మధ్యే అసలైన పోటీ ఉందన్నారు. 'విజిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నా. గెలిచిన తర్వాత ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయం. అవినీతికి పాల్పడం. మహిళలకు భద్రత కల్పిస్తాం. మాదకద్రవ్యరహిత తమిళనాడుగా రాష్ట్రాన్ని మారుస్తాం. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించం' అని విజయ్ వాగ్దానాలు చేశారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం.. టీవీకేకు ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### అమెరికాకు
## భారీ ఎదురుదెబ్బ

ఈ విషయాన్ని అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. యుద్ధరంగంలో ఈ3-సెంట్రీ అవాక్స్ సాధారణ విమానం కాదు. బోయింగ్-707 మోడల్‌లో మార్పులు చేసి గగనతలంలో ఓ కమాండ్ సెంటర్‌లా దీనిని రూపొందించారు. ఇది శత్రుదేశాల డ్రోన్లు, క్షిపణులు, యుద్ధ విమానాలు, ట్యాంకర్ విమానాల కదలికలను పసిగడుతుంది. 250 మైళ్ల పరిధిలో గగనతలంలో ఏం జరిగినా ఈ ఒక్క విమానమే గుర్తించగలదు. అమెరికా ఎయిర్ ఫోర్స్ కర్నల్ జాన్ వెనబల్ మీడియాతో మాట్లాడుతూ.. యుద్ధ రంగంలో అమెరికా సామర్థ్యంపై ఈ ఘటన ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంపై నిఘా ఉంచడం.. పరిస్థితిపై అవగాహన తెచ్చుకోవడంలో తమ దళాలు సమస్యలను ఎదుర్కోవచ్చని వెల్లడించారు. అమెరికా గగనతల ఆపరేషన్లకు ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్ అత్యంత కీలకం. ఇరాన్ వైపు వెళ్లే విమానాలకు గాల్లో ఇంధనం నింపడం, ఇంటెలిజెన్స్ సేకరణ, దాడుల సమన్వయం వంటివి ఇక్కడి నుంచే జరుగుతున్నాయి. వీటిల్లో ఈ3 విమానం చాలా కీలక పాత్ర పోషిస్తోంది. అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు 303 మంది సైనికులు గాయపడినట్లు సెంట్రల్ కమాండ్ నిన్న వెల్లడించింది. వీరిలో 273 మంది కోలుకొని తిరిగి విధుల్లోకి చేరినట్లు వెల్లడించింది. ఇరాన్ దాడులను తీవ్రం చేసిన నేపథ్యంలో అమెరికా 3,500 మంది మెరైన్లను పశ్చిమాసియా వైపు తరలించింది. యూఎస్ఎస్ ట్రిపోలీ నేడు సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చి చేరింది. దీంతో ఇక్కడి నుంచి భూతల ఆపరేషన్ అమెరికా ఎలా మొదలుపెడుతుందనేది చర్చనీయాంశంగా మారింది.

## కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని తగ్గించింది.. మీరు వ్యాట్ తగ్గించండి

**హైదరాబాద్, మార్చి 29 (నినాదం)**

ఇజ్రాయెల్, అమెరికా – ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని తగ్గించింది. ఇదే నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలపై భారం పడకుండా రాష్ట్రాలు కూడా వ్యాట్‌ను తగ్గించుకోవాలి అని బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఎల్పీజీ, పెట్రోలు, డీజిల్ నిల్వలపై తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించేందుకు హైదరాబాద్‌లోని సీజీఐ టవర్స్‌లో కిషన్‌రెడ్డి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ గ్యాస్ సమస్యలపై వస్తున్న వదంతులను ప్రస్తావించారు.

వ్యాట్ ఎందుకు తగ్గించరు : పెట్రోలు, డీజిల్‌పై దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రం వ్యాట్ విధిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. గత పన్నెండేళ్లగా ఇది 35.20 శాతంగా ఉంటోందని తెలిపారు. గతంలో పాలించిన కేసీఆర్ ప్రజాపాలన అంటూ డప్పు కొట్టుకుంటున్న కాంగ్రెస్ పార్టీ దీనిలో ఒక్కపైసా కూడా వ్యాట్‌ను తగ్గించలేదని వెల్లడించారు. మన పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లో 31 శాతంగా విధిస్తుండగా, మహారాష్ట్రలో 26 శాతం, కర్ణాటకలో 29 శాతంగా ఉన్నాయని ప్రస్తావించారు. అయితే తెలంగాణలో మాత్రం ఎందుకని 35.20 శాతం విధిస్తున్నారు? దీనిని ఎందు తగ్గించడం లేదు? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఆందోళన వద్దు : రాష్ట్రంలో పుష్కలంగా ఎల్పీజీ, పెట్రోలు, డీజిల్ నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. చమురు సంస్థలు పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీలకు మూడు రోజుల పాటు క్రెడిట్ సౌకర్యాన్ని ఇస్తున్నారని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మొద్దని ప్రస్తావించారు.

లాక్‌డౌన్ వదంతులను నమ్మొద్దు : దేశంలో మళ్లీ లాక్‌డౌన్ విధించనున్నారనే వదంతులను నమ్మొద్దని కిషన్‌రెడ్డి అన్నారు.

## వివాదాలకు కేరాఫ్‌గా ఎస్సీ హాస్టల్స్

విద్యార్థుల సంక్షేమం కోసం నడవాల్సిన హాస్టళ్లు, ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, హెచ్‌డబ్ల్యూవోల ఇష్టారాజ్యంతో వివాదాలకు కేంద్ర బిందువుగా మారాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. వసతి గృహాల సంక్షేమ అధికారుల ఆధిపత్య పోరుతో విద్యార్థుల సంక్షేమం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక హాస్టల్ నుండి మరొక హాస్టల్‌కు బదిలీ అయినా, సస్పెన్షన్‌కు గురైనా, లేదా సెలవులపై వెళ్లినా చట్టపరంగా తప్పనిసరిగా జరగాల్సిన చార్జ్ ట్రాన్స్‌ఫర్, రికార్డుల అప్పగింత వంటి ప్రాథమిక విధానాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు, కీలక రికార్డులకు ఎవరి బాధ్యతలో ఉన్నాయన్నది కూడా స్పష్టత లేకుండా పోతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఎస్సీ హాస్టళ్ల నిర్వహణపై అనేక ఆరోపణలు వస్తున్నా వీటిని పర్యవేక్షించాల్సిన జిల్లా సంక్షేమ అధికారి కనీసం పట్టించుకోకవడం పట్ల అసలు అధికారి ఉన్నట్టా..? లేనట్టా ..? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**పరిపాలనా లోపాలకు నిదర్శనాలు ఇవిగో..**

ఇటీవల ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో జరిగిన ఘటనలు ఈ వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేస్తున్నాయి. మణుగూరు ఎస్సీ వసతి గృహంలో సంక్షేమ అధికారి రికార్డులు, చార్జీలు బదలాయించకపోవడంతో, ఏఎస్‌డబ్ల్యూఓ స్వయంగా జోక్యం చేసుకుని పంచనామా నిర్వహించి చార్జీలు హ్యాండ్ ఓవర్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే తరహాలో ఇల్లందులో ఎస్సీ బాలుర హాస్టల్‌లో కూడా సెలవుపై వెళ్లిన సంక్షేమ అధికారి నుండి సక్రమ విధానాలు పాటించకుండా బాధ్యతలు బదిలీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా ఇల్లందు ఎస్సీ బాలుర హాస్టల్‌లో కూడా నాలుగు కంప్యూటర్లు కనిపించకుండా పోయాయన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పరిపాలన లోపాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ఎన్నో వివాదాలు ఇటీవల కాలంలో చోటుచేసుకుంటుండడంతో విద్యార్థుల్లో ఆందోళన పరిస్థితులు నెలకొంటున్నాయి.

**హెచ్‌డబ్ల్యూవోల ఇష్టారాజ్యం..**

కొత్తగూడెం ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహంలో సస్పెన్షన్‌కు గురైన సంక్షేమ అధికారి నుండి చార్జ్ హ్యాండోవర్ జరగకపోయినా, ఆయనే హాస్టల్‌లో తిరుగుతూ విద్యార్థుల సంక్షేమాన్ని చూసుకుంటున్నట్టు వ్యవహరిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. "పేపర్ మీద మాత్రమే సస్పెన్షన" అన్నట్లుగా, ప్రభుత్వ సరఫరా బియ్యాన్ని సైతం తానే తీసుకుని వచ్చి విద్యార్థులకు వంట చేస్తానని చెప్తుండడం సదరు అధికారికి పెద్దల మద్దతు గట్టిగానే ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో జిల్లా ఎస్సీ శాఖ పర్యవేక్షణ పూర్తిగా విఫలమైందనే అభిప్రాయం వినబడుతోంది. జిల్లా అధికారుల ఆదేశాలను కూడా సంక్షేమ అధికారులు లెక్క చేయకపోవడం, "ఎవరికి వారే బాస" అన్న విధంగా వ్యవహరించడం వ్యవస్థ లోపాలను స్పష్టంగా చూపిస్తోంది.

**లోతైన విచారణతో వెలుగులోకి మరిన్ని అక్రమాలు..**

వసతి గృహాల్లో ఉండవలసిన అన్ని రికార్డులు, పర్మినెంట్ ఆర్టికల్స్, మూవబుల్, నాన్-మూవబుల్ ఆస్తులపై పూర్తి స్థాయి తనిఖీ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని ప్రజా సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ పర్యవేక్షణలో స్పష్టమైన వైఫల్యం కనిపిస్తున్న నేపథ్యంలో, సంబంధిత జిల్లా అధికారి పూర్తిగా విఫలమయ్యారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని, అన్ని ఎస్సీ వసతి గృహాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఈ నిర్లక్ష్యానికి కారణమైన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### భారత్‌కు మరో రెండు
## ఎల్‌పీజీ నౌకలు

దేశంలో ఒక రోజుకు సరిపడా వంటగ్యాస్‌ను ఈ నౌకలు మోసుకొస్తున్నాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో ఇవి భారత్‌కు చేరుకోనున్నాయి. సుమారు 94 వేల టన్నుల ఎల్‌పీజీ కార్గోతో వస్తున్న రెండు భారతీయ నౌకలు తాజాగా జలసంధిని సురక్షితంగా దాటాయి. దేశంలో వంటగ్యాస్ కొరతను ఎదుర్కోవడానికి ఈ నౌకల రాక ఎంతో సహాయపడనుంది. ఈ రెండు నౌకల కంటే ముందే నాలుగు భారత ఎల్‌పీజీ ట్యాంకర్లు సురక్షితంగా మన దేశానికి చేరుకున్నాయి. 92 వేల టన్నులకు పైగా వంటగ్యాస్‌తో వచ్చిన పైన్ గ్యాస్, జగ్ వసంత్ నౌకలు ఇప్పటికే భారత పోర్టులను చేరుకున్నాయి. జగ్ వసంత్ ఎల్పీజీ ట్యాంకర్ శుక్రవారం రాత్రి 8గంటలకు గుజరాత్‌లోని వాదినార్ ఓడరేవుకు చేరినట్లు చెప్పారు. అందులో 47వేల టన్నుల ఎల్పీజీ ఉన్నట్లు తెలిపారు. రెండో ట్యాంకర్ పైన్ గ్యాస్ శుక్రవారం రాత్రి భారత సముద్రజలాల్లోకి ప్రవేశించినట్లు అధికారులు చెప్పారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన ఈ నౌక ఏప్రిల్ 2న ఒడిశాలోని ధమ్రా ఓడరేవుకు చేరుకుంటుందని తెలిపారు. టెహ్రాన్ ఆమోదించిన మార్గాల ద్వారా ఈ 2 నౌకలు హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించాయని అధికారులు తెలిపారు. అంతకుముందు మార్చి మూడో వారంలో MT శివాలిక్, MT నందా దేవి, అలాగే యూఏఈ నుంచి ముడిచమురుతో వచ్చిన జగ్ లాడ్కి నౌకలు ముంద్రా, కాండ్లా పోర్టులకు చేరుకున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం మొదలయ్యే నాటికి హర్మూజ్ జలసంధిలో 28 భారతీయ నౌకలు ఉండగా వాటిలో కొన్ని సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నాయి. ఇంకా పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 485 మంది భారతీయ నావికులతో కూడిన 18 నౌకలు ఉన్నట్లు సమాచారం. జగ్ విక్రమ్, గ్రీన్ ఆశా, గ్రీన్ సాన్వి వంటి ఎల్‌పీజీ నౌకలు ఇంకా అక్కడే ఉన్నాయి.

# మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆదా చేసుకున్న రవాణా ఛార్జీలు 10వేల కోట్లు

**ఆడబిడ్డల అకౌంట్లలో పొదుపు సిరి - తెలంగాణ ప్రగతికి ఇదే అసలైన దారి**

**పది వేల కోట్ల పొదుపు ప్రయాణం కాదు, తెలంగాణ ఆడబిడ్డల గెలుపు**

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ఐపీఎస్**



**కుత్బుల్లాపూర్, మార్చి 29 (నినాదం) :** తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్ర సామాజిక, ఆర్థిక ముఖచిత్రంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రారంభమైన ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళల రవాణా ఛార్జీల మొత్తం 10వేల కోట్ల మార్కును చేరుకుందని టి జి ఎస్ ఆర్ టి సి యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. 2023 డిసెంబర్ 9న మహాలక్ష్మి పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు (29.03.2026) (సుమారు 28 నెలల కాలంలో) రాష్ట్రవ్యాప్తంగా సుమారు 290 కోట్లకు పైగా జీరో (ఉచిత ప్రయాణం) టికెట్లను మహిళా ప్రయాణికులు వినియోగించుకున్నట్లు రవాణా శాఖ ఎండీ వై.నాగిరెడ్డి తెలిపారు. గతంలో రవాణా ఛార్జీల కోసం నెలకు సగటున రూ. 1,500 నుండి రూ. 2,500 వరకు వెచ్చించే సామాన్య, మధ్యతరగతి మహిళలు, విద్యార్థినులు, కూలీలు ఇప్పుడు ఆ మొత్తాన్ని పొదుపు చేసుకుంటున్నారని, ఈ పొదుపు మొత్తం రాష్ట్రవ్యాప్తంగా10వేల కోట్లకు చేరడం మహిళల ఆర్థిక స్వావలంబనకు నిదర్శనంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. మహాలక్ష్మి అమలు అనంతరం ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని,ఈ పథకం రాకముందు 40 శాతంగా ఉన్న మహిళల వాటా, ప్రస్తుతం 67 శాతానికి పైగా నమోదవుతోందని, ప్రతిరోజూ సగటున 35 లక్షల మందికి పైగా మహిళలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నట్లు ఎండీ ప్రకటనలో వెల్లడించారు.

మహిళలు ఉచితంగా ప్రయాణించిన టిక్కెట్ల విలువను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ రూపంలో ఆర్టీసీకి చెల్లిస్తోంది. తద్వారా ఆర్టీసీ ఆర్థిక బలోపేతం, సిబ్బంది జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు ఈ నిధులు కొంత వెసులుబాటును కల్పిస్తున్నాయని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ప్రారంభమైందని,ఆర్టీసీ లో మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి ద్వారా ఇప్పటి వరకు సుమారు 290 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకొని మహిళలు 10వేల కోట్లు ఆదా చేసుకున్న సందర్భంగా మహిళలకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అనతి కాలంలోనే 290 కోట్ల ఉచిత ప్రయాణాలతో 10 వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకున్న మహిళా ప్రయాణికుల కోసం నిరంతరం కృషి చేస్తున్న టీజీఎస్ ఆర్టీసీ సిబ్బందికి మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలియజేశారు. మహాలక్ష్మి ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకొని నిత్యం ఆర్టీసీ బస్సుల్లో ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ఉచితంగా ప్రయాణం చేస్తూ ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. మహిళలు చిన్న చిన్న గ్రామాల నుండి పట్టణాలకు వచ్చి ఉద్యోగాలు చేస్తున్నారని, గ్రామాల నుండి నాణ్యమైన వైద్యం కోసం హైదరాబాదులో చికిత్స చేసుకుంటున్నారని, కుటుంబంతో కలిసి దేవాలయాలకు వెళ్తున్నారని రవాణా శాఖ మంత్రి పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**"మహాలక్ష్మి సేవల సౌలభ్యంకై మహిళలకు "స్మార్ట్ కార్డుల" జారీ"**

మహాలక్ష్మి పథకాన్ని మరింత సరళతరం చేసేందుకు, కచ్చితమైన గణాంకాల కోసం త్వరలో చిప్ ఆధారిత స్మార్ట్ కార్డుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఎండీ నాగిరెడ్డి చెప్పారు. ఆధార్ కార్డు చూపించాల్సిన అవసరం లేకుండానే స్మార్ట్ కార్డుల ద్వారా మహిళల ఉచిత ప్రయాణం చేసేందుకు ఈ విధానం ఎంతగానో దోహద పడనుందన్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ప్రవేశపెట్టడం జరుగుతోందని ఎండీ స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర మహిళలకు గౌరవప్రదమైన, సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంలో భాగస్వాములైనందుకు టిజిఎస్ ఆర్టిసి గర్విస్తోందని సంస్థ వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి వివరించారు. ఈ పథకం విజయవంతానికి సహకరిస్తున్న ప్రయాణికులకు, నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వానికి సంస్థ తరఫున కృతజ్ఞతలు చెప్పారు. మహాలక్ష్మి పథకం పల్లెవెలుగు (3278), డిస్ట్రిక్ట్ ఎక్స్‌ప్రెస్ (2039), సిటీ ఆర్డినరీ (1829) సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ (1044) బస్సులలోని మొత్తం బస్సులలో 81% వర్తిస్తుందని వివరించారు. విద్యార్థినులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉత్తమ, ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ ఉచిత ప్రయాణం ఎంతో దోహదపడుతుందన్నారు. తెలంగాణలోని ప్రతి మహిళలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా పది వేల కోట్ల రూపాయల రవాణా ఛార్జీలను ఆదా చేసుకోవడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తోందని ఆర్టీసీ ఎండి అభివర్ణించారు. ఇది కేవలం ఉచిత ప్రయాణం కాదు, రాష్ట్ర ప్రగతిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే ఒక మహా యజ్ఞమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సహాయ, సహకారాలతో సంస్థ అభ్యున్నతి సాధ్యమవుతుందని, ప్రయాణికులు ప్రజా రవాణా వ్యవస్థను ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలంగాణ ఆర్టీసీ ఎండి, విసి వై నాగిరెడ్డి వివరించారు.

# లక్ష్మీ సాయి మెడోస్ కాలనీ అభివృద్ధికి మరో ముందడుగు



**అమీన్‌పూర్, మార్చి 29 (నినాదం):** అమీన్‌పూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించి వాటికి పరిష్కారం చూపించడం తన బాధ్యతగా భావించి. వార్డు నం. 270 పరిధిలోని లక్ష్మీ సాయి మెడోస్ కాలనీలో గత రెండు సంవత్సరాలుగా దెబ్బతిన్న సీసీ రహదారి కారణంగా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, ఆయన స్వంత నిధులతో సుమారు 35 ఘన మీటర్ల కాంక్రీటుతో మరమ్మత్తు పనులు పూర్తిచేయించారు. దీని వల్ల వర్షాకాలంలో బురద, వేసవిలో దుమ్ము సమస్యల నుండి కాలనీ ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మల్లేష్, కాలనీ కమిటీ సభ్యులు, వాసులు కలిసి శశిధర్ రెడ్డి కి సన్మానం చేయడం జరిగింది. ఇలాగే ప్రతి కాలనీ అభివృద్ధి కోసం అయన వంతు కృషి కొనసాగించాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# యాంబియన్స్ కోర్ట్ యార్డ్ వద్ద తొలగిన చెత్త సమస్య



**రాజేంద్రనగర్, మార్చి 29 (నినాదం):** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ డివిజన్ లోని యాంబియన్స్ కోర్ట్ యార్డ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రధాన ద్వారం వద్ద రహదారిపై భారీగా ఘన వ్యర్థాలు పేరుకుపోయాయి. తీవ్రమైన సమస్యలతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.. సమస్యను నర్సింగి సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం జీహెచ్ఎంసీ సిబ్బంది వాహనాలతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గంటల వ్యవధిలోనే రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు**

సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి, పరిష్కారం చూపిన కృష్ణ మోహన్ రెడ్డికి, పారిశుద్ధ్య సిబ్బందికి యాంబియన్స్ కోర్ట్ యార్డ్ నివాసితులు, స్థానిక ప్రయాణికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అలకాపూర్ టౌన్‌షిప్‌లో తప్పిన పెను ప్రమాదం

## అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది



**రాజేంద్రనగర్, మార్చి 29(నినాదం):** అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆదివారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసుల సత్వర స్పందనతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**అదుపులోకి మంటలు**

ప్రమాదం జరిగిన వెంటనే 'అలకాపూర్ టౌన్‌షిప్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్' ప్రతినిధులు అగ్నిమాపక శాఖ ఏడిఎఫ్ఓ గోవర్ధన్ రెడ్డికి సమాచారం అందించారు. ఆయన ఆదేశాలతో అధికారులు వెంటనే రెండు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చాయి. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా సిబ్బంది గట్టి చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదాల సమయంలో నివాసితులు అప్రమత్తంగా ఉండాలని, అసోసియేషన్ సభ్యులు కోరారు. ఇలాంటి అత్యవసర సమయాల్లో ప్రజలు ఎలా స్పందించాలో అవగాహన కల్పించేందుకు త్వరలోనే టౌన్‌షిప్‌లో 'ఫైర్ సేఫ్టీ ఎవాల్యుయేషన్, మాక్ డ్రిల్' నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులకు అధికారులు తెలిపారు. సకాలంలో స్పందించి సహాయం అందించిన ఏ డి ఎఫ్ ఓ గోవర్ధన్ రెడ్డి , నార్సింగి సీఐ హరికృష్ణ రెడ్డికి మణికొండ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా కృష్ణ కీర్తన



**అల్వాల్, మార్చి 29 (నినాదం):** అల్వాల్‌కు చెందిన ప్రముఖ యువ న్యాయవాది పులిపాలుపుల కృష్ణ కీర్తన తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ టి హచ్ సి ఏ ఏ జాయింట్ సెక్రటరీగా అత్యధిక మెజారిటీతో ఘనవిజయం సాధించారు. హైకోర్టు చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో ఈ విజయాన్ని సాధించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా పులిపాలుపుల కృష్ణ కీర్తన మాట్లాడుతూ.. "ఈ విజయం నాపై ఉంచిన నమ్మకానికి ప్రతిఫలం. నా తండ్రి శ్రీ పి. నాగభూషణం ఆశీస్సులు, తల్లి మృణాళిని (లేట్) ఆశీర్వాదాలు, కుటుంబ సభ్యుల సహకారం, గురువు శ్రీ పి. వేణుగోపాల్ మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగారిననిఆమెతెలిపారు. న్యాయవాదుల సంక్షేమం, సంఘ అభివృద్ధి కోసం కృషి చేస్తాను అని తెలిపారు. స్థానిక ప్రజలు, న్యాయవాదులు మరియు మిత్రులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

# సన్నబియ్యం పంపిణీకి ఏడాది పూర్తి..

**హుజూర్‌నగర్‌లో ప్రారంభమైన పథకం**

**జిల్లా వ్యాప్తంగా లక్షలాది మందికి లబ్ధి**

**పేదలకు ఆర్థిక ఉపశమనం**

**సజావుగా కొనసాగుతున్న సరఫరా**

**గ్రామీణ ప్రాంతాల్లో విశేష స్పందన**



**కోదాడ, మార్చి 29(నినాదం):** పేదల ఆహార భద్రతను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ పథకం నేటితో విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. గత సంవత్సరం ఇదే రోజున సూర్యాపేట జిల్లాలోని హుజూర్నగర్ మండలంలో ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందించడం. సాధారణ బియ్యానికి బదులుగా మెరుగైన నాణ్యత కలిగిన సన్న బియ్యం అందించడం వల్ల ప్రజల్లో సంతృప్తి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకానికి విశేష స్పందన లభిస్తోంది.

**జిల్లా వ్యాప్తంగా లక్షలాది మందికి లబ్ధి**

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా సుమారు 3.2 లక్షల రేషన్ కార్డుల కింద 9.3 లక్షల నుంచి 9.5 లక్షల మంది లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఉచితంగా అందిస్తున్నారు. ప్రతి నెలా రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. సరఫరా వ్యవస్థను పటిష్టంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు నాణ్యమైన ఆహారం అందడంతో పాటు వారి ఆర్థిక భారం కూడా తగ్గింది. పోషకాహారం లోపాన్ని తగ్గించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోంది.

**విజయవంతమైన సంక్షేమ పథకం...**

సన్న బియ్యం పంపిణీ పథకం సూర్యాపేట జిల్లాలో పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచిన విజయవంతమైన సంక్షేమ కార్యక్రమంగా నిలిచింది. భవిష్యత్తులో ఇలాంటి పథకాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు.

# గాజుల రామారం సర్కిల్లో స్వచ్ఛ సండే కార్యక్రమం






**కుత్బుల్లాపూర్, మార్చి 29 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వినూతనంగా, ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 24వ రోజు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గాజులరామారం సర్కిల్లోని పార్కులలో స్వచ్ఛ సండే కార్యక్రమం (ఎస్ హెచ్ జి ఎస్/ ఆర్ డబ్ల్యు ఎస్/ ఎన్జీవో) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కైలాష్ హిల్స్ పార్క్, పంచ తత్వ పార్క్, యండమూరి లేఅవుట్, ఉషోదయ కాలనీ పార్కులలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్కులో ఉదయం నడక లో పాల్గొన్న కాలనీ సభ్యులకు స్వచ్ఛత గురించి, పార్కులను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ డబ్ల్యూఎం డిప్యూటీ ఈ నిఖిల్ రెడ్డి, ఎస్ డబ్ల్యూ ఎం స్వాతి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సాయి కృష్ణ, జవాన్ చందర్, ఎస్ఎఫ్ఐ లు, ఆర్ పి లు, ఎస్ హెచ్ జి సభ్యులు, ఎన్జీవోలు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. గంగా ఎంక్లేవ్ , సత్యం ఎన్క్లేవ్ , కాంటీన్ టౌన్షిప్, జీడిమెట్ల విలేజ్ పార్కులలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్కులో ఉదయం నడక లో పాల్గొన్న కాలనీ సభ్యులకు స్వచ్ఛత గురించి, పార్కులను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, జీడిమెట్ల సర్కిల్-55 డి. శంకర్ సింగ్, సానిటేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ( ఎస్ డబ్ల్యూ ఎం ) హుస్సైన్, జవాన్, జిలానీ పాషా, సానిటేషన్ సిబ్బంది, యు బి డి, సిబ్బంది భాగస్వామ్యం అయ్యారు.


# అన్నిదానాల కన్నా.. అన్నదానం మిన్న..

## సర్పంచ్ కుంచం ఇందిర నరసయ్య



**కోదాడ, మార్చి 29(నినాదం):** మునగాల మండలం నరసింహుల గూడెం గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా గ్రామంలో అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందిర నరసయ్య మాట్లాడుతూ గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోష కరమన్నారులో ఉన్న భక్తులు మరియు గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సహకారంతో ఇంత గొప్ప కార్యక్రమం చేయడం చాలా అభినందనీయమన్నారు అన్నం పరబ్రహ్మ స్వరూపం తో సమానం అని ఎంతోమంది నిరుపేదలు ఆకలితో అలమటిస్తున్నారని అలాంటి గొప్ప అన్న దాన కార్యక్రమం నిర్వహించడం చాలా పుణ్యమని సహకరించిన ప్రతి దాతకు గ్రామ పెద్దలకు శుభాకాంక్షలు తెలిపారు మునుముందు గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మొగిలిచర్ల సీతారాములు సీతారాములు జూలకంటి కొండారెడ్డి రాపోలు సూర్యనారాయణ జూలకంటి విజయలక్ష్మి సోమపంగుగు రేణుక గణేష్ ఉయ్యాల పావని షేక్ పర్వీన్ బేగం రాములమ్మ నాగమణి నారాయణ వెంకటరెడ్డి సోమయ్య గ్రామ పెద్దలు రామిరెడ్డి నాగు శంకర్ పాల్గొన్నారు.

# వాయిల సింగారంలో ఉచిత గర్భాశయ కాన్సర్ శిబిరం



**కోదాడ,మార్చి 29(నినాదం):** అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామంలో ఆదివారం స్వర్ణ భారతి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత గర్భాశయ క్యాన్సర్ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ గద్దె రామారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు గద్దె రఘు సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు సహకారంతో ఏర్పాటుచేసిన ఈ చికిత్స శిబిరంలో డాక్టర్లు ఉష ,మాధవి, విజయలక్ష్మి పరివేక్షణలో గ్రామంలోని 150 మంది మహిళలకు పైగా క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు చారుగుండ్ల ప్రవీణ రాజశేఖర్ ను గ్రామ ప్రజలు అభినందించారు. ఉప సర్పంచ్ కంటు రమాదేవి, వార్డు సభ్యులు తమలపాకుల వెంకటేష్ దేవులపల్లి నాగరాజు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, గుండ్లపల్లి వెంకన్న, కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి ,పగిడి రామారావు ,దాములూరి మురళి కంటు చిన్న నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పుల్లగర్‌చర్లలో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం



**పెబ్బేరు, మార్చి 29 (నినాదం):** వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం పుల్గర్ చర్ల గ్రామంలో జిల్లా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగర్ల రఘునాథ్ రెడ్డి చొరవతో మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో పుల్గర్ చర్ల గ్రామానికి ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. సిసి రోడ్ల నిర్మాణ పనులను గ్రామ కాంగ్రెస్ నాయకులు టెంకాయలు కొట్టి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గురుక మద్దిలేటి, శీలం విష్ణు, పింజరి హుస్సేన్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆలకుంట రాజు, 10వ వార్డ్ సభ్యుడు పింజరి సుభాన్, మదుగం మహేశ్వర్, బత్తుల గోపాల్, జుర్రు రాముడు, మాజీ ఉపసర్పంచ్ బీజ్జ నరేష్ కుమార్ తిరుపతి, ఆలకుంట చంద్రయ్య తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మిట్ట ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



**పెబ్బేరు, మార్చి 29 (నినాదం):** పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీశ్రీ మిట్ట ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కోసం జర్నలిస్ట్ సూర్యవంశం పరుశరాముడు తన కుటుంబ సభ్యులతో కలిసి రూ.10,116 విరాళాన్ని అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ధర్మపత్ని జయమ్మ, కుమారుడు భాను ప్రకాష్, కుమార్తె సంధ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యవంశం పరుశరాముడు మాట్లాడుతూ ఆంజనేయస్వామి తమ ఇంటి ఆరాధ్య దైవమని, ప్రతి శనివారం కుటుంబ సభ్యులందరూ స్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గౌని బుచ్చారెడ్డి ఆధ్వర్యంలో పరుశరాముడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ అర్చకులు గురురాజాచార్యులు, నవీన్ వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హనుమంత్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సాయి రెడ్డి, సంబు కృష్ణయ్య, పురుషోత్తం రెడ్డి, వేణు, వెంకటేశ్వర్ రెడ్డి, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకర్ గౌడ్ జన్మదినంలో పలు సేవా కార్యక్రమాలు





**వైద్య శిబిరాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్**

**వార్డు ప్రజలకు అన్న ప్రసాద వితరణ**

**వనపర్తి ప్రతినిధి, మార్చి 29 (నినాదం):** వనపర్తి పట్టణంలోని 23వ వార్డు కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్ 31వ జన్మదినం సందర్భంగా ఆదివారం బిఆర్ఎస్ శ్రేణులు, శ్రీకర్ గౌడ్ అభిమానులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు పెద్దఎత్తున పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వార్డులోని పట్టణ ఇలవేలుపు జమ్ములమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరాన్ని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్ ప్రారంభించారు. పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వందలాది మందికి షుగర్, బిపి, కంటి చూపుతో పాటు వివిధ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. చికిత్స తీసుకున్న వార్డు ప్రజలు మాట్లాడుతూ శ్రీకర్ గౌడ్ సేవాభావం కలిగిన యువ నాయకుడని, కౌన్సిలర్ కాకముందు నుంచి కూడా పలుసేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురి మన్ననలు పొందారని చెప్పారు. ఆయన భగవంతుణ్ణి ఆదేశాలతో నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాక్షించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేసి శ్రీకర్ గౌడ్ చేత బర్త్ డే కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, కాగితాల లక్ష్మీనారాయణ, ఉంగ్లం తిరుమల్, మెకానిక్ శ్రీను, కొల్లాపూర్ రాము, జయరాములు, నందిమల్ల రాములు పాల్గొన్నారు.

# ఆత్మకూరు సంత బజార్‌లో చలివేంద్రం ప్రారంభం



**అమరచింత, మార్చి 29, (నినాదం):** ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని మున్సిపల్ సంత మార్కెట్ ప్రాంగణంలో. శ్రీరామ ట్రేడర్స్ ఎదుట వాసవి క్లబ్ వనిత క్వీన్స్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని. ఎలిశెట్టి పద్మావతి విజయ్, విజయ్ కుమార్ తెలిపారు. ప్రతి ఆదివారం చలివేంద్రంలో చల్లని మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ వనిత క్వీన్స్ వాసవి క్లబ్ అధ్యక్షులు గురు ప్రసాద్ వాసవి క్లబ్ జిల్లా అధ్యక్షులు రాముని నేలేష్ సూరంపల్లి రమేష్ నవీన్ ఎలిశెట్టి రామ్ నరేష్ కల్వ రఘు తదితరులు ఉన్నారు.

# భీంగల్ నుండి ఆర్మూర్ వరకు
# యదేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా

**అడ్డుకున్న గ్రామస్తులు...**
**అక్రమ ఇసుక రవాణాకు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు చేపట్టేనా?**




**ఆర్మూర్, మార్చి 29 ( నినాదం):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు, ప్రైవేటు ఇండ్లకు, సిసి డ్రైనేజ్, పలు అభివృద్ధి పనులకు మన ఇసుక మన వాహనం అమలు చేసింది. ఇసుక అవసరం ఉన్న వ్యక్తులు మన వాహనంలో ప్రభుత్వం విధించిన రుసుమును చెల్లించి నమోదు చేసుకుంటే, రెవెన్యూ అధికారులు నేరుగా ఇసుకను అందించాల్సి ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లో నుండి, అప్పులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా, అక్రమార్కులు ఆగడాలను నియంత్రించేలా మన ఇసుక మన వాహనం అమలు చేశారు. అయినప్పటికీ కొందరు రాజకీయ నాయకులు అధికారులపై పైరవీలు చేస్తూ, అక్రమ ఇసుక రవాణా దారులకు కొమ్ముకాస్తూ, ఇటు పైరవీ కారులు, అక్రమ ఇసుక రవాణా దారులకు అందినంత ముడుపులు దండుకుంటూ, సహకరిస్తున్న అధికారులకు సైతం కొంత ముట్ట చెప్పుతూ అక్రమ ఇసుక రవాణా ఏదేచ్ఛగా కొనసాగేలా రాజకీయ నాయకులు పైరవీలు చేస్తూ, అధికారులపై ఒత్తిడి తెచ్చి, తమ పెత్తనాన్ని చలాయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, మరోపక్క పైరవీలు చేస్తున్న రాజకీయ నాయకులు అమాయకుల తమ ఉన్నత నాయకుల వద్ద వ్యవహరిస్తూ మంచి రాజకీయ నాయకులుగా పేరు పొందుతున్నారు. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు, మైనింగ్, ఆర్టీవో అధికారులు సైతం కొమ్ముకాస్తుండడం, అక్రమ ఇసుక రవాణా కొనసాగిన తమకు ఏమీ తెలియనట్లుగా, తెలిసిన ఏమి చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో, అక్రమ ఇసుక రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. సామాన్యుడికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక దొరకడం గగనమవుతుంటే, అక్రమార్కులు మాత్రం అధికారుల అండదండలతో యథేచ్ఛగా దందాను కొనసాగిస్తున్నారు. తాజాగా భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్ నుండి వేల్పూర్ మీదుగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణాను అక్లూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. రాత్రి 9 గంటల సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అక్లూర్ గ్రామ సర్పంచ్ జనార్ధన్, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు అడ్డుకొని మండల అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ ప్రభుత్వ అనుమతులు ఉన్నప్పటికీ రాత్రి వేల ఇసుక రవాణా ఎలా కొనసాగుతుందని, రాత్రివేళ ఇసుక రవాణా కొనసాగుతుండడంతో తాము పడుకునే సమయంలో ఇళ్లలోకి దుమ్ము దూళి వస్తుందని, నిద్ర సైతం పట్టడం లేదని, చిన్నపిల్లలు అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ల మోతలకు చిన్న పిల్లలు నిద్రపోవడం లేదని, బడా భీంగల్ నుండి ఆర్మూర్ వరకు అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్న, భీంగల్ మండల, వేల్పూర్ మండల, ఆర్మూర్ మండల తాసిల్దార్లు గాని, ఆయా గ్రామాల జిపిఓలు గానీ, ఆయా గ్రామాల కార్యదర్శులు గానీ, ఆయా గ్రామాలలో పెట్రోలింగ్ నిర్వహించే పోలీసులు గాని వారికి కనిపించడం లేదా, ఒకవేళ కనిపించిన ఎందుకు వాహనాలను సీజ్ చేయడం లేదని, అసలు పోలీసులు పెట్రోలింగ్ రాత్రివేళ చేస్తున్నారా, ఒకవేళ పోలీసులు పెట్రోలింగ్ చేస్తే, రాత్రి 7 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు యదేచ్ఛగా ఇసుక రవాణా కొనసాగుతున్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదని అనుమానాలను ఆయా గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. పట్టుబడిన డ్రైవర్లను విచారించగా, తమకు భీమ్‌గల్ ఎం.ఆర్.ఓ. పర్మిషన్ ఇచ్చారని,పొంతన లేని సమాధానాలు చెప్పారు. తీరా తనిఖీ చేయగా వారి వద్ద కనీసం వే-బిల్‌గానీ, ప్రభుత్వానికి డీడీ కట్టిన రసీదులు గానీ లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా సీపీ ప్రత్యేక దృష్టి సారించి, అక్రమాలకు కొమ్ముకాస్తున్న అధికారులపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, కఠిన చర్యలు చేపడితే ప్రభుత్వ పనులు సైతం సకాలంలో పూర్తవుతాయని, మళ్లీ ఇలాంటి సంఘటనలు తలెత్తవని ఆయా గ్రామాల స్థానికులు కోరుతున్నారు. జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారని మూడు మండలాల ప్రజలు వేచి చూస్తున్నారు.

# సంస్కృతికి సాంప్రదాయానికి
# నిలయం ఆవాస విద్యాలయం

**44 సంవత్సరాలుగా ఆవాస సేవలు అభినందనీయం**
**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్..**
**ఘనంగా విద్యారణ్య ఆవాస విద్యాలయం వార్షికోత్సవ వేడుకలు**




**జమ్మికుంట, మార్చి 29 (నినాదం) :** ఎంతోమంది విద్యార్థులను అపర మేధావులుగా తీర్చిదిద్ది వారిని ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన ఘనత శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయానికి దక్కుతుందని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. ఆదివారం శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం 44వ వార్షికోత్సవ వేడుకలు పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిసర ప్రాంతవాసులకు 44 సంవత్సరాల నుండి ఎంతో మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉన్నతస్థాయికి వెళ్ళేలా విద్యను అందించిన పాఠశాల వార్షికోత్సవానికి నన్ను ఆహ్వానించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ పాఠశాలలో ఆచార్యులు విద్యతో పాటు పెద్దలను గౌరవించే విధానం సంస్కృతి సంప్రదాయాలు అందించే వాటిలో మొదటిది ఆవాస విద్యాలయం అని అలాగే విద్యార్థిని విద్యార్థులకు విద్యతో పాటు శారీరక,మానసిక ఉల్లాసం కోసం ఆటల పోటీల విషయంలో ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పాతకాల మౌనిక అనిల్,ప్రధానాచారులు,ఆచార్యులు, శ్రీనివాస్ రెడ్డి, ముక్క జితేందర్, ఆకుల రాజేందర్ పాల్గొన్నారు.

## పులిబొమ్మతో కోతులకు చెక్!



**కోదాడ,మార్చి 29(నినాదం):** కోతుల బారినుంచి పంటలు మాత్రమే కాకుండా, ఇళ్లలోనూ ఆహారం కోసం దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, నడిగూడెం మండలం వల్లపురం గ్రామస్తులు సృజనాత్మక పరిష్కారాని అన్వేషించారు. గ్రామ పొలిమేర వద్ద ఒక కుర్చీ ఏర్పాటు చేసి, దానిపై పెద్ద పులిబొమ్మను ఉంచి కోతులను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.. దీనిని అరికట్టడానికి పులిబొమ్మ ఐడియా చక్కగా పనిచేస్తుందేమో చూద్దాం" అని వారు తెలిపారు. గ్రామంలోని వృద్ధులు, యువత, పిల్లలు కలసి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యంగా వ్యవహరిస్తున్నారు.

# వైభవంగా లక్ష తులసి అర్చన.. శ్రీ సుదర్శనఇష్టి యజ్ఞం



**మిర్యాలగూడ, మార్చి 29( నినాదం) :** మిర్యాలగూడ పట్టణంలోని ఎన్.ఎస్.పి. క్యాంపు మైదానంలోశ్రీ భాష్యకార సిద్ధాంత పీఠ వ్యవస్థాపక చార్యులు శ్రీ భూషిత శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారి సంకల్పంతో వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహిస్తున్న శ్రీ మహాలక్ష్మి యాగము ఆదివారం (మూడవరోజు) ఉదయం 9:30 గంటలకు ప్రవచన వేదికపై పాడిపంటల సమృద్ధి కొరకు లక్ష్మీ నారాయణులకు లక్ష తులసిఅర్చన, ఇష్టి యాగశాలలో ప్రత్యేకంగా పూజ దోష నివారణ కొరకు సకల కార్య సిద్ధికి శ్రీ సుదర్శన ఇష్టి యజ్ఞం నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలకు గోపాలదేశిక పురస్కార సమర్పణ, అనంతరం వారి ప్రవచనం చెప్పారు. అన్నదానకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాగ మహోత్సవ కమిటీ సభ్యులు తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్, మిల్లర్స్ కోశాధికారి గందె రాము, బండారు ఆగ్రో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బండారు కుశలయ్య, ప్రముఖ రైస్ మిల్లర్ రంగా శ్రీధర్, రైస్ మిల్లర్స్ ఉపాధ్యక్షులు గోళ్ళ రామ శేఖర్, చీదల్ల శ్రీనివాస్ (ఆయిల్) రేపాల పురుషోత్తం రెడ్డి గూడూరు శ్రీనివాసరావు, గుంటూరు చంద్రశేఖర్, వేజండ్ల మాధవి, చిలుకల రవికుమార్, జివిడి ప్రసాద్, కారంపూడి జానకి రాఘవచార్యులు, గుడిపాటి నాగేందర్ (గురు మోహన్) తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం.!




**పాలేరు మార్చి 29( నినాదం) :** నేలకొండపల్లి భక్త రామదాసు సొసైటీ వారి ఆధ్వర్యంలో వైరా లయన్ కంటి హాస్పటల్ వారి సహకారంతో సదాశివపురం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడినది డాక్టర్ శ్యామ్ మరియు వరలక్ష్మి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు 150 మంది పేషెంట్లను వైద్య పరీక్షలు చేశారు ఈ కార్యక్రమంలో సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పచ్చ తిరుపతియ్య గ్రామ సర్పంచ్ సురేష్ క్యాంపు చైర్మన్ గెల జగన్ మోహన్ రావు వైస్ చైర్మన్ బెల్లంపల్లి శ్రీనివాసరావు కనపర్తి కోటేశ్వరరావు, వెంకటరమణ గుప్త కోశాధికారి దండ రవీంద్ర బాబు మాజీ చైర్మన్లు ఏటుకూరి వెంకట రామారావు పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్ ఎలమ ది లెనిన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు,వల్లం చెట్ల భాస్కరరావు మచ్చ రఘుపతి చావా గణపతి రావు కొడారు వెంకటాచారి షేక్ ఖాసిం సాహెబ్ రేలా నరసింహారెడ్డి నంచర్ల దేవి ప్రసాద్ ఓరుగంటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలి

**మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు**

**మిర్యాలగూడ మార్చి 29(నినాదం) :** ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో కీలకమని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పేర్కొన్నారు.శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారి సంకల్పంతో వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎన్ఎస్పీ క్యాంపు రాజీవ్ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీ మహాలక్ష్మి యాగంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆధ్యాత్మిక చైతన్యం పెరిగినప్పుడే సమాజంలో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం తన లక్ష్యమని, ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇలాంటి యాగాలు రాష్ట్రానికి శాంతి, సమృద్ధి తీసుకురావాలని కోరుకుంటూ, నిర్వాహకులను ఆయన అభినందించారు. భక్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, యాగ మహోత్సవ కమిటి



చైర్మన్ బండారు కుశలయ్య, రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కోశాధికారి గందె రాము, ఆయిల్ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రేపాల పురుషోత్తంరెడ్డి ఉన్నారు.

## బస్టాండులో చలి వేంద్రం ప్రారంబించిన సిఐ నవీన్



**కమలాపూర్ మార్చి 29 (నినాదం) :** త్రినేత్ర వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమలాపూర్ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం స్థానిక సి ఐ పి నవీన్ ,గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దిలీప్ వార్డ్ సభ్యుడు రామ్ శెట్టి రాజయ్య, విశ్వభారతి హై స్కూల్ ప్రిన్సిపాల్ ఇంజాపూరి మధుబాబు, త్రినేత్ర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నాగుల ఆదిచరణ్, మాట్ల కళ్యాణ్, బత్తిని రవిచంద్ర, వెంగళ శివ తేజ, గాజుల దిలీప్ కుమార్, రాంశెట్టి సాయికృష్ణ, ముచ్చ సురేష్, పుప్పాల వినయ్ కుమార్, చేరాల నిత్యానంద సాయి, రాంశెట్టి రాజకుమార్, బాలసాని హరీష్, బైరి వెంకటరమణ ,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి ఆవిర్భావం దినోత్సవ వేడుకలు



**మునుగోడు, మార్చి 29 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం.మర్రిగూడ మండల కేంద్రంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం వేడుకలు టిడిపి మండల అధ్యక్షులు దోమల వెంకన్న యాదవ్ ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ ఆవరణంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జండా ఆవిష్క రణ చేశారు. ఈ సందర్భంగా దోమల వెంకన్న మాట్లాడుతూ, 1982 మార్చి 29 టిడిపి పార్టీ తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం, పేదల కోసం ఆవిర్భవించిందని ఆయన కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తాలూకా వ్యవస్థను రద్దుచేసి మండల వ్యవస్థను ప్రవేశపెట్టిన ఘనత ఎన్.టి.ఆర్ కే దక్కిందని ఆయన అన్నారు.1994 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ (మిత్ర కూటమితో కలిసి) అత్యధికంగా 246 సీట్లు గెల్చుకుందని కాంగ్రెస్ పార్టీ కేవలం 26 సీట్లు గెలుచుకొని ప్రతిపక్ష పార్టీ హోదాను సైతం కోల్పోయిందని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంపూర్ణ మద్యపాన నిషేధంను అమలు చేశారని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి పుప్పాల యాదయ్య, మండల బిసి సెల్ అధ్యక్షులు కాసాల అంజయ్య, మర్రిగూడ గ్రామ శాఖ అధ్యక్షులు గుణగంటి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి దేవరకొండ సత్తయ్య, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు పోలె మల్లయ్య, లెంకలపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు వరికుప్పల శ్రీనివాస్, ఇందుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు వీరమళ్ళ మల్లేష్ గౌడ్, పిట్టల సత్తయ్య, ఖాసీం పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ భద్రకాళి వీరభద్ర కళ్యాణ మహోత్సవం




**కొల్చారం మార్చి 29( నినాదం) :** మండల కేంద్రమైన కొల్చారంలోని పురాతన ప్రసిద్ధి చెందిన ఆలయమైన శ్రీ భద్రకాళి వీరభద్ర సమేత కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగాయి. శనివారం నాడు ఆలయంలో గణపతి పూజతో పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం గౌరీ పూజ, హోమం, నవగ్రహాల పూజా కార్యక్రమం అనంతరం పూజా కార్యక్రమం అనంతరం సుంకు మొదలగు కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం పురస్కరించుకొని వీరభద్ర ప్రస్తాయాన్ని మొదలుకొని వేద పండితుల మంత్రోచ్ఛరణలతొ అగ్నిగుండాల కార్యక్రమం ఘనంగా జరిగింది. తదుపరి ఘట్టంగా శ్రీ భద్రకాళి వీరభద్ర కళ్యాణం వేద పండితుల మంత్రం చలనతో బంజా నర్సప్ప కుటుంబ సమేతంగా స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. తదనంతరం గ్రామ ప్రజలందరూ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో శివ స్వామి, సంగమేశ్వర స్వామి, బక్కయ్య స్వామి, యోగేశ్ స్వామి, మహేష్ స్వామి, ప్రవీణ్ స్వామి పండితుల గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఈ కళ్యాణ మహోత్సవం జరిగింది.

# రుద్రారంలో ఘనంగా ఉల్లాస్ పరీక్ష

**మల్హర్, మార్చి 29 (నినాదం):** మల్హర్ రావు మండలంలోని రుద్రారం గ్రామంలో స్వయం సహాయక సంఘాల (గాం+) సభ్యులకు ఉల్లాస్ పరీక్షను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పరీక్ష రాశారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చంద్రగిరి సంపత్, ముఖ్య అతిథిగా హాజరై పరీక్ష నిర్వహణను పరిశీలించారు. హెచ్‌ఎం మేడం శైలజ, పరీక్ష నిర్వహణలో భాగస్వామ్యమై సభ్యులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించారు.అలాగే (ఖాూూా) రజిత, రాజయ్య, మానస, అంగన్వాడీ టీచర్లు మమత, సుమలత, (జజ) ఇందారపు రవికుమార్, కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడగా, సభ్యులు ఎంతో శ్రద్ధగా ప్రశ్నలకు సమాధానాలు రాశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహిళల సాధికారత, విద్యా అభివృద్ధి కోసం ఉల్లాస్ పరీక్షలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామంలో విద్యపై ఆసక్తి పెరుగుతున్నదానికి ఈ కార్యక్రమం నిదర్శనమని తెలిపారు.మొత్తంగా ఈ ఉల్లాస్ పరీక్ష కార్యక్రమం గ్రామంలో చైతన్యాన్ని పెంపొందిస్తూ విజయవంతంగా ముగిసింది.



## ఎస్సై రామ్మూర్తిని మర్యాదపూర్వకంగా
# కలిసిన సూక్ష్మ కళాకారుడు విద్యాధర్



**చింతపల్లి, మార్చి 29(నినాదం) :** మండలంలోని కుర్మపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ కాళికాదేవి, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్ల ఆలయ కమిటీ చైర్మన్, సూక్ష్మ కళాకారుడు, గిన్నిస్ బుక్ రికార్డు పొందిన ముంజంపల్లి విద్యాధర్ చారి ఆదివారం స్థానిక ఎస్సై ముత్యాల రామ్మూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఐకి ఒక పెన్ ను బహుమతిగా అందజేశారు. ఆయన వెంట ఆ గ్రామ సర్పంచ్ కట్ట మహేష్, దార్ల ప్రభాకరాచారి, తదితరులు ఉన్నారు.

# ఘనంగా శ్రీ వెంకటేశుడి రథయాత్ర




**మహదేవపూర్ మార్చి 29, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలోని మందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి రథయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి రోజున శ్రీ వెంకటేశ్వర స్వామి అలివేలు మంగళ కళ్యాణం జరిగిన తర్వాత ఆదివారం బొమ్మపూర్, బ్రాహ్మణపల్లి, మహాదేవపూర్ పురవీధులలో శ్రీ వెంకటేశ్వర స్వామి అలివేలు మంగళ రథయాత్ర భాజా భజంత్రీలతో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి పురవీధులలో హారతులతో స్వామివారికి స్వాగతం పలికారు.

## రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**ఎఐఆర్ టిడబ్ల్యూఎఫ్-సీఐటీయూ**
**మార్చి 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : జిల్లా అధ్యక్షులు పి.ఊసన్న పిలుపు**



**పెబ్బేరు మర్చి 29 (నినాదం):** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం: రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు ఎఐఆర్ టిడబ్ల్యూఎఫ్ - సీఐటీయూ చేయాలని జిల్లా అధ్యక్షులు పి.ఊసన్న డిమాండ్ చేశారు. రేపు మార్చి 30 హైదరాబాద్లో నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డ్రైవర్లు, కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి స్కీం వల్ల నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నెలకు రూ. 4,500 ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అలాగే ఓలా, ఉబర్, ర్యాపిడో, పోర్టర్ వంటి ప్రైవేట్ యాప్‌ల స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సహకార యాంను వెంటనే అమలు చేయాలని, దానిలో గూడ్స్ రవాణాను కూడా చేర్చాలని సూచించారు. మోటార్ వాహన చట్టం-2019ను కార్మికులకు అనుకూలంగా సవరించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ చటాలను రోడ్డు రవాణా కార్మికులందరికీ వర్తించేలా చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమాను రూ. 10 లక్షలకు పెంచాలని, రహదారులపై డ్రైవర్లకు అవసరమైన విశ్రాంతి, వసతి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఇంకా పెట్రోల్, డీజిల్ ధరలు, టోల్ చార్జీలను తగ్గించాలని, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల దోపిడీని అరికట్టాలని, చిన్న వాహన యాజమానులకు జాతీయ బ్యాంకుల ద్వారా సులభ రుణాలు ఇవ్వాలని కోరారు. ఆటో మీటర్ చార్జీలను పెంచడంతో పాటు కార్లకు కంపెనీలు నిర్ణయించే కిరాయి రేట్లను కూడా పెంచాలని తెలిపారు. పోలీసులు, ఆర్టీవో అధికారుల వేధింపులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ, రేపు హైదరాబాద్లో జరిగే కార్యక్రమంలో డ్రైవర్ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# జవాబుదారీతనం లేని పాలన

## ప్రజాస్వామ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్న పాలకుల ఆడంబరాలు మరియు చట్టాల అసంబద్ధత

**భారతదేశం స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు గడుస్తున్నా, నేటికీ పాలనలో జవాబుదారీతనం మరియు చట్టాల అమలులో పారదర్శకత అనేది అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. దేశం ఆర్థికంగా ఎదుగుతున్నట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో సామాన్య పౌరుడి పరిస్థితి మరియు పాలకుల జీవనశైలిని గమనిస్తే ప్రజాస్వామ్యం తన అసలు మార్గాన్ని తప్పుతోందా అన్న సందేహం కలుగుతోంది.**

ఎడిటోరియల్

ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు పాలకులకు మరియు ప్రజలకు మధ్య పెరుగుతున్న అగాధం. ఒకప్పుడు ప్రజాప్రతినిధులు అంటే ప్రజల కష్టాల్లో పాలుపంచుకునే వారని, కానీ నేడు వారు భారీ భద్రతా వలయాలు, విలాసవంతమైన కాన్వాయ్‌లు మరియు ప్రోటోకాల్ ఆడంబరాల మధ్య ఒక ప్రత్యేక లోకంలో విహరిస్తున్నారని చెప్పక తప్పదు. ఈ తరహా 'విడదీయబడిన సంస్కృతి' పాలకులను సామాన్యుడి వాస్తవ వేదనకు దూరం చేస్తోంది. ఒక పౌరుడు తన ప్రాథమిక అవసరాలైన రోడ్లు, తాగునీరు లేదా విద్యుత్ కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి రావడం, ప్రతి చిన్న పనికి పాలకుల కనుసన్నలు అవసరమవ్వడం వ్యవస్థాగత వైఫల్యానికి పరాకాష్ట.

నిజమైన అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యవస్థలు ఎవరి ఆదేశాల కోసం వేచి చూడకుండా స్వయంచాలితంగా పనిచేస్తాయి. కానీ మన దగ్గర ప్రతి చిన్న ప్రజా సమస్యపై స్పందించడానికి కూడా ఒక విపత్తు సంభవించే వరకు లేదా ఉన్నతాధికారులు తనిఖీకి వచ్చే వరకు యంత్రాంగం కదలకపోవడం విచారకరం. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కేవలం బదిలీలతో సరిపెట్టకుండా, వారిపై కఠినమైన శిక్షలు అమలు చేయడంతో పాటు భవిష్యత్తులో ఎక్కడా బాధ్యతలు చేపట్టకుండా అనర్హత వేటు వేయాలి. అప్పుడే వ్యవస్థలో బాధ్యత, భయం పెరుగుతాయి. అధికారం అనేది కేవలం ఓట్లు దండుకోవడానికి లేదా హోదాను అనుభవించడానికి కాదని, అది ప్రజలకు సేవ చేయడానికి దక్కిన పవిత్రమైన బాధ్యత అని నేతలు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

మరోవైపు, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే పేరుతో కార్పొరేట్ చట్టాల్లో ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు విమర్శలకు దారితీస్తున్నాయి. వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం కోసం సాంకేతిక లోపాలకు క్రిమినల్ శిక్షలను తొలగించి, సివిల్ జరిమానాలుగా మార్చడం పైకి ఆశాజనకంగా కనిపించినా, అందులోని లోపాలు సామాన్య వ్యాపారులను ఇబ్బంది పెట్టేలా ఉన్నాయి. నివేదికల సమర్పణలో ఆలస్యం వంటి చిన్నపాటి పొరపాట్లకు భారీ జరిమానాలు విధిస్తూ, కంపెనీల మూలాలనే దెబ్బతీసే నిధుల మళ్లింపు వంటి తీవ్రమైన నేరాలకు మాత్రం శిక్షలు అంత ప్రభావవంతంగా లేకపోవడం చట్టం యొక్క అసమతుల్యతను ఎత్తి చూపుతోంది. చట్టం అనేది తప్పు యొక్క తీవ్రతను బట్టి ఉండాలి తప్ప, కేవలం జరిమానాల వసూలే లక్ష్యంగా ఉండకూడదు. అలాగే, న్యాయస్థానాల పరిధిని తగ్గించి ప్రభుత్వ అధికారులకు శిక్షలు వేసే అధికారం అప్పగించడం వల్ల పారదర్శకత లోపించే ప్రమాదం ఉంది. అధికారుల విచక్షణపై నిర్ణయాలు ఆధారపడినప్పుడు పక్షపాతానికి తావుంటుంది, ఇది దీర్ఘకాలంలో వ్యవస్థకు నష్టం కలిగిస్తుంది.

దేశ భవిష్యత్తుకు వెన్నెముకగా నిలవాల్సిన యువత నేడు బాధ్యతారాహిత్యం మరియు విలాసాల వైపు మళ్లుతుండటం ఆందోళనకరమైన విషయం. సంపన్న యువత విలాసవంతమైన వాహనాల్లో వేగంగా ప్రయాణిస్తూ నిబంధనలను అతిక్రమిస్తున్న ఉదంతాలు సమాజంలో నైతిక విలువల పతనాన్ని సూచిస్తున్నాయి. ఈ అనంతమైన యువశక్తిని దేశ నిర్మాణం, ఆవిష్కరణలు మరియు సామాజిక సమస్యల పరిష్కారం వైపు మళ్లించడంలో పాలక వ్యవస్థలు సరైన దిశానిర్దేశం చేయలేకపోతున్నాయి. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం మరియు పారదర్శకమైన పాలనను అందించడం.

ముగింపుగా చెప్పాలంటే, ఆడంబరాలు మరియు ఆర్భాటాల కంటే బాధ్యతకే ప్రాధాన్యతనిచ్చే రోజు వచ్చినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాకారం అవుతుంది. నెల్సన్ మండేలా అన్నట్లు, ఒక దేశం దాని ఉన్నత పౌరులను ఎలా చూస్తుందనే దానికంటే, దాని దిగువ స్థాయి పౌరులను ఎలా గౌరవిస్తుందనే దానిపైనే ఆ దేశ గొప్పతనం ఆధారపడి ఉంటుంది. పాలకుల చుట్టూ ఉన్న కంచెలు తొలగిపోయి, సామాన్యుడికి చేరువైనప్పుడే వ్యవస్థలో మార్పు మొదలవుతుంది. చట్టాలు పారదర్శకంగా, తప్పు తీవ్రతకు అనుగుణంగా ఉంటూ, అధికారులు బాధ్యతతో పనిచేసినప్పుడే భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా ఒక ఆదర్శవంతమైన శక్తిగా నిలుస్తుంది. ఆ లక్ష్యం దిశగా పాలకులు, అధికారులు మరియు పౌరులు తమ వంతు బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహించాల్సిన అవసరం ఉంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# తొలి తెలుగు సినీ కథా నాయకురాలు కమలాబాయి

## మార్చి 30... సురభి కమలాబాయి వర్ధంతి





సురభి కమలాబాయి (1907 – 1971) తొలి తెలుగు సినిమా నటీమణి, గాయని. ఆమె 1931లో హెచ్.ఎం.రెడ్డి నిర్మించిన తొలి తెలుగు టాకీ చిత్రము భక్తప్రహ్లాద లో లీలావతి పాత్ర ధరించారు.

కమలాబాయి 1907లో సురభి నాటక కళాకారుల కుటుంబములో జన్మించారు. ఆమె తండ్రి కృష్ణాజీరావు. తల్లి వెంకూబాయి కమలాబాయితో గర్భవతిగా ఉండి ఒక నాటకములో దమయంతి పాత్ర వేస్తున్నప్పుడు పురిటినొప్పులు రాగా తెరదించి ఆ రంగస్థలము పైనే కమలాబాయిని ప్రసవించడం విశేషం. ప్రేక్షకులు ఇదికూడా నాటకములో భాగమనుకొన్నారు. అసలు విషయం తెలిసిన తర్వాత ప్రేక్షకులు చంటిబిడ్డ మీద డబ్బుల వర్షం కురిపించారు.

రంగస్థల కుటుంబంలో పుట్టిన కమలాబాయికి చిన్నప్పటి నుండే నటన అలవాటయింది. బాల్యంలో కృష్ణుని, ప్రహ్లాదుని పాత్రలు వేస్తుండేవారు. యుక్త వయసు వచ్చిన తర్వాత మగ పాత్రలు ఆపేసి ఆడ పాత్రలు ధరించడం ప్రారంభించారు. అందరూ మహిళలే నటించి విజయవంతమైన సావిత్రి నాటకంలో ఆమె సావిత్రి పాత్రను పోషించారు.

బాల్యం నుంచి రంగస్థల నటిగా ఎదుగుతూ హెచ్.ఎం.రెడ్డి రూపొందించిన తొలి టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద'లో హిరణ్య కశపునిగా నటించిన మునిపల్లె వెంకట సుబ్బయ్య సరసన లీలావతిగా ఆమె పరిచయమయ్యారు. సర్వోత్తమ బదామి దర్శకత్వంలో సాగర్ ఫిలింస్ రూపొందించిన 'పాదుకా పట్టాభిషేకం'లో సీతగా అద్దంకి శ్రీరామమూర్తి సరసన, సాగర్ ఫిలింస్ బాదామి సర్వోత్తంతో రూపొందించిన 'శకుంతల'లో శకుంతలగా యడవల్లి సూర్యనారాయణతో నటించారు. బి.వి.రామానందం దర్శకత్వంలో కృష్ణా ఫిలింస్ నిర్మించిన 'సావిత్రి'లో సావిత్రిగా టైటిల్ రోల్ పోషించారు. సరస్వతి సినీ టోన్ నిర్మించిన 'పృథ్వీపుత్ర'లో ఓ ముఖ పాత్ర పోషించారు.

కమలాబాయి ప్రతిభ గురించి విని, ప్రత్యక్షంగా చూసి ముగ్ధుడైన సాగర్ ఫిల్మ్ అధినేత కమలాబాయిని బొంబాయికి ఆహ్వానించారు. అక్కడే పదేళ్లపాటు ఉండి సాగర్ ఫిల్మ్ నిర్మించిన సినిమాలలో నటించింది. మహాభారతం వంటి 25 చిత్రాలలో ఆమె నటించారు.

1939లో విడుదలైన భక్తజయదేవ సినిమాతో మళ్ళీ తెలుగు సినిమాలలో నటించడం ప్రారంభించారు. విశాఖ పట్నం లోని ఆంధ్రా సినీ టోన్ అనే చిత్ర నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న ఆ చిత్రాన్ని తెలుగు, బెంగాలీ భాషలలో నిర్మించారు. ఈ రెండు భాషలలోనూ కమలాభాయే కథానాయకి. ఆ చిత్రంలో రెంటచింతల సత్యనారాయణ, సురభి కమలాబాయి ముఖ్య పాత్రధారులు. ఆ చిత్రానికి హిరేన్ బోస్ అనే బెంగాలీ ఆయన దర్శకుడు. అయితే ఆయన సాంకేతిక పరిజ్ఞానం అంతంత మాత్రం కావడంతో చిత్ర నిర్మాణం సరిగా సాగలేదు. నిర్మాణం ఆగిపోయి నిర్మాతలకు భారీగా నష్టం వచ్చే పరిస్థితిలో కథానాయిక పాత్ర ధరించడంతో పాటు దర్శకత్వం, ఎడిటింగ్ కూడా తనే నిర్వహించి, చిత్రాన్ని పూర్తి చేసి అందర్నీ ఆశ్చర్యపరచారు కమలాబాయి. అయితే చిత్రం టైటిల్స్ లో మాత్రం దర్శకుడిగా హిరెన్ బోస్ పేరే కనబడుతుంది.

అలాగే తొలి ద్విభాషా చిత్రమైన తుకారాం (1940) తెలుగు వెర్షన్లో ఆమె నటించారు. అప్పటి వరకు కథానాయకి పాత్రలు పోషించిన కమలాబాయి ఆ తర్వాత సినిమాలలో కారెక్టర్ రోల్సు వెయ్యటం ప్రారంభించారు. ఈ విధంగా నటించిన సినిమాలలో పత్ని, మల్లీశ్వరి, లక్ష్మమ్మ, పాతాళభైరవి, సంక్రాంతి, అగ్నిపరీక్ష ముఖ్యమైనవి.

కమలాబాయి సినిమాల ద్వారా సంపాదించిన డబ్బు ముప్పై వేలను భవిష్యత్తు అవసరాలకై ఒక బ్యాంకులో డిపాజిట్టు చేయగా, ఆ బ్యాంకు దివాళా తీసి, తన డబ్బు కోల్పోయి చివరి దశలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వయసు మీదపడి సినిమాలలో అవకాశాలు సన్నగిల్లినా ఇంట్లో ఊరకే కూర్చోలేక తన అక్క కూతురైన సురభి బాలసరస్వతితో పాటు షూటింగులకు వెళుతుండే వారు. అలా ఆర్థిక ఇబ్బందులో అవసాన దశలో 1971, మార్చి 30న మరణించారు.

భక్తప్రహ్లాద (1931) – లీలావతి; శకుంతల (1932); పాదుకా పట్టాభిషేకం (1932) – సీతాదేవి; సావిత్రి (1933); పృథ్వీపుత్ర (1933); షెహర్ కా జాదూ (1934) – లైలా; ద్రౌపదీ మానసంరక్షణం (1936); దో దివానే (1936); బేఖరాబ్ జాన్ (1936); తుకారాం (1938); భక్త జయదేవ (1938); భూకైలాస్ (1940); మంగళ (1951); పాతాళభైరవి (1951); మల్లీశ్వరి (1951); దేవదాసు (1953); మాంగల్య బలం (1958); పెళ్లినాటి ప్రమాణాలు (1958); జయభేరి (1959); వాగ్దానం (1961); తదితర చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494

### బ్రహ్మాండ నాయకునికి

# బ్రహ్మోత్సవ శోభ

## శ్రీనివాసుడి సాలకట్ల వసంతోత్సవాలు.. మూడు రోజుల పాటు వార్షిక ఉత్సవాలు

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు అనగానే భక్త జన ప్రవాహం, తన్మయత్వంతో మిన్నంటేలా వారు చేసే గోవింద నామ స్మరణ, మాడ వీధుల్లో దేవేరులతో స్వామి ఊరేగింపులూ, సాటిలేని వైభవంతో సాగే వాహన సేవలు కళ్ళ ముందు కదులుతాయి. సదరు స్వామివారిని వివిధ రూపాల్లో, అవతారాల్లో దర్శనం చేసుకున్న వారికి అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తి కావడంతో పాటు.. పుణ్యఫలాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. తిరుమల చరిత్రలో, వందల ఏళ్ళ నుంచీ వివిధ ఉత్సవాల నిర్వహణ జరుగుతున్నది. ఎందరో రాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిష్ అధికారులు, తర్వాత హథీరాం మహంతుల హయాంలో ఉత్సవాలు కొనసాగాయి.

పురాణాలు, శాసనాల ఆధారంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు 6వ శతాబ్దంలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. చక్రవర్తులు, మహారాజులు తమ విజయ పరంపరలకు గుర్తుగా తిరుమలేశుని బ్రహ్మోత్సవాల పేరుతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించేవారు. క్రీ.శ.614లో పల్లవరాణి సమవాయ్( పేరిందేవి) మనవాళ పెరుమాళ్ అనే వెండి భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని తిరుమల ఆలయానికి బహుకరించింది. పెరటాసి నెలలో (కన్యామాసం) జరిగే బ్రహ్మోత్సవాలకు ముందు ఈ వెండి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించేవారు. ఆ తరువాత క్రీ.శ.1254 చైత్ర మాసంలో తెలుగు పల్లవరాజు విజయ గండ గోపాల దేవుడు, క్రీ.శ.1328 ఆషాఢమాసంలో ఆడి తిరునాళ్ల పేరుతో త్రిభువన చక్రవర్తి తిరువేంకట యాదవ రాయలు, క్రీ.శ.1429 ఆశ్వయుజ మాసంలో వీర ప్రతాప దేవరాయలు, క్రీ.శ.1446లో మాసి తిరునాళ్ల పేరుత హరిహరి రాయలు, క్రీ.శ.1530లో అచ్యుతరాయ బ్రహ్మోత్సవంగా అచ్యుత రాయలు, ఉత్సవాలు నిర్వహించేవారని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.10వ శతాబ్దంలో తిరుమలలో 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరిగేవి. ఉత్సవాల్లో ఉగ్ర శ్రీనివాసమూర్తిని ఉత్సవ విగ్రహంగా వినియోగించేవారు. క్రీ.శ.1339 నుంచి మలయప్ప కోనలో లభించిన మలయప్ప



స్వామిని ఉత్సవ విగ్రహాలుగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. ఒకప్పుడు నెలకొకటి చొప్పున ప్రతి ఏటా పన్నెండు బ్రహ్మోత్సవాలు కూడా జరిగేవని చరిత్ర చెబుతోంది.

కొన్ని ఇబ్బందులు, సమస్యల కారణంగా ఏడాదికి ఒకసారి, అధిక మాసంలో రెండు సార్లకు బ్రహ్మోత్సవాలు పరిమితం అయ్యాయి. ఈ వేడుకల్లో శ్రీ వేంకటేశ్వరుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్త కోటికి దర్శన భాగ్యాన్ని కల్పిస్తున్నాడు. ఎలాంటి పరిస్థితులు తలెత్తినప్పటికీ శ్రీవారి బ్రహ్మోత్సవాలను రద్దు చేయడం కానీ, ఏకాంతంగా నిర్వహించడం కానీ తిరుమల క్షేత్ర చరిత్రలో లేదు.

అలాగే కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న తిరుమలలో ఏడాది వార్షిక (సాలకట్ల) బ్రహ్మోత్సవాలతో పాటు, ఏటా వసంతోత్సవాలు సాంప్రదాయ రీతిలో కన్నుల పండువగా కొనసాగు తాయి. సున్నాయి. చైత్ర మాసంలో తిరుమల శ్రీవారి ఆలయంలో మార్చి 30 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి.

ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. మార్చి 30 తేదీన ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు నాలుగు మాడవీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేసి, ఇక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు.

రెండవ రోజు 31న శ్రీ భూ సమేత శ్రీ మలయప్ప స్వామి వారు ఉదయం 8 నుండి 10 గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతారు. అనంతరం వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. చివరిరోజు ఏప్రిల్ 1న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారితో పాటుగా శ్రీ సీతా రామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవ మూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంకాలానికి ఆలయానికి చేరుకుంటారు.

ఈ సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. కాగా ప్రతి రోజు సాయంత్రం 6 నుండి 6.30 గంటల వరకు ఆస్థానం ఘనంగా నిర్వహిస్తారు. వసంత ఋతువులో శ్రీ మలయప్ప స్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఈ క్రతువులో సుగంధ పుష్పాలను స్వామికి సమర్పించటమే కాక వివిధ ఫలాలను కూడా నివేదించడం ఈ వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియ. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494

# నవ్వులను నరికేసి

తొలి నాల్లలో ఆమె నవ్వుల కొలనులో
నన్ను నెట్టేసి సంబరాల జలకాలాడించేది
ఇప్పుడు ఆమె ఆ నవ్వులను నరికేసి
నాకు నరకాన్ని సోపతి చేసింది
మొదట్లో నా పెయ్యి చుట్టూ వైఫై లా
వ్యాపించి నాకు ఊపిరాడకుండా చేసేది
ఇప్పుడు మాటల సూదులను గుచ్చుతూ
నా పెయ్యినంతా ఆమె జల్లెడ చేస్తుంది

ప్రతీ మాటకు తప్పును తవ్వి తీస్తూ
నా కంటి మీద కునుకు లేకుండా చేస్తూ
సూర్యకాంతంలా చిందులు వేస్తుంది
కోపానికి కేరాఫ్ గా మారి పేటెంట్
తీసుకుంది

నిజంగా ఆమె హృదయం ఆకాశ మంతా
విశాలమైనది సముద్ర మంతా లోతైనది
మాట కఠినమైనా మనసు మాత్రం వెన్న
దాన గుణంలో ఆమె ధర్మరాజుకు చెల్లెలు

సముద్రంలో ఆటుపోటులు వస్తూనే
ఉంటాయి కానీ సముద్రం మాత్రం స్థిరంగా
ఉంటుంది
చీకటి , రాత్రులు వస్తూనే ఉంటాయి కానీ
కాలం మాత్రం సాగిపోతూనే ఉంటుంది
అలానే మన స్నేహంలో అనుమానాలు,
అపోహలు వస్తూనే ఉంటాయి మనం
కూడా
అర్థం చేసుకోవాలి ఆగం కాకూడదు

మన కలయిక కాలానికి
కన్ను కుట్టినట్లుంది
అన్నారం షరీఫ్ లో కందూరు చేయిస్తా
మనల్ని చూసి జనాలకు ఎర్రి లేచినట్టుంది
ఖిలా వరంగల్ లో ఒక తాయతను కట్టిస్తా
సమ్మక్క సారక్క దగ్గర యాటను కోయించి
శంభునిపేట లో ఇఫ్తార్ విందును ఇచ్చేస్తా

నా సామ్రాజ్యానికి నిన్ను రాణిని చేసి
షాజహాన్ అసూయపడేలా వరంగల్
చౌరస్తాలో మరో తాజ్ మహల్ ను నిర్మిస్తా
మన తీపి గుర్తులన్నీ ఒక దగ్గర కుప్పపోసి
ఫబ్లిక్ గార్డెన్ లో ఒక మ్యూజియాన్ని నిర్మిస్తా
నీ అందమైన రూపాన్ని అక్షర రూపం
చేసేసి
కాళిదాసు కుళ్ళుకునేలా ఒక అందమైన
కావ్యాన్ని రాసేస్తా


తాటిపాముల రమేశ్ (తార )
7981566031

### జన హృదయాలలో సుస్థిర స్థానాన్ని

# సంపాదించుకున్న ఆనంద్ బక్షి

**మార్చి 30...ఆనంద్ బక్షి వర్ధంతి**

638 హిందీ సినిమాలకు 3500లకు పైగా పాటలను వ్రాసిన రికార్డు ఆయనకే సొంతం. ఉత్తమ గేయ రచయితగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారానికై 40 సార్లు ప్రతిపాదింప బడి, 4 పర్యాయాలు ఉత్తమ గేయ రచయితగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారం దక్కించుకున్న ఘనత ఆయనదే. అయిదు దశాబ్దాల నాడు నాటి సినీ ప్రేక్షకులకు, పాటల శ్రోతలకు సుపరి చితమైన పేరు ఆయనది. నాడు పేరుమోసిన ఎందరో సంగీత దర్శకులు ఆయన రచనలకు బాణీలు సమకూర్చగా, ఎందరో సినీ నేపథ్య గాయకులు పాటలు పాడారు. ఆయనే అనేకానేక జనరంజకమైన పాటలను రచించి జన హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సుప్రసిద్ధ హిందీ సినీ కవీ ఆనంద్ బక్షి. ఆనంద్ బక్షి (బక్షి ఆనంద్ ప్రకాష్ వైద్) ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న రావల్పిండిలో 1930, జూలై 21న జన్మించారు. ఇతని పూర్వీకులు రావల్పిండి సమీపంలో ఉన్న కుర్రీ గ్రామానికి చెందిన మోహ్యాల్ బ్రాహ్మణులు. వారి మూలాలు కాశ్మీర్‌లో ఉన్నాయి. ఇతడు 5 సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు ఆయన తల్లి సుమిత్ర మరణించింది. దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం పూనే, మీరట్‌ల గుండా ప్రయాణించి ఢిల్లీకి వలస వచ్చి, అక్కడ స్థిరపడింది. అయన ప్రాథమిక విద్య అనంతరం భారతీయ సైన్యంలో చేరారు. చిన్నతనం నుండే కవిత్వం వ్రాయాలని ఉబలాటం ఉండేది.



అయితే సైన్యంలో సమయం దొరకక ఎక్కువగా వ్రాయడానికి కుదరలేదు. సమయం చిక్కినప్పుడల్లా కవిత్వం వ్రాసేవారు. తన పాటలను సైన్యంలో స్థానిక కార్యక్రమాలలో ఉపయోగించే వారు. సైన్యంలో ఎక్కువ కాలం పనిచేశారు. బక్షీ హిందీ సినిమాలలో రచయితగా, గాయకుడిగా పేరు తెచ్చు కోవాలని రంగ ప్రవేశం చేసినా, చివరకు గేయ రచయితగానే రాణించారు. బ్రిజ్‌మోహన్ సినిమా భలా ఆద్మీ (1958) చిత్రంతో ఆయనకు గీత రచయితగా గుర్తింపు వచ్చింది. 1956 నుండి 1962 వరకు కొన్ని చిత్రాలకు పని.చేసినా 1962లో మెహెందీ లగీ మేరీ హాత్తో ఆయన విజయ పరంపర ప్రారంభ మయ్యింది. ఆయన మొత్తం 638 హిందీ సినిమాలకు 3500లకు పైగా పాటలను వ్రాశారు. భక్షీ పాటలకు లక్ష్మీ కాంత్ ప్యారేలాల్, ఆర్.డి.బర్మన్, కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ, ఎస్.డి.బర్మన్, అను మాలిక్, రాజేష్ రోషన్, ఆనంద్ మి లింద్ మొదలైన సంగీత దర్శకులు బాణీలు కూర్చగా, షంషాద్ బేగం, ఇలా అరుణ్, ఖుర్షీద్ బావ్రా, అమీర్ బాయి కర్ణాటకి, సుధా మల్హోత్రా, కిశోర్ కుమార్, శైలేంద్ర సింగ్, కుమార్ సానూ, కవితా కృష్ణమూర్తి వంటి అనేక మంది గాయనీ గాయకులు పాటలను గానం చేశారు. భక్షీ వ్రాసిన పాటలలో 1972లో వచ్చిన హరేరామ హరేకృష్ణ చిత్రంలోని దమ్ మారో దమ్ పాట ఇతడిని ప్రతిభావంతుడైన రచయితగా నిలబెట్టింది. ఆయన గీతరచన చేసిన చిత్రాలలో బాబీ, అమర్ ప్రేమ్, ఆరాధన, జీనే కీ రాహ్, మేరా గావ్ మేరా దేశ్, ఆయే దిన్ బహార్ కే, ఆయా సావన్ ఝూమ్‌కే, సీతా ఔర్ గీతా, షోలే, ధరమ్ వీర్, నగీనా, లమ్హే, హమ్, మొహ్రా, దిల్ వాలే దుల్హానియా లేజాయేంగే, పర్‌దేశ్, దుష్మన్, తాళ్, మొహబ్బతే, గదర్: ఏక్ ప్రేమ్ కథ, యాదే వంటి అనేక విజయ వంతమైన చిత్రాలున్నాయి. ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతు, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌తో 2002, మార్చి 30వ తేదీన తన 71వ యేట మరణించారు. ఆయన రచించిన పాటలున్న చివరి సినిమా మొహబూబా మరణానంతరం విడుదలయ్యింది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494


# ప్రమాదకర మానసిక రుగ్మత - బైపోలార్ డిజార్డర్

## (30 మార్చి "ప్రపంచ బైపోలార్ దినోత్సవం" సందర్భంగా)

ఒక రకమైన మానసిక ఆరోగ్య రుగ్మతను "బైపోలార్ డిసార్డర్" అని అర్థం చేసుకోవాలి. ఈ రుగ్మత కలిగిన వ్యక్తి తీవ్రమైన మానసిక స్థితి మార్పులను ప్రదర్శిస్తాడు. ఈ రకమైన మానసిక స్థితి మార్పుల్లో మేనియా (భావోద్వేగ అల్ప దశలు – డిప్రెషన్), హైపోమేనియా (భావోద్వేగ ఉన్నత దశలు) అని రెండు రకాలుగా ఉంటాయి. బైపోలార్ డిజార్డర్ రకాల్లో ఉన్మాద దశలు, డిప్రెసివ్ దశలు, సైకోథైమిక్ డిజార్డర్స్ ఉంటాయి. సాధారణ హైపోమేనియా స్థితుల్లో రోగ లక్షణాలు కార్యాచరణ పెరగడం, నిద్ర తగ్గడం, వేగంగా మాట్లాడడం, ఆలోచనలు వేగంగా రావడం, ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవడం గమనించవచ్చు. సాధారణ డిప్రెషన్ స్థితుల్లో నిరాశ, అలసట, ఆసక్తి లేకపోవడం, ఏకాగ్రతలో ఇబ్బందులు, నిద్ర/ఆకలిలో మార్పులు లాంటి రోగ లక్షణాలు కలిపిస్తాయి.

**ప్రపంచ బైపోలార్ దినోత్సవం:**

బైపోలార్ డిజార్డర్‌కు కారణాలుగా జన్యుపరమైన, మెదడు రసాయన అసమతుల్యత, పర్యావరణ ప్రభావాలు దోహదపడతాయి.



బైపోరార్ రుగ్మతలకు సరైన చికిత్సల్లో మానసిక స్[illegible]తితిని స్థిరపరిచే మందులు, కౌన్సిలింగ్, జీవనశైలి/ఒత్తిడి నిర్వహణ వ్యూహాలు, క్రమబద్ధమైన మానసిక పర్యవేక్షణ లాంటివి ఆచరిస్తారు. బైపోలార్ డిజార్డర్ పట్ల ప్రజల్లో అవహాహన కల్పించడంతో పాటు అపోహలు తొలగించడానికి ప్రతి ఏటా 30 మార్చి రోజు "ప్రపంచ బైపోరడలార్ దినోత్సవం (వరల్డ్ బైపోలార్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. ఈ రోజున విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, రోగులకు మద్దత్తు ఇవ్వడం, వైద్య సేవలు అందుబాటులో ఉంచడం విధిగా జరగాలి. బైపోలార్ డిజార్డర్‌తో బాధపడిన ప్రఖ్యాత పాశ్చాత్య కళాకారుడు "విన్సెంట్ వాన్ గోహ్" జన్మదినం సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం కొనసాగుతున్నది. ప్రపంచ బైపోలార్ దినం–2026 ఇతివృత్తంగా "బైపోలార్ స్ట్రాంగ్" అనే అంశాన్ని తీసుకున్నారు. బైపోలార్ డిజార్డర్‌ను ప్రపంచ మానవాళినా చూసే విధానం మారాలని, రోగులకు బలం చేకూరాలని జరగాలి.

బైపోలార్ డిజార్డర్‌తో జీవించడం చాలా బాధాకరం. మానసిక స్థితిలో మార్పులు, గందరగోళం, నిరాశ, మానసిక ఒత్తిడి వంటివి వ్యక్తులపైననే కాకుండా పర్యావరణంపై కూడా ప్రభావం చూపుతాయి.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# పని విభజనతో ముప్పారం విలేజ్ కేబినెట్

## ఊరు కోసం శాఖల వారిగా బాధ్యులు

## పని విభజన శాఖలతో సమన్వయం




గ్రామ సర్పంచి రేణుక



వయోజనుల పరీక్షలను పరిశీలిస్తున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ బాధ్యురాలు కృష్ణవేణి



**వరంగల్ ప్రతినిధి, మార్చి29 (నినాదం): గ్రామస్థాయిలో సమర్థవంత, సమీప పాలన కోసం ఏర్పాటు చేసిన విలేజ్ కేబినేట్ ఇప్పుడిప్పుడే సత్ఫలితాలనిస్తోంది. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో విలేజ్ కేబినెట్ వ్యవస్థ పూర్తి స్థాయిలో అమలులోకి వచ్చిన అనంతరం సంబంధింత వార్డు సభ్యులు అధికార వికేంద్రీకరణ సూత్రాన్ని పునాదిగా చేసుకుని, పని విభజనతో ప్రతిశాఖపై పట్టు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాగునీరు, సాగునీరు, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్య, వైద్యం, రెవెన్యూ, విద్యాశాఖ వంటి ముఖ్యమైన విభాగాలు స్వతంత్రంగా నిర్వహించుకునే ప్రయత్నంలో ఉన్నారు.**

ప్రధానంగా గ్రామ అవసరాలైన పారిశుద్యం, తాగునీటి సరపరా, పంచాయతీ విభాగం బాధ్యతలు నిర్వహిస్తున్న వెల్దండి శ్వేత విద్యాసాగర్ ప్రతీ రోజు ఉదయం గ్రామ సిబ్బందితో చేపడుతున్న పారిశుద్య పనులను పరిశీలి స్తున్నారు. ఉపసర్పంచ్ తాళ్లపల్లి కుమార స్వామి నిత్యం వీధి దీపాలు, గ్రామవిద్యుదీ కరణ పర్యవేక్షిస్తున్నారు. అంగన్ వాడి కేంద్రాలపై ముంజ క్రిష్ణవేణి గౌడ్ నిత్యం పరిశీలిస్తూ స్త్రీ శిశు సంక్షేమంపై దృష్టి సారిస్తున్నారు. గ్రామంలో వైద్యం, వారం తప్ప వైద్య శిబిరాల నిర్వహణపై గోకల ప్రణీత సలీం పట్టు సాదించి గ్రామస్థులకు, వైద్యులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తు న్నారు. దేవాలయాలపై ఎతిరాజుల శోభా, సంక్షేమ కార్యక్రమాలపై సునిత, నీటిపారుదల అంశాలపై వేములకొండ యాదగిరి, రోడ్ల నిర్వహణపై కందుకూరి విజయచందర్ లు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఇటీవలే ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠాశాలల్లో విద్యార్థులను చేర్పించడంలో విద్యాశాఖ బాధ్యుడు రాజేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రామంలో 12 శాఖలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా గ్రామస్థులు ఈ మార్పును ఆహ్వానిస్తున్నట్టు గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక తెలిపారు. "

**సత్వర నిర్ణయాలు తక్షణ పరిష్కారాలు : సర్పంచ్ గుంటిపల్లి రేణుక**

గ్రామస్థుల పరిష్కారం కోసం వారం వారం ఫిర్యాదులు స్వీకరించి వాటి సత్వర పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్టు గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక స్పష్టం చేశారు. ఏ పని అయినా మండల కేంద్రం లేదా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని అన్ని సేవలు సర్టిఫికెట్లు, పెన్షన్లు, వ్యవసాయ సహాయం, ఆరోగ్య సేవలు గ్రామంలోనే లభించే విధంగా ఏర్పాటు చేస్తామని గ్రామ చెప్పారు. అధికార వికేంద్రీ కరణ వల్ల నిర్ణయాలు త్వరగా తీసుకోవడం సాధ్యమవుతోంద అనవసర జాప్యాలు తగ్గి, సమస్య లు తక్షణం పరిష్కారమవుతున్నాయని తెలిపారు. "ప్రతి ముప్పారం గ్రామంలోని ఈ విలేజ్ కేబినెట్ మోడల్ రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు ఉదాహరణగా నిలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రోత్సాహంతో, గ్రామస్థుల సానుకూల స్పందనతో ఈ వ్యవస్థను మరింత బలపేతం చేస్తామని, ఈ కొత్త వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం ఆశయం మరింత దగ్గరవుతోందని ఆశాభావం వ్యక్తం చేసారు.





వైద్య ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ బాధ్యురాలు గోకల ప్రణీత



ప్రభుత్వ బడులలో పిల్లలను చేర్పిస్తున్న విద్యాశాఖ బాధ్యుడు రాజేష్

### 3500లకుపైగా పాటలతో

# సినీ కవి ఆనంద్ బక్షి రికార్డు

### మార్చి 30...ఆనంద్ బక్షి వర్ధంతి



638 హిందీ సినిమాలకు 3500లకు పైగా పాటలను వ్రాసిన రికార్డు ఆయనకే సొంతం. ఉత్తమ గేయ రచయితగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారానికై 40 సార్లు ప్రతిపాదింప బడి, 4 పర్యాయాలు ఉత్తమ గేయ రచయితగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారం దక్కించుకున్న ఘనత ఆయనదే. అయిదు దశాబ్దాల నాడు నాటి సినీ ప్రేక్షకులకు, పాటల శ్రోతలకు సుపరి చితమైన పేరు ఆయనది. నాడు పేరుమోసిన ఎందరో సంగీత దర్శకులు ఆయన రచనలకు బాణీలు సమకూర్చగా, ఎందరో సినీ నేపథ్య గాయకులు పాటలు పాడారు. ఆయనే అనేకానేక జనరంజకమైన పాటలను రచించి జన హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సుప్రసిద్ధ హిందీ సినీ కవి ఆనంద్ బక్షి.

ఆనంద్ బక్షి (బక్షి ఆనంద్ ప్రకాష్ వైద్) ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న రావల్పిం డిలో 1930, జూలై 21న జన్మించారు. ఇతని పూర్వీకులు రావల్పిండి సమీ పంలో ఉన్న కుర్రీ గ్రామానికి చెందిన మోహ్యాల్ బ్రాహ్మణులు. వారి మూలా లు కాశ్మీర్‌లో ఉన్నాయి. ఇతడు 5 సం వత్సరాల వయసులో ఉన్నప్పుడు ఆయ న తల్లి సుమిత్ర మరణించింది. దేశ విభజన సమయంలో ఆయన కుటుం బం పూనే, మీరట్‌ల గుండా ప్రయాణిం చి ఢిల్లీకి వలస వచ్చి, అక్కడ స్థిరపడింది.

అయన ప్రాథమిక విద్య అనంతరం భారతీయ సైన్యంలో చేరారు. చిన్నతనం నుండే కవిత్వం వ్రాయాలని ఉబలాటం ఉండేది. అయితే సైన్యంలో సమయం దొరకక ఎక్కువగా వ్రాయడానికి కుదరలేదు. సమయం చిక్కినప్పుడల్లా కవిత్వం వ్రాసేవారు. తన పాటలను సైన్యంలో స్థానిక కార్యక్రమాలలో ఉపయోగించే వారు. సైన్యంలో ఎక్కువ కాలం పనిచేశారు.

బక్షీ హిందీ సినిమాలలో రచయితగా, గాయకుడిగా పేరు తెచ్చు కోవాలని రంగ ప్రవేశం చేసినా, చివరకు గేయ రచయితగానే రాణించారు. బ్రిజ్‌మోహన్ సినిమా భలా ఆద్మీ (1958) చిత్రంతో ఆయనకు గీత రచయితగా గుర్తింపు వచ్చింది. 1956 నుండి 1962 వరకు కొన్ని చిత్రాలకు పని.చేసినా 1962లో మెహెందీ లగీ మేరీ హాత్తో ఆయన విజయ పరంపర ప్రారంభ మయ్యింది. ఆయన మొత్తం 638 హిందీ సినిమాలకు 3500లకు పైగా పాటలను వ్రాశారు. భక్షీ పాటలకు లక్ష్మీకాంత్ ప్యారేలాల్, ఆర్.డి.బర్మన్, కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ, ఎస్.డి.బర్మన్, అను మాలిక్, రాజేష్ రోషన్, ఆనంద్ మి లింద్ మొదలైన సంగీత దర్శకులు బాణీలు కూర్చగా, షంషాద్ బేగం, ఇలా అరుణ్, ఖుర్షీద్ బావ్రా, అమీర్ బాయి కర్ణాటకి, సుధా మల్హోత్రా, కిశోర్ కుమార్, శైలేంద్ర సింగ్, కుమార్ సానూ, కవితా కృష్ణమూర్తి వంటి అనేక మంది గాయనీ గాయకులు పాటలను గానం చేశారు.

భక్షీ వ్రాసిన పాటలలో 1972లో వచ్చిన హరేరామ హరేకృష్ణ చిత్రంలోని దమ్ మారో దమ్ పాట ఇతడిని ప్రతిభావంతుడైన రచయితగా నిలబెట్టింది. ఆయన గీతరచన చేసిన చిత్రాలలో బాబీ, అమర్ ప్రేమ్, ఆరాధన, జీనే కీ రాహ్, మేరా గావ్ మేరా దేశ్, ఆయే దిన్ బహార్ కే, ఆయా సావన్ ఝూమ్‌కే, సీతా ఔర్ గీతా, షోలే, ధరమ్ వీర్, నగీనా, లమ్హే, హమ్, మొహ్రా, దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే, పర్‌దేశ్, దుష్మన్, తాళ్, మొహబ్బతే, గదర్: ఏక్ ప్రేమ్ కథ, యాదే వంటి అనేక విజయ వంతమైన చిత్రాలున్నాయి.

ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతు, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌తో 2002, మార్చి 30వ తేదీన తన 71వ యేట మరణించారు. ఆయన రచించిన పాటలున్న చివరి సినిమా మెహబూబా మరణానంతరం విడుదలయ్యింది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**9440595494**

# నవ్వులను నరికేసి



తొలి నాళ్లలో ఆమె నవ్వుల కొలనులో
నన్ను నెట్టేసి సంబరాల జలకాలాడించేది
ఇప్పుడు ఆమె ఆ నవ్వులను నరికేసి
నాకు నరకాన్ని సోపతి చేసింది
మొదట్లో నా పెయ్యి చుట్టూ వైఫై లా
వ్యాపించి నాకు ఊపిరాడకుండా చేసేది
ఇప్పుడు మాటల సూదులను గుచ్చుతూ
నా పెయ్యినంతా ఆమె జల్లెడ చేస్తుంది

ప్రతీ మాటకు తప్పును తవ్వి తీస్తూ
నా కంటి మీద కునుకు లేకుండా చేస్తూ
సూర్యకాంతంలా చిందులు వేస్తుంది
కోపానికి కేరాఫ్ గా మారి పేటెంట్ తీసుకుంది

నిజంగా ఆమె హృదయం ఆకాశ మంతా
విశాలమైనది సముద్ర మంతా లోతైనది
మాట కఠినమైనా మనసు మాత్రం వెన్న
దాన గుణంలో ఆమె ధర్మరాజుకు చెల్లెలు

సముద్రంలో ఆటుపోటులు వస్తూనే ఉంటాయి
కానీ సముద్రం మాత్రం స్థిరంగా ఉంటుంది
చీకటి , రాత్రులు వస్తూనే ఉంటాయి కానీ
కాలం మాత్రం సాగిపోతూనే ఉంటుంది
అలానే మన స్నేహంలో అనుమానాలు,
అపోహలు వస్తూనే ఉంటాయి మనం కూడా
అర్థం చేసుకోవాలి ఆగం కాకూడదు

మన కలయిక కాలానికి కన్ను కుట్టినట్లుంది
అన్నారం షరీఫ్ లో కందూరు చేయిస్తా
మనల్ని చూసి జనాలకు ఎర్రి లేచినట్లుంది
ఖిలా వరంగల్ లో ఒక తాయతను కట్టిస్తా
సమ్మక్క సారక్క దగ్గర యాటను కోయించి
శంభునిపేట లో ఇఫ్తార్ విందును ఇచ్చేస్తా

నా సామ్రాజ్యానికి నిన్ను రాణిని చేసి
షాజహాన్ అసూయపడేలా వరంగల్ చౌరస్తాలో
మరో తాజ్ మహల్‌ను నిర్మిస్తా
మన తీపి గుర్తులన్నీ ఒక దగ్గర కుప్పపోసి
పబ్లిక్ గార్డెన్ లో ఒక మ్యూజియాన్ని నిర్మిస్తా
నీ అందమైన రూపాన్ని అక్షర రూపం చేసేసి
కాళిదాసు కుళ్ళుకునేలా ఒక అందమైన కావ్యాన్ని రాసేస్తా

**తాటిపాముల రమేశ్ (తార)**
**7981566031**

# తొలి తెలుగు సినీ కథా నాయకురాలు కమలాబాయి

## నేడు సురభి కమలాబాయి వర్ధంతి

**సురభి కమలాబాయి (1907 - 1971) తొలి తెలుగు సినిమా నటీమణి, గాయని. ఆమె 1931లో హెచ్.ఎం.రెడ్డి నిర్మించిన తొలి తెలుగు టాకీ చిత్రము భక్తప్రహ్లాద లో లీలావతి పాత్ర ధరించారు. కమలాబాయి 1907లో సురభి నాటక కళాకారుల కుటుంబములో జన్మించారు. ఆమె తండ్రి కృష్ణాజీరావు. తల్లి వెంకూబాయి కమలాబాయితో గర్భవతిగా ఉండి ఒక నాటకములో దమయంతి పాత్ర వేస్తున్నప్పుడు పురిటినొప్పులు రాగా తెరదించి ఆ రంగస్థలము పైనే కమలాబాయిని ప్రసవించడం విశేషం. ప్రేక్షకులు ఇదికూడా నాటకములో భాగమనుకొన్నారు. అసలు విషయం తెలిసిన తర్వాత ప్రేక్షకులు చంటిబిడ్డ మీద డబ్బుల వర్షం కురిపించారు.**

రంగస్థల కుటుంబంలో పుట్టిన కమలాబాయికి చిన్నప్పటి నుండే నటన అలవాటయింది. బాల్యంలో కృష్ణుని, ప్రహ్లాదుని పాత్రలు వేస్తుండే వారు. యుక్త వయసు వచ్చిన తర్వాత మగ పాత్రలు ఆపేసి ఆడ పాత్రలు ధరించడం ప్రారంభించారు. అందరూ మహిళలే నటించి విజయ వంతమైన సావిత్రి నాటకంలో ఆమె సావిత్రి పాత్రను పోషించారు.

బాల్యం నుంచి రంగస్థల నటిగా ఎదుగుతూ హెచ్.ఎం.రెడ్డి రూపొందించిన తొలి టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద'లో హిరణ్య కశపునిగా నటించిన మునిపల్లె వెంకట సుబ్బయ్య సరసన లీలావతిగా ఆమె పరిచయమయ్యారు. సర్వోత్తమ బదామి దర్శకత్వంలో సాగర్ ఫిలింస్ రూపొందించిన 'పాదుకా పట్టాభిషేకం'లో సీతగా అద్దంకి శ్రీరామమూర్తి సరసన, సాగర్ ఫిలింస్ బాదామి సర్వోత్తంతో రూపొందించిన 'శకుంతల'లో శకుంతలగా యడవల్లి సూర్యనారాయణతో నటించారు. బి.వి.రామానందం దర్శకత్వంలో కృష్ణా ఫిలింస్ నిర్మించిన 'సావిత్రి'లో సావిత్రిగా టైటిల్ రోల్ పోషించారు. సరస్వతి సినీ టోన్ నిర్మించిన 'పృథ్వీపుత్ర'లో ఓ ముఖ పాత్ర పోషించారు.

కమలాబాయి ప్రతిభ గురించి విని, ప్రత్యక్షంగా చూసి ముగ్ధుడైన సాగర్ ఫిల్మ్ అధినేత కమలాబాయిని బొంబాయికి ఆహ్వానించారు. అక్కడే పదేళ్లపాటు ఉండి సాగర్ ఫిల్మ్







నిర్మించిన సినిమాలలో నటించింది. మహాభారతం వంటి 25 చిత్రాలలో ఆమె నటించారు.

1939లో విడుదలైన భక్తజయదేవ సినిమాతో మళ్ళీ తెలుగు సినిమాలలో నటించడం ప్రారంభించారు. విశాఖ పట్నం లోని ఆంధ్రా సినీ టోన్ అనే చిత్ర నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న ఆ చిత్రాన్ని తెలుగు, బెంగాలీ భాషలలో నిర్మించారు. ఈ రెండు భాషలలోనూ కమలాభాయే కథానాయకి. ఆ చిత్రంలో రెంటచింతల సత్యనారాయణ, సురభి కమలాబాయి ముఖ్య పాత్రధారులు. ఆ చిత్రానికి హిరేన్ బోస్ అనే బెంగాలీ ఆయన దర్శకుడు. అయితే ఆయన సాంకేతిక పరిజ్ఞానం అంతంత మాత్రం కావడంతో చిత్ర నిర్మాణం సరిగా సాగలేదు. నిర్మాణం ఆగిపోయి నిర్మాతలకు భారీగా నష్టం వచ్చే పరిస్థితిలో కథానాయిక పాత్ర ధరించడంతో పాటు దర్శకత్వం, ఎడిటింగ్ కూడా తనే నిర్వహించి, చిత్రాన్ని పూర్తి చేసి అందర్నీ ఆశ్చర్యపరచారు కమలాబాయి. అయితే చిత్రం టైటిల్స్ లో మాత్రం దర్శకుడిగా హిరెన్ బోస్ పేరే కనబడుతుంది.

అలాగే తొలి ద్విభాషా చిత్రమైన తుకారాం (1940) తెలుగు వెర్షన్లో ఆమె నటించారు. అప్పటి వరకు కథానాయకి పాత్రలు పోషించిన కమలాబాయి ఆ తర్వాత సినిమాలలో కారెక్టర్ రోల్సు వెయ్యటం ప్రారంభించారు. ఈ విధంగా నటించిన సినిమాలలో పత్ని, మల్లీశ్వరి, లక్ష్మమ్మ, పాతాళభైరవి, సంక్రాంతి, అగ్నిపరీక్ష ముఖ్యమైనవి.

కమలాబాయి సినిమాల ద్వారా సంపాదించిన డబ్బు ముప్పై వేలను భవిష్యత్తు అవసరాలకై ఒక బ్యాంకులో డిపాజిట్టు చేయగా, ఆ బ్యాంకు దివాళా తీసి, తన డబ్బు కోల్పోయి చివరి దశలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వయసు మీదపడి సినిమాలలో అవకాశాలు సన్నగిల్లినా ఇంట్లో ఊరకే కూర్చోలేక తన అక్క కూతురైన సురభి బాలసరస్వతితో పాటు షూటింగులకు వెళుతుండే వారు. అలా ఆర్థిక ఇబ్బందులో అవసాన దశలో 1971, మార్చి 30న మరణించారు.

భక్తప్రహ్లాద (1931) – లీలావతి;
శకుంతల (1932);పాదుకా పట్టాభిషేకం (1932) – సీతాదేవి; సావిత్రి (1933); పృథ్వీపుత్ర (1933); షెహర్ కా జాదూ (1934) – లైలా; ద్రౌపదీ మానసంరక్షణం (1936); దో దివానే (1936);
బేఖరాబ్ జాన్ (1936); తుకారాం (1938); భక్త జయదేవ (1938);
భూకైలాస్ (1940); మంగళ (1951); పాతాళభైరవి (1951);
మల్లీశ్వరి (1951); దేవదాసు (1953);మాంగల్య బలం (1958);
పెళ్లినాటి ప్రమాణాలు (1958);
జయభేరి (1959); వాగ్దానం (1961); తదితర చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# తెలుగు సినీ రంగ అగ్ర నటుడు చిత్తూరు నాగయ్య

చిత్తూరు నాగయ్య (1896 -- 1973) తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిన మహా నటుడు. భక్తి ప్రధాన పాత్రలు, చారిత్రక, సామాజిక పాత్రల్లో ఆయన అపూర్వమైన ప్రతిభను కనబరిచారు. నటుడిగా, గాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన తెలుగు నాట అగ్రశ్రేణి కళాకారుడిగా గుర్తింపు పొందారు.

చిత్తూరు నాగయ్య 1896 మార్చి 28న ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా, రేపల్లె గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు ఉప్పలదడియం నాగయ్య శర్మ. చిన్ననాట నుండే నాటకాలపై ఆసక్తి పెంచుకున్న నాగయ్య, విద్యాభ్యాసం పూర్తయ్యాక ప్రభుత్వ ఉద్యోగం చేపట్టారు.

అయితే, ఆయన హృదయం కళలపైనే ఆసక్తిగా ఉండడంతో, ఉద్యోగాన్ని వదిలేసి నాటక రంగంలో ప్రవేశించారు. సంగీతంపై గాఢమైన ప్రేమ ఉండటంతో కర్ణాటక సంగీతం లో శిక్షణ తీసుకున్నారు.

నాగయ్య తన నటనా ప్రస్థానాన్ని నాటకాల ద్వారా ప్రారంభించారు. సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, బిల్హా – రంగనాథం వంటి నాటకాలలో ఆయన అద్భుతంగా నటించి, ప్రేక్షకుల అభిమానం పొందారు.

ఆయన భావ ప్రదర్శన, సంభాషణా నైపుణ్యం, సంగీత ప్రతిభ నటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాటక రంగంలో అందరినీ ఆకట్టుకున్న నాగయ్య, సినిమాల వైపు మళ్ళారు.



1937లో "గృహలక్ష్మి" చిత్రంతో నాగయ్య సినీ రంగంలో అడుగు పెట్టారు. ఈ సినిమా ఆయనకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆయన ప్రధానంగా పౌరాణిక, భక్తి ప్రధాన, చారిత్రక చిత్రాల్లో గొప్ప పాత్రలు పోషించి, తెలుగు సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడే స్థాయికి ఎదిగారు.

నాగయ్య నటించిన కొన్ని అత్యంత ప్రఖ్యాత చిత్రాలలో...భక్త పోతన (1942)లో -- పోతనగా ఆయన నటన అపురూపం, త్యాగయ్య (1946)లో త్యాగరాజ స్వామిగా ఆయన జీవించేసినంత గొప్ప నటన, శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం (1939)లో శ్రీవేంకటేశ్వరునిగా విశిష్టమైన నటన మరపు రానివి. అలాగే భక్త రామదాసు (1943)లో భక్త రామదాసుగా నటించి ప్రేక్షకుల గుండెల్లో నిలిచి పోయారు. యోగి వేమన (1947)లో యోగి వేమన పాత్రలో అద్భుతమైన అభినయం చూపారు. స్వర్గసీమ (1945)లో సామాజిక చిత్రంలో కూడా తన ప్రతిభను ప్రదర్శించారు. మల్లీశ్వరి (1951)లో ముఖ్యపాత్ర పోషించి ప్రేక్షకులను మెప్పించారు. దేవదాసు (1953)లో కీలకపాత్ర పోషించి ప్రేక్షకులను అలరించారు."త్యాగయ్య" చిత్రం జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందింది. ఇది భారతీయ సినీ చరిత్రలో తొలి జీవిత చరిత్ర (బయోపిక్) సినిమా గా చరిత్ర సృష్టించింది.

నాగయ్య గొప్ప గాయకుడు కూడా. ఆయన తన సినిమాల్లో చాలా పాటలు స్వయంగా పాడేవారు. ముఖ్యంగా భక్తి గీతాలు, కీర్తనలు ఆయన గొంతులో అద్భుతంగా ప్రతి ధ్వనించేవి.

నాగయ్య నటుడిగా మాత్రమే కాకుండా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా గుర్తింపు పొందారు. ఆయన స్వీయ దర్శక త్వంలో "త్యాగయ్య" సినిమాను నిర్మించి, జాతీయ అవార్డు గెలుచు కున్నారు. ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలో సంగీత కారుల జీవితాలను ఆధారంగా తీసుకుని నిర్మించిన తొలి చిత్రం.

సినిమారంగంలో గొప్ప స్థాయికి ఎదిగిన నాగయ్య, జీవితాంతం కళా రంగానికి అంకిత మయ్యారు. అయితే, జీవితాంతం సినిమా రంగానికే అంకితమై ఉన్నా, చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనారోగ్యంతో బాధ పడుతూ 1973 డిసెంబర్ 30న, చెన్నైలో మరణించారు. తెలుగు సినిమాకు భక్తి రస ప్రధాన పాత్రలలో మూడో కన్నుగా నిలిచారు. తెలుగు సినిమాను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రముఖ నటుల్లో ఒకరు. సినిమా ద్వారా సంగీతాన్ని ప్రజలకు చేరువ చేశారు. నేటికీ ఆయన నటన, గానం మనసులో నిలిచేలా ఉంటుంది.

చిత్తూరు నాగయ్య తెలుగులో తొలి మహా నటుల్లో ఒకరు. భక్తి ప్రధానమైన పాత్రలతో ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఆయన, సినీ రంగంలో తనదైన సుస్థిరమైన స్థానం సంపాదించారు. నటన, సంగీతం, దర్శకత్వం, నిర్మాణం -- ఇలా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఆయన తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాల మిస్ట్...9440595494**

## వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని ప్రధాన మంత్రికి విజ్ఞప్తి




**పటాన్చెరు, మార్చి 29 (నినాదం):** మండలంలోని పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందిన అనంతరం వాలిడేషన్ చట్టం తీసుకురాబడింది. ఈ చట్టం ప్రకారం 01-01-2026 తరువాత పదవీ విరమణ చేసిన వారికి మాత్రమే పెన్షన్ పెంపు ప్రయోజనాలు వర్తిస్తాయని నిర్ణయించబడింది. అయితే 31-12-2025 వరకు పదవీ విరమణ చేసిన పెన్షనర్లకు ఎటువంటి పెంపు ప్రయోజనాలు లభించవని స్పష్టమైంది. ఈ విధానం పట్ల పెన్షనర్లలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఒకే విధమైన సేవలు చేసిన వారిలో తేదీ ఆధారంగా తేడాలు చూపించడం అన్యాయమని వారు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల ఈ వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేసి, అన్ని పెన్షనర్లకు సమానంగా పెన్షన్ పెంపు ప్రయోజనాలు కల్పించాలని ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు. పెన్షనర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సముచిత నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన మల్కాజిగిరి టీడీపీ నాయకులు



**మల్కాజిగిరి, మార్చి 29 (నినాదం):** తెలుగు దేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్కాజిగిరి నియోజకవర్గం ఓల్డ్ సఫిల్‌గూడ దర్గా వద్ద తెలంగాణ తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, టీఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి డా బత్తిని నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.అనంతరం పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహ గౌడ్ మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ ప్రజల సంక్షేమం కోసం ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని, బలహీన వర్గాల అభ్యున్నతే పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు చింతల నరేష్ ముదిరాజ్, టీడీపీ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షులు పిరాని సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రచిక్షణ మహాభియాన్ శిక్షణ తరగతులు

### పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్



**మల్కాజిగిరి, మార్చి 29 (నినాదం):** మల్కాజిగిరి నియోజకవర్గం నేరేడ్ మెట్, యాప్రాల్ డివిజన్స్ లలోని బీజేపీ ముఖ్య నాయకులకు ఆదివారం నేరేడ్ మెట్ డిఫెన్స్ కాలనీ లోని బీజేపీ కార్యాలయం లో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రచిక్షణ మహాభియాన్ 2026 శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, నేషనల్ కౌన్సిలింగ్ మెంబెర్ గీత మూర్తి, వేముల వేణు, గోపాల్, స్టేట్ సోషల్ మీడియా కో కన్వీనర్, అకెళ్ళ శర్మ, సీనియర్ నాయకులు మల్లికా, శిబిరం క్లస్టర్ ఇంచార్జి ప్రక్షిషణ, రాష్ట్ర బీజేపీ పార్టీ నుంచి విశిష్ట అతిధి గా బద్దం మహిపాల్ రేడ్డి పాల్గొని శిక్షణార్ధులకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేరేడ్ మెట్ డివిజన్ అధ్యక్షులు ఆదిత్య భరద్వాజ్, సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రేడ్డి, బీజేపీ డివిజన్ కమిటీ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, డివిజన్ ప్రధాన కార్యదర్శులు, సీనియర్, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో తాగునీటి సమస్యే..

### ఎంపీ ఈటెల రాజేందర్
### డబుల్ బెడ్ రూమ్ బస్తీ బాట
### బాచుపల్లిలో డబుల్ బెడ్రూం ఇళ్లు పరిశీలించిన ఈటల రాజేందర్





**కుత్బుల్లాపూర్, మార్చి 29 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో నిర్మాణం జరిగిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించుటకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ స్థానిక పార్టీ ముఖ్య నేతలతో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లబాట కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా పలు ప్రాంతాలలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి అందులో నివసించే వారికి ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివసిస్తున్న వారు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి, పార్క్ నిర్మాణం చేయాలి, ప్రభుత్వ స్కూలు, బస్తీ దవాఖాన, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలి, ఆర్టీసీ బస్సు లోపలికి వచ్చేలా చూడండి, 9 వ ఫ్లోర్ లో నీళ్ళు లోపలికి వస్తున్నాయి, మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని డబుల్ బెడ్ రూమ్‌లో నివాసం ఉంటున్న వారు కోరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్య ప్రతి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వద్ద ఉన్నదన్నారు. బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో 1100 కుటుంబాలు ఉన్నాయి, సుమారు 5 వేల జనాభా ఉంటుంది. ఒక్కొక్కరికి 135 లీటర్ల ఇవ్వాలి అంటే 6.5 లక్షల లీటర్ల నీరు రావాలి కానీ ఏ డబుల్ బెడ్రూం కాలనీలో కూడా నీళ్లు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.అన్ని డబుల్ బెడ్ రూమ్ పైన వాటర్ ప్రూఫింగ్ చేయాలి. జనాభా ప్రాతిపదికన ఆశ వర్కర్లను, అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. డబుల్ బెడ్ రూమ్ ఇందులో నివసిస్తున్న కుటుంబాల సౌకర్యార్థం ప్రభుత్వ అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలి. ఒక ఊరిలో ఎలా ఉంటాయో అలాగే అన్ని షాపులు ఇక్కడ ఏర్పాటు చేయాలి. దోమల నరకం నుండి బయటపడాలంటే పక్కన ఉన్న చెరువులో ఉన్న గుర్రపు డెక్క తొలగించి శుభ్రం చేయాలని సూచించారు. స్థానిక కుటుంబాల అవసరాలకు అనుగుణంగా అత్యంత అవసరమైన శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి. స్థానికులకు కావలసిన ప్రార్థన మందిరాలను(దేవాలయాలు) నిర్మాణం చేయాలి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివసించే వారందరూ అన్నదమ్ములలాగా కుటుంబ సభ్యులలాగా కలిసి మెలిసి ఉండాలని పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సూచించారు. ప్రతి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వద్ద ప్రజలకు అవసరమైన నీటి సౌకర్యం కల్పించుటకు బోర్లు వేయిస్తానని ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ స్థానిక ప్రజలకు భరోసా ఇచ్చారు.

## రామేశ్వరంబండ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం




### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
### సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**పటాన్చెరు, మార్చి 29, (నినాదం):** ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని రామేశ్వరంబండ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం రామేశ్వరంబండ పరిధిలోని ఇంద్రపురి కాలనీలో పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రామేశ్వరంబండ పరిధిలోని నాలుగు వార్డుల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు భారీ విజయాన్ని అందించడం పట్ల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతి హామీ నెరవేర్చేందుకు ప్రణాళిక బద్దంగా నిధులు కేటాయించడంతోపాటు నిర్దేశించిన లక్ష్యంలోగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రమీల, మున్సిపల్ కమిషనర్ అజయ్ రెడ్డి, వైస్ చైర్మన్ హరీష్ రెడ్డి, కౌన్సిలర్లు అంతిరెడ్డి, రమేష్, వంకదోత్ రమేష్, మాజీ ప్రజా ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ మిత్ర మండలి ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన

**అల్వాల్, మార్చి 29 (నినాదం):** అల్వాల్ బ్రాహ్మణ మిత్ర మండలి ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన విష్ణు సహస్రనామ పారాయణం తిన్నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అల్వాల్ బ్రాహ్మణ సంఘ ప్రతినిధి శారదాపుత్రేవు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు ముఖ్య ప్రతినిధులుగా గీత మూర్తి, జరఘురామ శర్మ, హాజరైనారు ఈ కార్యక్రమంలో సునీత ప్రభ, కుమారి పద్మజా, గీత ,మీనా, జ్యోతి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## డ్వాక్రా మహిళల వయోజన విద్యాభివృద్ధికి గొప్ప వరం ఉల్లాస్

### జవహర్‌నగర్ సిఓ రాగిరోళ్ళ లక్ష్మీదేవి



**జవహర్ నగర్, మార్చి 29( నినాదం):** మహిళా సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులు అయిన వయోజన మహిళలను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఉల్లాస్ (అండర్స్టాండింగ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పథకాన్ని అమలులోకి తెచ్చిందని జవహర్ నగర్ సి ఓ రాగిరోల్ల లక్ష్మీదేవి తెలిపారు. జాతీయ సార్వత్రిక విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలకు రాత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వాక్రా సంఘ సి ఓ లక్ష్మీదేవి హాజరై మాట్లాడుతూ, దేశంలో ఉన్న ప్రతి మహిళ అక్షరజ్ఞానం కలిగి ఉండాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ పథకాన్ని విద్యాశాఖ సెర్ప్ ఉమ్మడి భాగస్వామ్యంతో ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారన్నారు. దశలవారీగా అమలు చేసే ఉల్లాస్ పథకంలో ముందుగా మహిళా సంఘాల్లో నిరక్షరాస్యలను గుర్తించి అక్షరాస్యులుగా చేయడంతో పాటు రెండో దశలో మధ్యలో బడి మానివేసిన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్ ద్వారా నేరుగా పదవ తరగతితో పాటు వారికి ఆసక్తిని బట్టి ఆసక్తి ఉంటే ఓపెన్ ఇంటర్ డిగ్రీ చదివిస్తారు. ఆ తర్వాత వారికి స్కిల్ డెవలప్మెంట్ టెక్నికల్ కోర్సులు నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించే ప్రత్యేక కార్యక్రమమే ఈ ఉల్లాస్ పథకం. ఈ పథకాన్ని విద్యాశాఖ సేర్ఫ్ ఉమ్మడి భాగస్వామ్యంతో ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఉల్లాస్ పథకంలో ముందుగా మహిళా సంఘాల్లో నిరక్షరాస్యలను గుర్తించి అక్షరాసులుగా చేయడంతో పాటు రెండో దశలో మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్ ద్వారా నేరుగా పదవ తరగతితో పాటు వారి ఆసక్తిని బట్టి వివిధ కోర్సుల్లోకి పంపిస్తారని తెలిపారు. అనంతరం 60 మంది డ్వాక్రా సంఘ మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఎల్ఎఫ్ శోభా రెడ్డి, ఆర్పీలు పాములపర్తి సుజాత, కే పద్మ, లీలావతి, వడ్లకొండ రాజేశ్వరి, మంజుల, కళావతి, డ్వాక్రా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో రికార్డు స్థాయిలో కేసుల పరిష్కారం

### ఎస్పీ స్నేహ మెహ్రా ఐపిఎస్



**వికారాబాద్, మార్చి 29(నినాదం):** జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్ అత్యంత విజయవంతమైందని, గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు, న్యాయశాఖ సమన్వయంతో పనిచేయడం వల్ల ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆమె కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3195 కేసులు పరిష్కారం కావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇందులో ముఖ్యంగా 441 ఎఫ్ ఐ ఆర్ కేసులు, 2694 (డీడీ) కేసులు, మరియు 60 ఈ పెట్టి కేసులు పరిష్కరించబడ్డాయని వివరించారు. ఈ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని, తద్వారా సామాన్య ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అయ్యాయని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. సబ్ డివిజన్ల వారీగా చూస్తే, తాండూరు సబ్ డివిజన్ అత్యధికంగా 1686 కేసులను పరిష్కరించి ప్రథమ స్థానంలో నిలవగా, పరిగి సబ్-డివిజన్ 846 కేసులు, వికారాబాద్ సబ్-డివిజన్ 631 కేసులను పరిష్కరించాయని ఎస్పీ గణాంకాలను వివరించారు. ఒక్క రోజే జిల్లా వ్యాప్తంగా 157 ఎఫ్ ఐ ఆర్ కేసులను పరిష్కరించి లక్ష్యానికి మించి ఫలితాలను సాధించామని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి, జిల్లాలో పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించి ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించాలని అధికారులను కోరారు. చట్టపరమైన చిక్కుల నుంచి ప్రజలు విముక్తి పొందేందుకు లోక్ అదాలత్ ఒక మంచి వేదిక అని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇంతటి భారీ స్థాయిలో కేసుల పరిష్కారానికి కృషి చేసిన అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, డి సీ ఆర్ బి డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్,జిల్లా లోని సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# వాహనదారుల భద్రతే ప్రధానం

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపిఎస్

**వికారాబాద్, మార్చి 29(నినాదం):** తెలంగాణ రాష్ట్ర డీజీపీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా, వికారాబాద్ జిల్లా మోమిన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏజేఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐ పి ఎస్ శిబిరాన్ని ప్రారంభించి, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా వాహనం నడిపే సమయంలో స్పష్టమైన కంటి చూపు ఉండటం అత్యంత అవసరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. డీజీపీ మార్గదర్శకత్వంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం మూడవ విడతలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు వాహనదారులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలు ఉన్నవారిని గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, మోమిన్ పేట సర్కిల్ సీ ఐ జి. వెంకట్, ధరూర్ సర్కిల్ సీ ఐ రఘురాములు, ఎంపిఐ శ్రీలక్ష్మి, మోమిన్ పేట సర్పంచ్ సంధ్య, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, వాహనదారులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## ‘వీర హనుమాన్ విజయాత్ర’ బైక్ ర్యాలీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**చేగుంట మార్చి 29 (నినాదం):** మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, శ్రీ కార్తవీర్యాయోగాశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ‘వీర హనుమాన్ విజయాత్ర’ బైక్ ర్యాలీ గోడ పత్రికను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో జరిగిన సన్నాహక కార్యక్రమంలో చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ భజరంగ్ దళ్ కండువా కప్పుకుని మత సామరస్యానికి సరికొత్త నిర్వచనం చెప్పారు. హిందూ ముస్లిం సోదరులందరూ మత విభేదాలకు అతీతంగా ఒక్కతాటిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నెల 31వ తేదీ మంగళవారం నాడు హనుమాన్ దేవాలయం వద్ద శ్రీ కార్తవీర్య యోగాశ్రమం చేగుంట వారి సౌజన్యంతో మధ్యాహ్నం 1:00 గంట నుండి సుమారు వెయ్యి మంది భక్తులకు భారీ అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు శ్రీ కార్త వీర్యాయోగాశ్రమం అధ్యక్షులు కరణం గణేష్ రవి కుమార్ తెలిపారు. అనంతరం అదే రోజు సాయంత్రం 3:00 గంటల నుండి ఆధ్యాత్మిక చైతన్యం నింపే లక్ష్యంతో సాగే ‘వీర హనుమాన్ విజయాత్ర’ బైక్ ర్యాలీ అత్యంత వైభవంగా సాగనుంది. చేగుంట గ్రామ క్షేమం కోసం, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమంలో చేగుంట మండలం తో పాటు పక్క మండలాల నుండి యువత, భక్తులు, ధర్మ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో విషయందో పరిషత్ జిల్లా అధ్యక్షులు నాగరాజు ప్రధాన కార్యదర్శి శ్యామ్ మండల అధ్యక్షులు సోమ సురేష్ భూపాల్ రెడ్డి మండల బిజెపి పార్టీ మాజీ అధ్యక్షులు చింతల భూపాల్ చేగుంట గ్రామపంచాయతీ వార్డు సభ్యులు సాయిబాబా శ్రీలత ఆరిఫ్ పాల్గొన్నారు.



# రోడ్డు పనుల దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం

- సమస్య పరిష్కరించాలని కెరెల్లి గ్రామస్తుల ధర్నా


**వికారాబాద్, మార్చి 29(నినాదం):** వికారాబాద్ జిల్లా ధారూర్ మండలంలోని కెరెల్లి గ్రామంలో రహదారి పనుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్న అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహంతో ఆదివారం ధర్నాకు దిగారు. తాండూరు హైదరాబాద్ రోడ్డుపై సుమారు గంటసేపు వాహనాలను నిలిపివేయడంతో ప్రయాణికులు, ముఖ్యంగా వృద్ధులు, ఆసుపత్రికి వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు నెలల క్రితం సీసీ రోడ్డు నిర్మాణం పేరుతో తవ్విన రహదారి ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో గ్రామం మొత్తం దుమ్ముతోగ్రామ పరిసరాలు కప్పుకుపోతోందని రోజూ భారీ వాహనాల రాకపోకల వల్ల ఎగిసిపడుతున్న దుమ్ము ఇళ్ళ లోకి, పాఠశాలలలోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నారులు శ్వాసకోశ సమస్యలు, అలర్జీలు, జలుబు వంటి అనారోగ్యాలతో బాధపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము ప్రభావంతో పంటల పెరుగుదల కూడా దెబ్బతిని రైతులు నష్టపోతున్నారన్నారు. పలుమార్లు సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో గ్రామస్థులు రోడ్డెక్కాల్సి వచ్చిందని తెలిపారు. సమాచారం అందుకున్న ధారూర్ ఎస్ఐ రాఘవేందర్ ఘటనాస్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ధర్నాను విరమించారు. ఈలాంటి సమస్యలు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయి. రోడ్ల నిర్మాణంపై అధికారుల నిర్లక్ష్య ధోరణి పై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రోడ్ల నిర్మాణాల కు అనువైన వేసవి కూడా కొన్ని రోజుల్లో పూర్తి కావస్తోంది. ఈ నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న రోడ్ల పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తా..

- నెమలి అనిల్ కుమార్

**కాప్రా, మార్చి 29 (నినాదం):** నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ ఎన్‌టీఆర్ నగర్, జయశంకర్ కాలనీ ప్రాంతాల్లో బస్తీ బాట కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డ్రైనేజ్ సమస్యలు, తాగునీటి సమస్య, చెత్త నిర్వహణ లోపాలు, కొత్త స్ట్రీట్ లైట్ల అవసరం వంటి అంశాలను ప్రజలు వివరించారు. ప్రతి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిక్కీ గౌడ్, జయశంకర్ కాలనీ ప్రెసిడెంట్ జి.సోములు, జనరల్ సెక్రటరీలు మిద్దేపాక క్రాంతి, రమేష్, మల్లాపూర్ జనరల్ సెక్రటరీ తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఉండం శ్రీనివాస్, కోయలకొండ రాజేష్,



శ్రీనివాస్, బ్రహ్మచారి, రాజన్, రమేష్, వెంకటప్ప, హరి, అనిల్, మల్లేశ్, చందు పాల్గొన్నారు.

# దాడిలో ఇద్దరికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

**వికారాబాద్, మార్చి 29(నినాదం):** వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం నాసన్‌పల్లి గ్రామంలో జరిగిన దాడి ఘటన స్థానికంగా కలకలం రేపింది. వడ్డే రమేష్ అనే వ్యక్తి నాగార్జున అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం, వడ్డే రమేష్ నాగార్జునపై కత్తితో తలపై దాడి చేయగా, అక్కడికి వచ్చిన మహిపాల్ అనే వ్యక్తి ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన రమేష్, మహిపాల్‌పై కూడా దాడి చేసి, అతని ఎడమ చేయి విరిగేలా తీవ్రంగా గాయపరిచినట్లు తెలిసింది. గాయపడిన నాగార్జున మహిపాల్‌ను వెంటనే వికారాబాద్‌లోని ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో మహిపాల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# అసలే కుక్కలు... ఆపై చర్మ వ్యాధులు

**గ్రామాల్లో కుక్కల బెడదతో వణుకుతున్న ప్రజలు**

**వ్యాధితో చర్మం ఎర్రబడుతుంది**

**జుట్టు ఊడుతుంది**

**చర్యలు తీసుకోవాలంటున్న మండల ప్రజలు**



**కమలాపూర్, మార్చి 29 (నినాదం):** మండలంలోని గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజలు వనికి పోతున్నారు. ఎక్కడ చూసినా విధులలో, ప్రధాన రహదారుల్లో గుంపులుగా తిరుగుతుంటే వాటిని చూసి పిల్లలు మహిళలు వృద్ధులు బెంబేలెత్తి పోతున్నారు. అసలే కుక్కలు ఈ మధ్య కుక్కలు చిన్నా పెద్ద తేడా లేకుండా కరుస్తూనే ఉన్నాయి. చిన్న పిల్లలు అయితే వాటిని చూస్తేనే వనికి పోతున్నారు.ఇది ఇలా ఉంటే గత కింత కుక్కలకు చర్మ వ్యాధి విస్తృతంగా సోకుతుంది. వ్యాధి సోకిన కుక్కలను చూస్తే ప్రజలు భయపడి పోతున్నారు. అసలే కుక్కలు అందులో వ్యాధి సోకి తిరుగుతున్నాయి.వాటి పక్కనుండి పోవాలంటే ప్రజలు ఆ వ్యాధి తమకు సోకుతుందో ఏమో అని ప్రజలు భయపడుతున్నారు.ఈ వ్యాధి సార్కోప్టిక్ ,డేమోడెక్స్ అనే సూక్ష్మ క్రిములతో వస్తుందని, గోమార్లు చిన్న సైజు ఈగల ద్వారా కుక్కలకు చర్మ వ్యాధి వ్యాప్తి చెందుతుందని పశు వైద్యాధికారులు తెలుపుతున్నారు. ఈ వ్యాధి సోకిన కుక్కలకు తీవ్ర దురద, జుట్టు ఉడి పోవడం, చర్మం ఎర్రబడడం, పుండ్లు ఏర్పడతాయన్నారు. ఈ కుక్కలను ఇదే విదంగా మిగితా జీవులకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉందని పశు వైద్యులు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.ఈ మధ్య కాలంలో ఈ వ్యాధి లక్షణాలు గల వీధి కుక్కలు ఎక్కువయ్యాయి.పెంపుడు కుక్కలకు వాటి యజమానులు, వీధి కుక్కలకు గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మణిగిల్ల గ్రామంలో మహిళలకు రాత పరీక్ష



**వనపర్తి ప్రతినిధి, మార్చి 29(నినాదం):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో ఆదివారం గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళలకు విద్య, సాధికారతను అందించెందుకు గాను నేషనల్ ఇన్స్టిట్యూట్ హోఫ్ ఓపెన్ స్కూలింగ్ పరీక్షను నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మనిగిళ్ల గ్రామ మహిళ సంఘం బుక్ కిపర్ శివ్వమ్మ అధ్యక్షతన నిర్వహించిన పరీక్షల నిర్వహణలో ఏపీఎం సక్రు నాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని పరీక్ష రాశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముప్పూరి గణేష్ కుమార్, యువత బోడి గణేష్, బి.బాలకృష్ణ, ఎస్.మల్లికార్జున్, ప్రేమ్ కుమార్ రెడ్డి, బోయిన మహేష్, చెన్నకేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 7,624 కేసుల పరిష్కారం

**ప్రజలకు త్వరిత న్యాయం అందించడమే లక్ష్యం**

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్**



**నల్లగొండ ప్రతినిధి, మార్చి 29 ( నినాదం):** జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీస్ శాఖ, న్యాయ విభాగం, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో విశేష ఫలితాలు సాధించబడినవి. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ లోక్ అదాలత్ నిర్వహించబడిందిని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 7,624 కేసులు విజయవంతంగా పరిష్కరించబడినవి. వాటి వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.ఐఐ కేసులు : 4,182, జు-ూావ్ఎ కేసులు :2,512, ఖూజ కేసులు : 886, ఎూూ కేసులు : 44,జాతీయ లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు త్వరిత న్యాయం అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా కోర్టులపై భారం తగ్గించడంతో పాటు, ప్రజల సమయం మరియు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు.అదేవిధంగా, ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందగలరని, భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాల్లో కూడా ప్రజలు చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు సంబంధిత శాఖల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం జరిగిందని అన్నారు.

## ఒకేసారి...3 నెలల రేషన్



**నూతనకల్,మార్చి 29 (నినాదం):** ఎండలు ముదురుతున్న వేళ రేషన్ కార్డుదారులు అవస్థలు పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది..కార్డుదారులకు ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది.. ఏప్రిల్,మే,జూన్ నెలల సంబంధించిన సన్న బియ్యం రేషన్ దుకాణాల నుంచి ఒకేసారి తీసుకునేలా వెసులుబాటు కల్పించింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయనున్నారు.

**స్థలం కొరతతో ఇబ్బందులు..**

ఇప్పటికే దొడ్డు బియ్యం మిగులు నిల్వలను అధికారులు వేలం వేయకపోవడం.. వాటిని తీసుకెళ్లక పోవడంతో డీలర్లు ఇబ్బందులు పడుతుండగా.. నెలవారీ సన్న బియ్యం బస్తాలకు స్థలం సరిపోడం లేదని వాపోతున్నారు.ఇప్పుడు మూడు నెలల కోట ఒకేసారి నిల్వ చేసుకోవాలంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.మరోవైపు కాంటాకు బ్లూటూత్ అనుసంధానం ఉండొచ్చని,అలాగైతే పంపిణీలో నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు చెప్తున్నారు.

## స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఎమ్మెల్యే లేఖ రాయాలి

**యాజమాన్యానికి ఎమ్మెల్యే కొమ్ముకాయడం సహించరానిది**

**కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు భద్రత లేదు**

**రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ మాజీ చైర్మెన్ ఇంతియాజ్ ఇసాక్**



**వనపర్తి ప్రతినిధి, మార్చి 29(నినాదం):** అక్షర కాన్సెప్ట్ స్కూల్ లో జరిగిన సంఘటన సమాజానికి తలవంపు అని, ఈ సంఘటనపై జిల్లా మంత్రి ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్వగృహంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ మాజీ చైర్మెన్ ఇంతియాజ్ ఇసాక్ పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని లేఖ వ్రాయాలని, బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, యాజమాన్యానికి ఎమ్మెల్యే కొమ్ము కాయడం సాహించరానిదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు భద్రత లేకుండా పోయిందని ఆయన ఆరోపించారు. మేము ఇప్పటికే స్పష్టంగా మాట్లాడాం కానీ ప్రభుత్వం మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో స్పందించలేదని, ఒక చిన్నారి బాలికపై జరిగిన దారుణ ఘటన ఈ సమాజాన్ని కుదిపేసిందని, నిందితుడిని అరెస్ట్ చేయడం స్వాగతించదగ్గ విషయం కానీ అది సరిపోదని అన్నారు. అరెస్ట్ ఒక మొదటి అడుగు మాత్రమేనని, న్యాయం కాదని అన్నారు. ఈ ఘటనను దాచిపెట్టడానికి ప్రయత్నించినవారు ఎవరు? స్కూల్ యాజమాన్యం బాధితురాలి ఇంటికి వెళ్లి సెటిల్మెంట్ కు ఎందుకు ప్రయత్నించింది? ఎందుకు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. స్కూల్ యాజమాన్యంపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, నేరాన్ని దాచిపెట్టడం కూడా నేరమే అవుతుందని చెప్పారు. మరోవైపు బాధితురాలికి న్యాయం కోరిన మా నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఏమిటని, ప్రశ్నించే వారిని భయపెట్టడమేనా అని ఆయన విమర్శించారు. పోలీస్ అధికారులకు స్పష్టమైన హెచ్చరిక చేస్తున్నామని, మీరు చట్టం కోసం పనిచేయాలని, అధికార పార్టీ కోసం కాదని, పక్షపాతం వెంటనే ఆపాలని అన్నారు.

మైనార్టీ బాలికకు న్యాయం చేయడం మీ బాధ్యత అని, అరెస్ట్ చేసి చేతులు దులుపుకోవడం సరిపోదని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని, గురుకులాలు అందుబాటులోకి తెచ్చి విద్యను అందించిన ఘనత కెసిఆర్ దేనని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురుకులాల్లో విద్యార్థులకు భద్రత లేకుండా పోయిందని, ఫుడ్ పాయిజన్ తో మరణాలు, అత్యాచారాలు, ఆత్మహత్యలు పెరిగిపోయాయని, గురుకులాల్లో చదవాలంటేనే విద్యార్థులు భయపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గురుకులాల్లో చదివే విద్యార్థుల శాతం 40 కి పడిపోయిందని, తల్లిదండ్రులు గురుకులాల్లో చదివించాలంటేనే భయపడుతున్నారని చెప్పారు. నిందితుడికి కఠిన శిక్ష, బెయిల్ రాకుండా చూడాలని, 90 రోజుల్లో ఛార్జ్‌షీట్ వేసి శిక్షించాలని, అక్షర స్కూల్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని, స్కూల్ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని,
బాధిత కుటుంబానికి పూర్తి సహాయం అందించాలని, ఇది కేవలం డిమాండ్ కాదని, ఇది ప్రజల హక్కు అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పూర్తిగా స్పందించకపోతే ఈ ఉద్యమం మరింత ఉధృతమవుతుందని, రాష్ట్రాన్ని కుదిపే స్థాయికి తీసుకెళ్తామని అన్నారు. అరెస్ట్‌తో కథ ముగియదని, న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుందని, నిజం కోసం మాట్లాడే గొంతుకలను ఎవరూ ఆపలేరని అన్నారు. ఇది హెచ్చరిక కాదని, ఇది న్యాయం కోసం జరిగే యుద్ధమని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మైనార్టీ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్, సయ్యద్ జమీల్, ఇమ్రాన్, అస్లాం, హరీఫ్, ఫజల్, ఏకె.పాషా, ముద్దసార్, అలీమ్, ఆర్షద్, సాజిద్, నజీరోద్దీన్, చిన్నిమియా, అక్రమ్, వాజీద్, నయ్యుం, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

## నేడు మూలమల్లలో చేతిరాళ్ల పోటీలు

**వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్ పర్సన్ పద్మజా రెడ్డి**



**అమరచింత, మార్చి 29, (నినాదం):** ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో నేడు ఉదయం 10 గంటలకు చేతిరాళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్పర్సన్ పద్మజారెడ్డి తెలిపారు. సరళ దేవి 25వ వర్ధంతి సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు ఉదయం 10 గంటలకు మూలమల్ల గ్రామానికి చేరుకోవాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో మొదటి విజేతకు రూ, 10000/ రెండవ విజేతకురూ, 8000/ మూడవ బహుమతి రూ,6000 /అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 100 కేజీలు ఎత్తిన వ్యక్తికి వెయ్యి రూపాయల ప్రోత్సాహక బహుమతి 120 కేజీలు ఎత్తిన ప్రతి వ్యక్తికి ప్రత్యేక బహుమతి అందజేస్తామని ఆమె తెలిపారు.

## అమ్మకు అక్షరమాలతో మహిళల్లో విద్యా చైతన్యం

**మెప్మా వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ యువరాజు**



**అమరచింత, మార్చి 29, (నినాదం):** అమ్మకు అక్షరమాల నవభారత సాక్షరత (ఉల్లాస్) కార్యక్రమాన్ని అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా మార్చే ఈ కార్యక్రమంలో 55 మంది మహిళలు పాల్గొన్నారని మెప్మా జిల్లా కోఆర్డినేటర్ యువరాజ్ తెలిపారు.వీరికి ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించి శిక్షణ తీసుకున్న మహిళలకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అక్షరాస్యత ద్వారా మహిళల్లో చైతన్యం వస్తుందని ఇది సమాజ అభివృద్ధికి తోడ్పడుతుందని యువరాజు తెలిపారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి, వైస్ చైర్మన్ రాధా అరుణ్, కమిషనర్ నూరుల్ నదీమ్ హాజరైనట్లు కోఆర్డినేటర్ యువరాజు తెలిపారు.

## సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా మారాలి

**జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి ప్రతాపరెడ్డి**



**వనపర్తి ప్రతినిధి, మార్చి 29 (నినాదం):** మహిళల్లో అక్షరాస్యత పెరిగి వనపర్తి సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా మారాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి ప్రతాపరెడ్డి కోరారు. వనపర్తి జిల్లాలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరక్షరాస్యులైన మహిళలకు అక్షరాస్యత పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ అమ్మకు అక్షరమాల అనే కార్యక్రమంలో ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా వనపర్తి మండలంలోని చిట్యాల, అంకూరు ,చిమనగుంటపల్లి, తూర్పు తాండ గ్రామాలను, వనపర్తి మున్సిపాలిటీని సందర్శించడం జరిగిందని ఆయన చెప్పారు. అన్ని గ్రామాలలో డి ఆర్ డి ఓ, సెర్ప్, మెప్మా, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఉల్లాస్ అమ్మకు అక్షరమాల ప్రోగ్రాం తో అక్షరాస్యత పెరగాలన్నదే లక్ష్యమని ప్రతాపరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది, ఏపీఎం బుచ్చన్న, డి ఆర్ డి ఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాయిల సింగారంలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు పనులు



**కోదాడ,మార్చి 29(నినాదం):** అనంతగిరి మండలం వాయిల సింగారంలో ఉపాధి హామీ నిధులు రూ.8 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. మంత్రి ఉత్తం, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు.యస్వీ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గద్దె రఘు, మత్య సహకార సంఘం అధ్యక్షుడు కంటు నాగార్జున, కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి, కంటు చిన నాగేశ్వరరావు, వార్డు సభ్యులు దేవులపల్లి నాగరాజు, దాములూరి మురళి, బొర్ర నవీన్, గుండ్లపల్లి వెంకన్న, చుండూరు సుధీర్, కంటు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయంగా చైతన్యం తెచ్చింది టిడిపినే..

**జడ రాములు యాదవ్**



**మిర్యాలగూడ మార్చి 29( నినాదం):** మండల పరిధిలోని తోపుచర్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా మండల పార్టీ అధ్యక్షులు షేక్ రసూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు అనంతరం ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ పిఎసిఎస్ చైర్మన్ జడ రాములు యాదవ్ టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండి జానీమియా లు విచ్చేసి జెండా ఆవిష్కరణ నిర్వహించారు అనంతరం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే సమాజంలో పెను మార్పులు వచ్చాయని పటేల్ పట్వారి వ్యవస్థ రద్దు తో పాటుగా రెండు రూపాయలకే కిలో బియ్యం ఇవ్వడం మహిళలకు ఆస్తిలో సమానపు హక్కు చట్టాన్ని ప్రవేశపెట్టడం అన్ని వర్గాలకు చట్టసభలకు వెళ్లేందుకు అవకాశాలు కల్పించడం లాంటి విప్లవత్వమైనటువంటి మార్పులకు శ్రీకారం చుట్టినటువంటి పార్టీ తెలుగుదేశం ఎన్టీఆర్ అని కొనియాడారు నేటితరం యువత రాజకీయాల్లోకి రావాలని ఎన్టీఆర్ ఆశ స్ఫూర్తి కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలో తెలుగుదేశం పార్టీ ఒక విప్లవత్మక మలుపు తీసుకొచ్చిన పార్టీ సంచనాలకు సంక్షోభావాలను చావు చూసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలిపారు తెలుగువాడి ఆత్మగౌరవం అనే నినాదంతో మహానటుడు నందమూరి తారక రామారావు 1982లో స్థాపించిన ఈ పార్టీ అప్పటి రాజకీయ వ్యవస్థను సవాలు చేసింది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఆదిపత్యానికి ప్రత్యామ్నాయంగా ప్రజలు ముందుకు వచ్చింది ఒక ఏడాది కాలంలోపే 1983లోని అధికారంలోకి రావడం టిడిపి చరిత్రలోనే కాక దేశ రాజకీయాల్లో కూడా ఒక మైలురాయి తెలుగు రాజకీయాల్లో ఒక విప్లవ శక్తిగా అవతరించిన పార్టీ టిడిపి ముద్ర వేసుకుంది ప్రజా నమ్మకం ఆత్మగౌరవం అభివృద్ధి ఈ మూడు సూత్రాలతో తన ప్రయాణాన్ని నిర్మించి ఉంది 1982లో నందమూరి తారక రామారావు వేసిన ఈ విత్తనం నేడు ఒక విశాల వృక్షంగా ఎదిగి మళ్లీ అధికారాన్ని అందుకుంది తెలుగువాడి ఆత్మగౌరవం అనే నినాదంతో ఎన్టీఆర్ ప్రజల్లో జ్వాలా రగిలించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు మామిడి నాగయ్య మండల పార్టీ కార్యదర్శి బంటు అంజయ్య గ్రామస్తులు పిట్టల అనిల్ వేముల కాశయ్య వల్లపు దాస్ వెంకన్న వెంకట్రెడ్డి షేక్ రహీం మక్బూల్ మక్తుమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**నల్లగొండ ప్రతినిధి, మార్చి 29( నినాదం):** తెలుగువాడి ఆత్మగౌరవం అనే నినాదంతో మహానటుడు నందమూరి తారక రామారావు 1982లో స్థాపించిన ఈ పార్టీ అప్పటి రాజకీయ వ్యవస్థను సవాలు చేసింది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఆదిపత్యానికి ప్రత్యామ్నాయంగా ప్రజలు ముందుకు వచ్చింది ఒక ఏడాది కాలంలోపే 1983లోని అధికారంలోకి రావడం టిడిపి చరిత్రలోనే కాక దేశ రాజకీయాల్లో కూడా ఒక మైలురాయి తెలుగు రాజకీయాల్లో ఒక విప్లవ శక్తిగా అవతరించిన పార్టీ టిడిపి ముద్ర వేసుకుంది ప్రజా నమ్మకం ఆత్మగౌరవం అభివృద్ధి ఈ మూడు సూత్రాలతో తన ప్రయాణాన్ని నిర్మించి ఉంది 1982లో నందమూరి తారక రామారావు వేసిన ఈ విత్తనం నేడు ఒక విశాల వృక్షంగా ఎదిగి మళ్లీ అధికారాన్ని అందుకుంది తెలుగువాడి ఆత్మగౌరవం అనే నినాదంతో ఎన్టీఆర్ ప్రజల్లో జ్వాలా రగిలించారు. తొలత పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి హైదరాబాద్ రోడ్ లో గల ఎన్జీ కాలేజ్ ఎదురుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి. టిడిపి నాయకులు తుమ్మల మధుసూదన్ రెడ్డి. ఎల్వి యాదవ్. కూరెళ్ళ విజయకుమార్. గుండు వెంకటేశ్వర్లు.తేలు రవి. ఇస్తారి. ఎం కే సి సిద్ధిక్, గంగాధర్ స్వరాజ్, భూతం వెంకటేశ్వర్లు కొండల్, లింగయ్య. సంపత్, మజుందర్, లచ్చుమయ్య, తిరుపతయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

## ప్రజల హక్కులను కాపాడటంలో హెచ్ఆర్సీ కీలకపాత్ర

**హెచ్ఆర్సి రాష్ట్ర అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు హనీష్ ఫాతిమా, రంజిత్ కౌర్**





**అమరచింత, మార్చి 29, (నినాదం):** హెచ్ ఆర్ సి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థగా ప్రజల హక్కులను కాపాడడంలో కీలక పాత్ర వహిస్తుందని రాష్ట్ర అధ్యక్షురాలు హనీష్ ఫాతిమా పేర్కొన్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని వర్తక సంఘం భవనంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ మానవ హక్కుల సోషల్ జస్టిస్ ఆర్గనైజేషన్ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా హెచ్ఆర్సీ ఇన్చార్జిలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మానవ హక్కులు ఉల్లంఘనకు గురైనప్పుడు ఇన్చార్జీలు విచారించాలని తెలిపారు. హక్కుల పరిరక్షణకు ప్రభుత్వానికి సలహాలు కూడా ఇవ్వాలన్నారు పౌరులు జీవించే హక్కు స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు ముఖ్యంగా అధికారులు నిర్లక్ష్య వహించినప్పుడు జోక్యం చేసుకోవాలన్నారు. అక్రమ నిర్బంధం పోలీసుల వేధింపులు వైద్య నిర్లక్ష్యం వంటి కేసులలో జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. హెచ్ఆర్సీ ఇన్చార్జులు సమాజంలో ఒక బాధ్యతతో వ్యవహరించాలని మానవ హక్కుల పట్ల ముఖ్యంగా మరింత అప్రమత్తతతో ఉండాలని సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నూతనంగా నియమించబడ్డ ఇన్చార్జి లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మానవ హక్కుల వనపర్తి జిల్లా లోగోను రాష్ట్ర నాయకుల సమక్షంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర కార్యనిర్వాహక ఇన్చార్జి మహేష్ గౌడ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ మహబూబ్నగర్ ఇన్చార్జి అశోక్ నంద మహిళా మాధురి, వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్పర్సన్ పద్మజా రెడ్డి తోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాల ఇన్చార్జులు, ఉమ్మడిమండలాల హెచ్ఆర్సీ ఇన్చార్జులు పాల్గొన్నారు.

## ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి



**మిర్యాలగూడ మార్చి 29 (నినాదం):** ఆరుగాలం శ్రమించి పండించిన రైతుల వరి ధాన్యం కొనుగోలులో మిల్లర్లు రోజుకో విధానం పాటించడం వల్ల రైతు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరే పల్లి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రైతు సంఘం నాయకులు మండలం, పట్టణంలోని అనేక రైస్ మిల్లు కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత 20 రోజులుగా వరి ధాన్యాన్ని మిల్లర్లు 2730 రూపాయలకు పైగా కొనుగోలు చేశారని, ఒకేసారిగా 100 నుండి 150 రూపాయలు వరకు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఇది రైతాంగానికి తీవ్ర నష్టపరిచే విధంగా ఉందన్నారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు కింద వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని మిల్లులకు వరి ధాన్యం అధికంగా రావడంతో ధర తగ్గించారన్నారు. దీనికి తోడు పచ్చ గింజలు, తాలు కనబడగానే తాము ధాన్యం కొనుగోలు చేయమని పేచి పెట్టడం వల్ల రైతులు నిరాశ పడుతున్నారన్నారు. ఈ సారి విత్తనాలు దగ్గర నుండి పొలాలు కోసే వరకు అనేక ఇబ్బందులు రైతులు ఎదుర్కొన్నారని ముఖ్యంగా యూరియా బుకింగ్ యాప్ పెట్టడం వల్ల యూరియా అందక దిగుబడి తగ్గిందని వారు తెలిపారు. విషయాలన్నిటిని మిల్లర్లు అర్థం చేసుకొని రైతాంగానికి సహకరించాలని కోరారు. ధాన్యం క్వింటాలుకు 3,000 రూపాయలు చొప్పున కొనుగోలు చేసిన రైతుకు గిట్టుబాటు ధర రావటం లేదన్నారు. ఇది ఇలా ఉండగా కౌలు రైతుల పరిస్థితి మరింత ఘోరంగా ఉందని, ధాన్యం కొనుగోలు విషయంపై ప్రభుత్వం నిఘా పెంచాలని, లేని పక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. రైతాంగం సైతం అమ్మకాలపై తొందరపడకుండా వరి దాన్యం ఎండేంతవరకు ఓపిక పట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి శ్రీనివాస్రెడ్డి, గోవింద్రెడ్డి, వెంకట్ రెడ్డి ఉన్నారు.

## మహనీయుల స్ఫూర్తితో కార్యకర్తలు పనిచేయాలి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 29 (నినాదం):** హిందూ ధర్మ పరిరక్షణ కోసం చత్రపతి శివాజీ, మహారాణ ప్రతాప్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి మహనీయుల స్ఫూర్తితో కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలని హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు అరుణ్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామంలో హిందూ వాహిని నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు అరుణ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ధార్మిక, సామాజిక కార్యక్రమాలను బలోపేతం చేయడం హిందూ వాహిని ప్రధాన లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో తాటిపాముల గ్రామ హిందూ వాహిని అధ్యక్షుడిగా నరేష్ ను నియమించారు. అదేవిధంగా గ్రామ స్థాయి పూర్తి కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా నరేష్,వైస్ ప్రెసిడెంట్లుగా అఖిల్, బాలరాజ్, గోపి, నరేష్, ప్రధాన కార్యదర్శిగా రాజు, గౌరవ సలహాదారులుగా భాస్కర్, వీ.శివ,కోర్ టీమ్ గా శివ, వరదగిరి మహేష్,సభ్యులుగా రమేష్, ఎల్.నరేష్, ఆర్.అశోక్, శివ శంకర్, సోషల్ మీడియా ఇంచార్జ్ లోకేష్, సభ్యులుగా నందు, సాయి తదితరులు ఉన్నారు.

## అరైవ్ అలైవ్ ఫేజ్-3లో ఉచిత కంటి పరీక్ష శిబిరం

### రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



**పెద్దపల్లి రూరల్ మార్చి 29(నినాదం):**
అరైవ్-అలైవ్ ఫేజ్-03 కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి రూరల్ ఎస్సై మల్లేష్ ఆధ్వర్యంలో మండలంలోని రాంపల్లి గ్రామంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించబడం జరిగింది.ఈ కార్యక్రమానికి డా.అగర్వాల్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు గ్రామానికి విచ్చేసి పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరంలో సుమారు 200 మంది గ్రామస్తులు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు.వీరిలో 20 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించగా,5 మందిని కటారాక్ట్ శస్త్రచికిత్స కోసం రిఫర్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్సై మల్లేష్ మాట్లాడుతూ,వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని,సీట్ బెల్ట్,హెల్మెట్ వినియోగం ద్వారా ప్రాణాపాయాలను నివారించవచ్చని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరించారు.రోడ్డు భద్రత పై,ట్రాఫిక్ నియమాల పాటింపు గురించి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి,ప్రజలకు సురక్షిత ప్రయాణంపై సూచనలు చేశారు.

## కరెంటోళ్ల జీవితాల్లో చీకట్లు

### పట్టించుకోని విద్యుత్ సంస్థ యాజమాన్యం

### 8న జరిగే మహాధర్నాను విజయవంతం చేయండి

### విద్యుత్ కార్మికులకు టి.వి.ఏ..ఈ.జే.ఏ.సి,పిలుపు



**పెద్దపల్లి రూరల్,మార్చి29(నినాదం) :**
తెలంగాణా రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుత్ కార్మికుల జీవితాల్లో మాత్రం చీకట్లు కమ్ముకున్నాయని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే మా బతుకుచిత్రం మారుతుందని భావించిన తమకు నిరాశే ఎదురయ్యిందని,తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈమేరకు పెద్దపల్లి ప్రెస్ క్లబ్బులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కన్వీనర్ మల్లా కిషన్ రెడ్డి మాట్లాడుతూ,విద్యా అర్హతలు గల ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ చేయాలని, ఏ.పి.ఎస్.ఈ.బి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని,అన్ మ్యానుడ్ వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా పీస్ రేట్, ఒప్పంద కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని కోరారు.పిఆర్సి-2026 వేతనచట్టాన్ని అమలు చేసి జీతాలు పెంచాలన్నారు.ప్రభుత్వ, విద్యుత్ సంస్థ యాజమాన్య తీరుకు నిరసనగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నట్లు పేర్కొన్న ఆయన ఏప్రిల్ 8 న రాఘవాపూర్ డివిజన్ కార్యాలయం ఎదుట తలపెట్టిన మహాధర్నా కార్యక్రమంలో ప్రతీ కార్మికుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కోకన్వీనర్ మేడవేని ఎల్లయ్య, ఇరుగురాల్ల రమేష్,కాంపెల్లి రఘు, జూపాక వెంకటేష్,జూపక శంకర్, చెల్లోజు రాజేషం తదితరులు పాల్గొన్నారు.

## రేపు మంథని పీఏసీఎస్‌లో సర్వసభ్య సమావేశం

**మంథని, మార్చి 29 (నినాదం):**
మంథని ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు సంఘం సీఈఓ మామిడాల అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సంఘ కార్యా లయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కె. అనిల్ కుమార్ అధ్యక్షత వహించనున్నారు. సమావేశంలో 2025 ఏప్రిల్ 1 నుండి 2026 మార్చి 25 వరకు సంఘానికి సంబంధించిన జమా-ఖర్చుల వివరాలు, సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం, రైతుల ధాన్యం నిల్వల వివరాలు, సంఘ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంఘ సభ్యులందరూ ఈ సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా హాజరై, తీసుకునే నిర్ణయాల్లో భాగస్వాములు కావాలని సీఈఓ మామిడాల అశోక్ కుమార్ కోరారు.


# కీచక ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి!

**వారం గడిచిన దొరకని నిందితుడు**

**ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మరియు గిరిజన సంఘాల గర్జన!:**

**వారం గడిచినా అరెస్ట్ చేయకపోవడంపై ఆగ్రహం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి!**

**నిందితుడిని తప్పించే ప్రయత్నం చేస్తే సహించేది లేదు: సంఘాల నేతల హెచ్చరిక**



**నిర్మల్ ప్రతినిధి, మార్చి 29 (నినాదం):**
నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడి ఉదంతం జిల్లాలో పెను దుమారం రేపుతోంది. నిందితుడిపై పోక్సో కేసు నమోదై వారం రోజులు గడుస్తున్నా, పోలీసులు ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడంపై ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మరియు వివిధ గిరిజన సంఘాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే వేధింపులకు పాల్పడటం విద్యా రంగానికే తలవంపులని వారు మండిపడుతున్నారు.

**అట్రాసిటీ కేసు నమోదు చేయాల్సిందే!**
బాధిత విద్యార్థినులు గిరిజన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో, నిందితుడిపై కేవలం పోక్సో చట్టమే కాకుండా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేయాలని ఉపాధ్యాయ మరియు గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. అమాయక గిరిజన బాలికల బలహీనతను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని లైంగిక వేధింపులకు గురిచేయడం క్షమించరాని నేరమని వారు పేర్కొన్నారు. గతంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో సస్పెండ్ అయిన సదరు ఉపాధ్యాయుడు, ఇప్పుడు ఏకంగా విద్యార్థినుల జీవితాలతో ఆడుకోవడం అతని వికృత చేష్టలకు అద్దం పడుతోందని ఆరోపించారు.

**అరెస్ట్‌లో జాప్యంపై అనుమానాలు!:**
కేసు నమోదైనప్పటి నుండి నిందితుడు పరారీలో ఉన్నాడంటూ పోలీసులు కాలయాపన చేయడంపై సంఘాల నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. "అత్యాచారాలు, వేధింపుల వంటి సున్నితమైన కేసుల్లో తక్షణమే స్పందించాల్సిన యంత్రాంగం, వారం రోజులుగా నిందితుడిని పట్టుకోకపోవడం వెనుక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయి?" అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా, పోలీసులు మొద్దునిద్ర వీడకపోవడం దారుణమన్నారు.

**ఎస్పై వివరణ.. రెండు రోజుల్లో చర్యలు!:** ఈ విషయమై నిర్మల్ రూరల్ ఎస్సై స్పందిస్తూ.. జిల్లాలో వరుసగా చోటుచేసుకున్న ఇతర ఉద్రిక్త సంఘటనల వల్ల విచారణలో కొంత ఆలస్యం జరిగిందని, అయితే నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశామని తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని హామీ ఇచ్చారు.

**ఆందోళన తప్పదు!:**
నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేయకపోతే, జిల్లావ్యాప్తంగా గిరిజన సంఘాలు మరియు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడి మరియు రాస్తారోకో వంటి ఆందోళనలు చేపడతామని నేతలు హెచ్చరించారు. అమాయక విద్యార్థినులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.

## హెచ్‌సిఏలో క్లబ్బుల దందా..103 క్రికెట్ క్లబ్బులు గల్లంతు!

**రూ.69 కోట్ల విశాఖ ఒప్పందంలో భారీ దోపిడీ**

**ప్రభుత్వం స్పందించాలి!**

**టీసీఏ నిర్మల్ జిల్లా కోచ్ రామరాజు సంచలన ఆరోపణలు**



**నిర్మల్ ప్రతినిధి, మార్చి 29 ( నినాదం):**
తెలంగాణ క్రికెట్ రంగంలో భారీ కుంభకోణాలు, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని తెలంగాణ క్రికె ట్ అసోసియేషన్ (టీసీఏ) నిర్మల్ జిల్లా కోచ్ రామ రాజు సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో జరుగుతున్న క్లబ్బుల అక్రమ ప్రైవేటీకరణ నుండి ఐపీఎల్ టికెట్ల స్కామ్ వరకు పలు కీలక అంశాలను వెలుగులోకి తెచ్చారు.

**రికార్డుల నుండి 103 క్లబ్బులు మాయం!:**
హెచ్‌సీఏ వ్యవహారాలపై పర్యవేక్షణ కోసం నియ మించిన జస్టిస్ ఎన్.ఏ. కాక్రు కమిటీ నివేదికలో సభ్యత్వ వ్యవస్థలో జరుగుతున్న భారీ అవకతవకలు బయటపడ్డాయని రామరాజు తెలిపారు. గతంలో ఉన్న 103 క్రికెట్ క్లబ్బులు రికార్డుల నుండి గల్లంతవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని ఆయన పేర్కొన్నారు. కేవలం పది మంది వ్యక్తుల చేతుల్లోనే 70 క్లబ్బులు ఉండటం దారుణమని, ఒక్కో క్లబ్‌ను రూ. 1 నుండి 2 కోట్ల వరకు విక్రయిస్తూ భారీ దందా లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తు తం 80 అక్రమ ప్రైవేట్ క్లబ్బు లు చెలామణిలో ఉన్నా యని ఆయన ఆరోపిం చారు.

**రూ.69 కోట్ల విశాఖ ఒప్పందంపై మౌనమెందుకు?**
విశాఖ ఒప్పందం పేరుతో రూ. 69 కోట్ల మేర భారీ ఆర్థిక దోపిడీ జరిగిందని, దీనివల్ల అసోసియేషన్‌కు జరిగిన నష్టంపై ఇప్పటికీ రికవరీ చర్యలు చేపట్టకపో వడం అనేక అనుమానాలకు తావిస్తోందని రామరా జు పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో ప్రమేయం ఉన్నవారిపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఐపీఎల్ టికెట్ల బ్లాక్ మార్కెట్ దందా!:**
ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబం ధించి టికెట్ల స్కామ్ విచ్చలవిడిగా సాగుతోందని రామరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అసలైన క్రికెట్ అభిమానులకు టికెట్లు దక్కకుండా, కాంప్లిమెంటరీ టికెట్లు మరియు ప్లేయర్ పాసులను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. క్రికెట్ అభివృద్ధిని అడ్డుకుంటూ సొంత లాభాల కోసం పాకులాడుతున్న వారిపై పారదర్శకమైన విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## చిన్నారిని చిదిమేసిన చక్రాలు



**మంచిర్యాల, మార్చి 29 (నినాదం):** అభం శుభం తెలియని చిన్నారి జీవితాన్ని చక్రాలు చెదిమేసింది. ఓ డ్రైవర్ నిర్లక్ష్యం మృత్యువు వల్ల బోసినవ్వులను దూరం చేసింది. చిన్నారి అల్లరి పనులతో కళకళలాడే ఆ ఇంటిని విషాదం కమ్మేసింది. అప్పటి వరకు కళ్ల ఎదుటే ఉన్న బిడ్డ కొన్ని క్షణాల్లోనే లారీ చక్రాల కింద చిద్రమై ప్రాణాలు వదలడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు. ఈ సంఘటన నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బెల్లంపల్లికి చెందిన లింగంపల్లి రాజ్ కుమార్ మౌనిక కుటుంబం సీతారాం పల్లి లో ఉంటూ కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి 4 పిల్లలు ఉన్నారు. ఆదివారం మౌనిక మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని సీతారాంపల్లిలో బ్రిక్స్ కంపెనీలో పనిచేయడానికి ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్ళింది. మూడవ కూతురు శాన్వి (4), నాలుగో కూతురు చిన్నారి(10 నెలలు) చెట్టు కింద ఉంచి ఆడుకోమని చెప్పి బ్రిక్స్ నీరందిస్తుంది. ఆ సమయంలో యాష్ లోడుతో టిప్పర్ వచ్చింది. టిప్పర్ ను డ్రైవర్ రివర్స్ తీసీ యాష్ ను అన్లోడ్ చేశారు. ఈ క్రమంలో చిన్నారి చక్రాల కింద పడిపోయింది. లారీ చక్రాల కింద మృతదేహం కనిపించడంతో తల్లి కన్నీరు మున్నీరుగా రోదించింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణం చిన్నారి మృతి చెందిందని వారు పేర్కొన్నారు.

## మహిళలు అక్షరాస్యతలో ముందుండాలి



**మంథని మార్చి 29( నినాదం):**
మహిళలు చదువుకొని అక్షరాస్యతలో ముందుండాలని మల్లారం గ్రామ సర్పంచ్ పొట్ల లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం మంథని మండలం మల్లారం గ్రామంలో ఉల్లాస్ నవ భారత్ ఆధ్వర్యంలో మహిళలకు విద్యపై అవగాహన కల్పించేందుకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి కుమారుడు సీనియర్ నాయకులు శ్రీకాంత్ మహిళలందరికీ పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు చదువు దేశానికి వెలుగు అని, మహిళలు అక్షరాస్యతలో ముందుండాలి అని వివరించారు.

## రహదారిపై ఇసుక మేట



**మంచిర్యాల, మార్చి 29 (నినాదం):**
నస్పూర్ పట్టణంలో జాతీయ రహదారిపై ఇసుకమేట ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ఇసుక ఉండడంతో ద్విచక్ర వాహనాలు జారి పడిపోతున్నాయని వాహనదారులు వాపోయారు. అంతేకాక వాహనాల వెనుక వెళ్లే వాహనదారుల కళ్లలో దుమ్ము దూళి పడుతుందని వారు పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఇసుకను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రమాదాలకు స్వాగతం పలుకుతున్న ఫ్లెక్సీలు



**మంచిర్యాల, మార్చి 29 (నినాదం) :**
మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద ఉన్న ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. జాతీయ రహదారి మధ్యలో ఉన్న విభాగినిలు కనిపించేలా అధికారులు, పోలీసులు సూచికలు, బ్లింకింగ్ దీపాలు ఏర్పాటు చేయాలి. వాటి స్థానంలో నస్పూర్ పట్టణంలో ఇటీవల అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఫ్లెక్సీలు ప్రమాదకరంగా ఉన్న అధికారులు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీసీసీ కార్నర్ వద్ద నిత్యం రద్దీగా ఉండటంతో పాటు ట్రాపిక్ సిగ్నల్స్ సైతం పని చేయడం లేదు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి ఫ్లెక్సీలు తొలిగించి వాటి స్థానంలో సూచికలు, బ్లింకింగ్ దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## గంజాయి మత్తులో అమానుషం!

### మైనర్ బాలికలపై అఘాయిత్యం.. నిందితుల అరెస్ట్!



**నిర్మల్ ప్రతినిధి, మార్చి 29 (నినాదం ):**
నిర్మల్ జిల్లా కేంద్రంలో శాంతిభద్ర తలకు సవాలు విసురుతూ గంజాయి మత్తులో ఇద్దరు యువకులు మైనర్ బాలికలపై చేసిన అమానుషం స్థాని కంగా పెను కలకలం రేపింది. సోఫీ నగర్ కాలనీలో నివాసముంటున్న ఇద్ద రు దళిత మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని నిందితులు అబ్బాస్ ఖాన్, షేక్ కలీమ్ పక్కా పథకం ప్రకారం ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. గత కొంతకాలంగా గంజాయి మరియు ఇతర వ్యసనాలకు బానిసలైన ఈ యువకులు, కాలనీలో ఉన్న బాలికలను మభ్యపెట్టి, గంజాయి మత్తులో వారిని బలవంతంగా అపహరించారు.

**ఘాతుకానికి పాల్పడిన తీరు :**
నిందితులు బాలికలను పట్టణ శివార్లలోని పోచంపాడు పార్కు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ వారు ఒక బాలికపై లైంగిక దాడికి పాల్పడగా, మరో బాలిక వారి నుంచి పెనుగులాడి చాకచక్యంగా తప్పించుకుంది. భయంతో వణికిపోతూ ఇంటికి చేరుకున్న ఆ బాలిక, జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు మరియు కాలనీ వాసులకు వివరించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆగ్రహానికి గురైన స్థానికులు పెద్ద ఎత్తున పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

**రంగంలోకి దిగిన పోలీస్ యంత్రాంగం:**
ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తక్షణమే స్పందించారు. ఏఎస్పీ సాయి కిరణ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి, గంటల వ్యవధిలోనే నిందితులు అబ్బాస్ ఖాన్, షేక్ కలీమ్‌లను గాలించి పట్టుకున్నారు. బాధితులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో, నిందితులపై నిర్మల్ పోలీసులు తీవ్రమైన పోక్సో (గూజూరా) చట్టంతో పాటు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. బాధితులకు మానసిక ధైర్యాన్ని అందించడానికి మరియు తదుపరి వైద్య పరీక్షల కోసం సఖి కేంద్రానికి తరలించారు.

**గంజాయి మహమ్మారిపై ఎస్పీ సీరియస్:**
ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి విక్రయాలు మరియు వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. మైనర్ బాలికలపై ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడే వారిని సమాజం క్షమించదని, చట్టపరంగా వారికి అత్యంత కఠినమైన శిక్షలు పడేలా చూస్తామని హెచ్చరించారు. మహిళల భద్రత విషయంలో నిర్మల్ పోలీసు యంత్రాంగం రాజీ పడబోదని, పట్టణంలో నిఘాను మరింత పెంచుతామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ ఘటనతో సోఫీ నగర్ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకోగా, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు మరియు మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## మహిళలు చదువుకుంటే సమాజం అభివృద్ధి



**మంథని మార్చి 29 (నినాదం):**
మహిళలు చదువుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని ఖానాపూర్ గ్రామ సర్పంచ్ సంగెం అరుణ గట్టయ్య పేర్కొన్నారు. మంథని మండలంలో ఉజ్వల స్కీం పథకం క్రింద నిరక్షరాస్యులు అయిన మహిళలకు అక్షరాస్యత పైన అవగాహన పెంచేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మంథని మండలం ఖానాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉల్లాస్ నవ భారత్ ఆధ్వర్యంలో మహిళా పొదుపు సంఘంలో మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు మూడు విడతలో జరగనుండగా మొదటి విడత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగెం అరుణ గట్టయ్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధి మహిళల అక్షరాస్యత పైన ఆధారపడి ఉందని తెలిపారు. ఆడపిల్ల చదువు దేశానికి వెలుగు అని ఆమె సూచించారు. ప్రతి ఒక్కరూ కనీసం సంతకం చేసేలా అక్షరాస్యత పైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. మనం చదువుకోవడమే కాకుండా ఇతరులకు చదువు విలువ తెలుపలని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ గ్రామ సిఏ పుట్ట రవళ్ళ, అంగన్వాడి టీచర్ అమ్మకుంటి లక్ష్మి, ఆయా పుట్ట రజిత, తదితరులు పాల్గొన్నారు.

## నల్ల వజ్రం పురస్కారం అందుకున్న భాస్కర్ల రాజేశం



**మంచిర్యాల, మార్చి 29 (నినాదం):**
గోదావరి ఖనిలో తారా ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్, అధ్యక్షుడు సంకె రాజేశం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఉగాది పురస్కారాలు అందించారు. సింగరేణి ప్రాంతం 11 జిల్లాల్లో కోల్బెల్ట్ వివిద రంగాల్లో సేవలందించని వారికి అవార్డులు ప్రధానం చేశారు. శ్రీరాంపూర్ సింగరేణి ప్రాంతానికి చెందిన సీనియర్ రిపోర్టర్, తెలంగాణా ఉద్యమ కారుడు, సామాజిక సేవా కార్యకర్తగా భాస్కర్ల రాజేశంను గుర్తించి నల్ల వజ్రం పురస్కారం-2026 అవార్డును ప్రధానం చేశారు. ఈ అవార్డును జాతీయ ఎస్సీ మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ వడ్డెపెల్లి రాంచందర్, రామగుండం మేయర్ మహంకాలి స్వామిల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా భాస్కర్ల రాజేశం మాట్లాడుతు 30 సంవత్సరాలుగా శ్రీరాంపూర్ సింగరేణి ఏరియాలో రిపోర్టర్ గా సేవలందిస్తున్నాని, తెలంగాణా ఉద్యమం, సకలజనుల సమ్మె, జేఏసీ కోకన్వీనర్ గా సేవలందించిన తనను గుర్తించి తారా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు సంకె రాజేశం నల్ల వజ్రం పురస్కారం అవార్డు ప్రధానం చేయడం పట్ల సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. నల్ల వజ్రం పురస్కారం అవార్డు పొందిన రాజేశంను టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్రెడ్డి, ఉపాధ్యక్షుడు బండి రమేష్, కళాకారుడు గజ్జెల్లి రాజలింగులు అభినందించారు.


## ప్రపంచానికి నాగరికతను పరిచయం చేసింది హిందూ మతమే!






**నిర్మల్ ప్రతినిధి, మార్చి 29 (నినాదం):**
ప్రపంచంలోనే మొట్టమొదటి మతం హిందూ మతమని, అది ప్రపంచానికి నాగరికతను నేర్పిందని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పేర్కొన్నారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో బుధవార్ పేట్ వివేక్ నగర్ బస్తీ హిందూ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు.ఈ సందర్భంగా గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ.. చరిత్రను పరిశీలిస్తే హిందూ మతం యొక్క ప్రాచీనత మరియు గొప్పతనం స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. యుగయుగాల నుండి నేటి వరకు హిందూ మతాన్ని ఎవరూ ఏమీ చేయలేకపోయారని, మన ధర్మమే మనకు శ్రీరామరక్షగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. హిందూ మతం కేవలం భారతదేశానికే పరిమితం కాలేదని, ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ ఈ ధర్మాన్ని విశ్వసించే వారు లక్షలాది మంది ఉన్నారని వివరించారు. మనం ఆపదలో ఉన్నవారిని ఆదుకున్నప్పుడే మన ధర్మాన్ని నిజంగా కాపాడుకున్న వాళ్లమౌతామని ఆయన పిలుపునిచ్చారు. తోటి మనిషికి సహాయం చేయడమే హిందూ ధ ర్మం యొక్క మూల సూత్రమని గుర్తు చేశారు.బస్తీ ప్రజలు, హిందూ ధర్మ ప్రేమికులు పాల్గొన్నారు.

## తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం




**మంచిర్యాల, మార్చి 29(నినాదం):**
తెలంగాణలో టీడీపీ కి పూర్వ వైభవం వస్తుందని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తలారి రాజు పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్ లో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.బస్టాండ్ లో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.పార్టీ జెండా ఆవిష్కరించి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 మార్చి 29న నందమూరి తారక రామారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అప్పటినుంచి తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి పెద్దపల్లి శంకర్,ప,మంచిర్యాల కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి గరిగంటి రాజయ్య,టిడిపి నాయకులు బుజ్జెటి మల్లయ్య, దేశిని తిరుపతి పాల్గొన్నారు.

## 6న బాసరకు

## సిఎం రేవంత్ రెడ్డి పర్యటన ఖరారు

### -100 కోట్లతో బాసర ఆలయ పునర్నిర్మణానికి శంఖుస్థాపన

### -200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమి పూజ



**నిర్మల్ ప్రతినిధి, భైంసా: మార్చ్ 29(నినాదం):**
ఏప్రిల్ 6 న ఉదయం 11 గంటలకు బాసరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. బాసర లో మాస్టర్ ప్లాన్ అమలు చేయడంతో పాటు ఆలయ ఆలయపున నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలియజేశారు. అదేవిధంగా ముధోల్ లో 200 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమాన్ని బాసరలోనే చేపడతారని చెప్పారు. గత ప్రభుత్వ హాయంలో నిధులు మంజూరై అప్పటి పాలకుల నిర్లక్ష్యం మూలంగా ఆలయ పునర్నిర్మాణానికి నోచుకోలేదని ఎమ్మెల్యే అన్నారు. పలుమార్లు ఈ విషయాన్ని అసెంబ్లీలో మాట్లాడడం, ముఖ్యమంత్రికి విన్నవించడం జరిగిందని, బాసరకు ముఖ్యమంత్రి రావడం శుభ పరిణామన్నారు. బాసర ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు.

# బలపడ్డ పచ్చ బంధం..!

**బీఆర్ఎస్‌కు రమణ.. రామ్.. రామ్!**

**కీలక సమావేశానికి డుమ్మా..!**

**శల్య సారథ్యం తేటతెల్లం..!**



**జగిత్యాల ప్రతినిధి మార్చి 29 (నినాదం) :** వెనుకా ముందు ఆలో చించకుండా తొందరపాటు నిర్ణయం తీసుకున్నామని 60 కోట్లు ఖర్చు చేసి బీసీ నాయకుడు అని ఎల్ రమణ ను ఎమ్మెల్సీ చేస్తే పార్టీకి ఆయన చేసింది ఏమీ లేదని కేటీఆర్ తన అనుంగులతో విచారం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.! కష్టకాలంలో ప్రభుత్వం పక్కన చేరి ఫిరాయింపు ఎమ్మెల్యే తో కలిసి పార్టీకి నష్టం చేసినట్లు టిఆర్ఎస్ అధిష్టానం ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. జగిత్యాల రాజకీయా పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఒక్క ఫిరాయింపు సమస్యతో జగిత్యాల జిల్లా రాజకీయాలు అస్తవ్యస్తమ య్యాయి. ఎవరు ఏ పార్టీలో ఉన్నారో జెండా ఏంటో ఎజెండా ఏంటో అర్థం కాని దుర్భర పరిస్థితి నెలకొంది. కలిసి పనిచేసుడనే ఓ కాన్సెప్ట్ తీసుకొచ్చి పార్టీ సిద్ధాంతాలను బొందపెట్టి ప్రశ్నించడం ప్రతిపక్షమే లేకుండా చేసుకొని అవినీతితో అంటగాగుతున్న దౌర్భాగ్యపు రాజకీయాలను జగిత్యాల జిల్లాలో కొనసాగుతున్నా యి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాజీనామాతో ఎల్ రమణకు సెగ తగిలింది. పైకి బాగానే నటిస్తున్న జిల్లాలో ఉండి నియోజకవర్గం లోని కీలక వ్యక్తులను జీవన్ రెడ్డి చేరికను వ్యతిరేకించాలంటూ ఉకుంజారి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఫిరాయింపు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి టిఆర్ఎస్ అభ్యర్థులను ఓడగొట్టడంలో ఎల్ రమణ ముఖ్య భూమిక పోషించారని ఆరోపణల ను కెసిఆర్ బలంగా నమ్మినట్లు తెలుస్తుంది. పచ్చ పార్టీ దోస్తానా బలపడినట్లు అనేక సందర్భాల్లో ఎల్ రమణ సీఎంను కలిసి ఫిరాయింపు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో విడుదల చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఇచ్చిన పండును ఖర్చు చేసి స్థానిక ప్రజాప్రతినిధులను కోఆర్డినేట్ చేసి మంచి ఫలితాలు సాధించాలని కేటీఆర్ దశ దిశా నిర్దేశం చేసి పంపితే ఎల్ రమణ సెల్య సారథ్యం వహించి ఫిరాయింపు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు పరోక్షంగా సహాయం చేసినట్లు సెకండ్ క్యాడర్ చేసిన ఆరోపణలకు బలం చేకూరింది. శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జగిత్యాల టిఆర్ఎస్ నియోజకవర్గం ఇంచార్జ్ వసంత సురేష్లు లకు కేటీఆర్ నుంచి పిలుపు వచ్చింది. వీరంతా హుటాహుటిన హైదరా బాద్కు వెళ్లి జగిత్యాల నియోజకవర్గం లో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై దాదాపు నాలుగు గంటల పాటు చర్చించారు. ఈ సమావేశానికి ఎల్ రమణ డుమ్మా కొట్టడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎల్ రమణకు సీఎం రేవంత్ రెడ్డికి గతంలో తెలుగుదేశం పార్టీలో పని చేసిన అనుభవము మంచి సాంఘిత్య ఉంది. అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బాల్యమిత్రుడు ఇవన్నీ కూడగట్టుకొని రానున్న రోజుల్లో కాంగ్రెస్ వైపు నుంచి తన కుమారుడికి మంచి స్థానం లభిస్తుందని రమణ కాంగ్రెస్ ముఖ్యులతో కలిసి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పుడే పార్టీ మారిస్తే బాగోదని దీనికి ఇంకా రెండు సంవత్సరాల సమయం ఉందని అప్పటివరకు ఈ పరిణామాలను బేరీజు వేసుకుంటూ బిఆర్ఎస్ ను అస్థిరపరిచే పని కాంగ్రెస్ అధిష్టానం కణసన్నలో చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తుంది. వీటిని పసిగట్టిన జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దావసంతలు కలిసి కేటీఆర్ వివరించినట్లు తెలిసింది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి ని చేర్చుకోవడంతో జిల్లాలో పార్టీ బలపడడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఒక ట్రెండ్ క్రియేట్ అవుతుందని ఈ సమావేశంలో నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. నిజాయితీ గల రాజకీయ నాయకుడు ప్రజల్లో మంచి పేరున్న జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకోవడంతోపాటు సముచిత స్థానం కల్పిస్తున్న మనీ కెసిఆర్ హామీ ఇచ్చినట్లు ఈ సమావేశంలో కేటీఆర్ వెల్లడించినట్లు తెలుస్తుంది. ఎల్ రమణ కు ప్రత్యేక క్యాడర్ అంటూ లేదు. పాత టిడిపి వ్యక్తులు పిడికెడు మంది ఆయన వెంట తిరుగుతున్నట్టు తెలుస్తుంది. టిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఫిరాయింపు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో తిరిగిన రమణా తో తిరిగిన ప్రశ్నించే వారు లేకపోవడంతో టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ జగిత్యాల నియోజకవర్గం లో కలగూరగంపగా మారిపోయింది. టిఆర్ఎస్ అధిష్టానం ఎల్.రమణను దూరం పెడితే అతి త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు స్పష్టం అవుతుంది. నియోజకవర్గాల ఫైబర్ కేషన్ అవుతున్న నేపథ్యంలో తన కుమారుడికి బెర్త్ దొరుకుతుందనే ఆశతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది.



## ఉజ్వల ఉగాది స్వర్ణ నంది పురస్కారాలు 2026



**కీసర, మార్చి 29, (నినాదం) :** కీసర సర్కిల్, నాగారం డివిజన్, రాంపల్లి సుచిత్ర కాలనీ లలిత కళ నాట్యమండలి నంది అవార్డు గ్రహీత మాధురి వేణు గోపాల్ శిష్య బృందముచే శ్రీ త్యాగరాయ గాన సభలో ఘనంగా కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. దీనిలో భాగంగా పలువురు ప్రముఖులు, గురువులు విచ్చేసి కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొ చిన్నారులకు, గురువులకు ప్రశంస సీల్డ్ పురస్కారాలు బహుకరించారు.

## మానేరు రివర్ ఫ్రంట్ పనుల వేగం పెంచాలి

**పెండింగ్ అంశాలపై సమీక్ష త్వరలో క్షేత్రస్థాయి పర్యటన**

**జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**కరీంనగర్, మార్చి 29(నినాదం) :** కరీంనగర్‌లో ప్రతిష్టాత్మక మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పురోగతిపై జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆది వారం సమీక్ష సమావేశం జరి గింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నిధుల లభ్యత, పూర్తి చేయడంలో ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా చర్చిం చారు. పనుల్లో ఆలస్యం లేకుండా యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. భూసేకరణ, అంచనా వ్యయం వంటి అంశాలపై స్పష్టమైన నివేదికలు సమర్పించాలని సూచించారు. నీటిపారుదల, పర్యాటక శాఖలకు సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని పేర్కొన్నారు.త్వరలోనే మంత్రుల బృందం ప్రాజెక్టు ప్రాం తాన్ని సందర్శించి పనులను పరిశీలించ నున్నట్లు తెలిపారు. కరీంనగర్‌ను పర్యాటక కేంద్రంగా అభి వృద్ధి చేయడంలో ఈ ప్రాజెక్టు కీలకమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రజాప్రతి నిధులు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సమాజాన్ని చైతన్యం చేసే వ్యక్తి ఉపాధ్యాయుడు

**రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి**



**వనపర్తి ప్రతినిధి, మార్చి 29 (నినాదం) :** సమాజాన్ని చైతన్యం చేసే వ్యక్తి ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. పెద్దమందడి మండలం మోజర్ల, మద్దిగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తూ పదవి విరమణ పొందిన ధనరాజ్ రానదేవ్ సన్మాన కార్యక్రమం ఆదివారం వనపర్తి పట్టణంలోని ఆర్ జీ గార్డెన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ 36 సంవత్సరాలుగా ఉపాధ్యాయ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి మోజర్ల, మద్దిగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధనరాజ్ రానదేవ్ పదవి విరమణ చేయడం గొప్ప విషయని అన్నారు. ధనరాజ్ రానదేవ్ విద్యాబోధనలో అశేష ప్రతిభతో బోధించి ఎందరో విద్యార్థులకు బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ధనరాజ్ రానదేవ్ క్రమశిక్షణతో స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందారని అన్నారు. పదవి విరమణ అనేది అనివార్యమని, ప్రతి ఒక్కరు పదవి విరమణ పొందవలసి వస్తుందని అన్నారు. ధనరాజ్ రానాదేవ్ భావి జీవితం సుఖసంతోషాలతో, ఆయురా రోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కోర్టు ఫ్లీడర్ కిరణ్ కుమార్, వనపర్తి మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, నాయకులు అబ్దుల్లా, నందిమల్ల రామ్, ద్వారాపోగు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## అగ్నివీర్ నియామకాలపై యువతకు ఎస్పీ పిలుపు

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, కొయ్యూరు ఎస్సై నరేశ్**



**మల్కర్, మార్చి 29 (నినాదం):** భారత సైన్యంలో అగ్నివీర్ నియామకాల కోసం 2027 సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ (ఐపిఎస్) పిలుపునిచ్చారు.ఇండియన్ ఆర్మీలో చేరాలని ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫిబ్రవరి 2026 నుండి ఏప్రిల్ 1, 2026 వరకు అధికారిక (https://www.joinindianarmy.nic.in) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసే ముందు నోటిఫికేషన్‌ను పూర్తిగా చదివి, అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఎంపిక ప్రక్రియలో రాత పరీక్ష, శారీరక సామర్థ్య పరీక్షలు, వైద్య పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. దేశ సేవలో భాగస్వాములు కావాలనుకునే యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన అన్నారు.అభ్యర్థులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణతతో పాటు ఐదు ప్రధాన విషయాల్లో 45 శాతం మార్కులు, ప్రతి విషయంలో కనీసం 33 శాతం మార్కులు సాధించి ఉండాలి. వయస్సు 17½ నుండి 22 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు.యువత శారీరక దారుఢ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, నిత్య వ్యాయామం, పరుగు, ఆరోగ్యకరమైన ఆహారం అలవాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

N NADAM CINEMA

## నాకు సినిమాలే వద్దు అనుకున్నా..

**ఆయన బలవంతం వల్లే హీరోయిన్ అయ్యా: మాళవిక నాయర్**



టాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే యంగ్ బ్యూటీ మాళవిక నాయర్, త్వరలో శర్వానంద్ సరసన 'బైకర్' చిత్రంతో అలరించేందుకు సిద్ధమవుతోంది. దాదాపు పదేళ్ల సినీ ప్రయాణంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న ఈ మలయాళ కుట్టి, తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించింది. చదువంటే అమితమైన ఇష్టం ఉన్న మాళవిక, నిజానికి ఒక ఆస్ట్రోనాట్ కావాలని కలలు కనిందట. కానీ, తన తండ్రి బలవంతం వల్లే సినిమాల్లోకి రావాల్సి వచ్చిందని ఆమె పేర్కొంది. "చిన్నప్పుడు కొన్ని యాడ్స్‌లో కనిపించాను. ఆ ఫోటోలను చూసిన దర్శకుడు నాగ్ అశ్విన్ గారు 'ఎవడే సుబ్రమణ్యం'లో అవకాశం ఇచ్చారు. నాన్నకు ఆ కథ బాగా నచ్చడంతో నన్ను బలవంతంగా ఒప్పించారు. ఆ రోజు నేను ఆ ప్రాజెక్ట్ చేయక పోయుంటే, ఈ రోజు ఇంత మంచి గుర్తింపును కోల్పోయేదాన్ని" అని మాళవిక చెప్పుకొచ్చింది. నాగ్ అశ్విన్ తన ప్రతి సినిమాలోనూ మాళవికకు అవకాశం ఇస్తూ, ఆమెను తన 'లక్కీ చార్మ్' అని పిలుస్తుంటారని తెలిపింది. అంతేకాకుండా తన కెరీర్ ప్రారంభంలోనే ఓ కండీషన్ పెట్టుకున్నట్లు వెల్లడించింది. "మొదటి సినిమా హిట్ అయిన ప్పుడే ప్రతి కథకూ ఓకే చెప్పకుండా వైవిధ్యం ఉన్న పాత్రలనే ఎంపిక చేసుకోవాలని నిర్ణయించుకున్నా, ఇప్పటికీ అదే పాటిస్తున్నా" అని స్పష్టం చేసింది. వెండి ఓతెరకు పరిచయమైన ఈ అందాల భామ, వరుస అవకాశాలతో దూసుకుపోతోంది.

## గోల్డ్ కలర్ సిల్క్ శారీలో ఆకట్టుకుంటున్న శృతిహాసన్



లోకనాయకుడు కమల్ హాసన్ గారాల పట్టి శృతిహాసన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె తమిళ చిత్రాల ద్వారా కెరీర్‌ను ప్రారంభించిన మొదట తెలుగులో మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఆ తర్వాత ఏకకాలంలో ఇటు టాలీవుడ్, అటు కోలీవుడ్ ఇండస్ట్రీలలో టాప్ హీరోయిన్‌గా కొనసాగింది. 2023లో వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, హాయ్ నాన్న, సలార్ పార్ట్--1 చిత్రాలతో వరుస విజయాలు అందుకుని ప్రేక్షకులను అలరించింది. అయితే ఆ తర్వాత ఈ బ్యూటీ కాస్త సైలెంట్ అయ్యింది. ఈ మధ్యకాలంలో ఈమె పెద్దగా సినిమాలతో ప్రేక్షకులను పలకరించలేదు. ఇప్పటివరకు ఎన్నో చిత్రాల్లో తన అందాలతో యువత హార్ట్ బీట్ పెంచిన ఈ హీరోయిన్ సోషల్ మీడియాలో కాస్త తక్కువగానే యాక్టివ్‌గా ఉంటోంది. అయితే అప్పుడప్పుడు తన హాట్ ఫోటోలతో కుర్రకారుకి సెగలు పుట్టిస్తుంది. తాజాగా శృతిహాసన్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది. అందులో ఈ నటి గోల్డ్ కలర్ సిల్క్ చీర కట్టుకొని, మెడలో హెవీ నెక్లెస్, చెవులకు జుమ్కాలు ధరించింది. చీరపై ఉన్న జరీ బోర్డర్, అలాగే మిర్రర్ వర్క్ ఉన్న స్లీవ్‌లెస్ బ్లౌజ్ ఆమె అందాన్ని మరింత తగా పెంచాయి. ఈ ఫోటో లలో ఆమె తన కురులను చక్కగా వెనక్కు వేసుకొని, కొన్ని ఫోటోలలో స్మైల్ ఇస్తూ, మరికొన్ని ఫోటో లలో కిందికి, పక్కకు చూస్తూ స్టిల్స్ ఇచ్చింది. మొత్తంగా ఈ ఫోటోలలో ఆమె చాలా అందంగా, ఆకర్షణీయంగా కనిపించడంతో ఈ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి

## సుకుమార్ బ్యానర్‌లో ప్రియదర్శి



టాలీవుడ్ ఇండస్ట్రీలో టాప్ దర్శకులలో ఒకరైన సుకుమార్ చాలా కాలం క్రితమే కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సుకుమార్ రైటింగ్స్ అనే బ్యానర్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఈ బ్యానర్‌లో పలు సినిమాలు తెరకెక్కి మంచి గుర్తింపును సంపాదించాయి. తాజా సమాచారం ప్రకారం, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో మరికొన్ని రోజుల్లో టాలీవుడ్ యువ నటుడు ప్రియదర్శి హీరోగా ఓ కొత్త సినిమా ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి ఓ కొత్త దర్శకుడు దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. అలాగే, మరికొన్ని రోజుల్లో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నట్లు టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఇక హీరోగా కెరీర్ ప్రారంభించిన తొలి దశలో ప్రియదర్శి మంచి విజయాలను అందుకుంటూ ముందుకు సాగాడు. అయితే, ఈ మధ్యకాలంలో మాత్రం ఆయనకు వరుసగా ఫ్లాప్స్ ఎదురవుతున్నాయి. ఈ వారం ప్రియదర్శి హీరోగా తెరకెక్కిన 'సుయోధన' చిత్రం విడుదలైంది. అయితే ఈ సినిమాకు కూడా ప్రేక్షకుల నుండి ఆశించిన స్థాయిలో స్పందన దక్కడం లేదని తెలుస్తోంది.

## మోడ్రన్ లుక్‌తో అభిమానులను ఫిదా చేస్తున్న బ్యూటీ



టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మొదటి చిత్రంతోనే అదిరిపోయే స్థాయి విజయాన్ని సాధించి, మంచి గుర్తింపును సంపాదించుకున్న హీరోయిన్లలో కృతి శెట్టి ఒకరు. ఈమె ఉప్పెన సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత ఈమె నటించిన పలు చిత్రాలు కూడా మంచి విజయాలను అందుకోవడంతో, ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్ స్థాయికి ఎదుగుతుందని చాలామంది అంచనా వేశారు. కానీ ఆ తర్వాత కృతి శెట్టి నటించిన కొన్ని చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో, ఈమె క్రేజ్ కూడా క్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఈ చిన్నది తెలుగుతో పాటు ఇతర భాషా చిత్రాలలో కూడా నటించడానికి ఆసక్తి చూపిస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే మలయాళం, తమిళ చిత్రాలలో కూడా నటించింది. మరికొన్ని రోజుల్లో వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ కొత్త సినిమా ప్రారంభం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రంలో కళ్యాణ్ రామ్‌కు జోడిగా కృతి శెట్టి ఎంపికైనట్లు సమాచారం. ఈ అవకాశాన్ని కృతి శెట్టి అందుకుంటే, అది ఆమె కెరీర్‌కు గోల్డెన్ ఆఫర్‌గా మారే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తాజాగా ఈ హాట్ బ్యూటీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది. ఆ ఫోటోలలో ఈమె డార్క్ గ్రీన్ కలర్ ఆఫ్-షోల్డర్ గౌన్ ధరించి, మెడలో గోల్డ్ నెక్లెస్, చెవులకు మ్యాచింగ్ ఇయర్ రింగ్స్, చేతికి బ్రేస్‌లెట్ ధరించి స్టైలిష్‌గా ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలలో కృతి శెట్టి నలుపు రంగు కురులతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తూ, తన అందంతో అభిమానులను ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ పిక్స్‌లో ఆమె తన ఎద అందాలతో ఆకట్టుకుంది. దాంతో ఈ స్టిల్స్ సోషల్ పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.





## బాహుబలి రికార్డులు బద్దలు కొట్టిన 'ధురంధర్-2'..

**నిర్మాత రియాక్షన్ ఇదే!**

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఇప్పుడు ఎక్కడ చూసినా 'ధురంధర్-2: ది రివెంజ్' పేరు మారుమోగిపోతోంది. బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్‌వీర్ సింగ్, సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య కాంబోలో వచ్చి ఓన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టిస్తోంది. విడుదలై పది రోజులు గడుస్తున్నా, థియేటర్ల వద్ద జనం రద్దీ ఏమాత్రం తగ్గడం లేదు. టాలీవుడ్, బాలీవుడ్ అనే తేడా లేకుండా అన్ని చోట్లా 'ధురంధర్-2' హవా కొనసాగుతోంది. కేవలం 10 రోజుల్లోనే ఈ సినిమా ఏకంగా 1200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. కలెక్షన్ల పరంగానే కాకుండా, భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరో సారి చాటిచెప్పింది. ఈ మూవీ సృష్టించిన అతిపెద్ద సంచలనం ఏమిటంటే.. ఉత్తర అమెరికాలో అత్యధిక వసూళ్లు రాబట్టిన భారతీయ సినిమాగా గత 9 ఏళ్లుగా 'బాహుబలి-2' అగ్రస్థానంలో ఉండేది. ఇప్పుడు ఆ రికార్డును 'ధురంధర్-2' బద్దలు కొట్టింది. ఒక రకంగా చెప్పాలంటే, ఇండియన్ సినిమా హిస్టరీలో ఇదొక చారిత్రాత్మక ఘట్టం.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787